
జ్ఞాన యోగం


విచారణ

పరమార్ధ వినోదములు


సదాశివ సమారంభాం
గురు దక్షిణామూర్తి
గురు వేదవ్యాస మహర్షి
గురు శుక మహర్షి
గురు నారద మహర్షి
గురు వాల్మీకి మహర్షి
గురు శ్రీకృష్ణ
శంకరాచార్య మధ్యమాం
గురు దత్తాత్రేయ
గురు బాబాజీ
గురు గౌతమ బుద్ధ
గురు ఆదిశంకరాచార్య
గురు రామానుజాచార్యులు
గురు జ్ఞానేశ్వర్
గురు రవిదాస్
గురు కబీర్ దాస్
గురు చైతన్య మహా ప్రభువు
గురు నానక్
గురు రాఘవేంద్ర స్వామి
గురు వీరబ్రహ్మేంద్ర స్వామి
యోగి వేమన
అస్మదాచార్య పర్యంతాం
గురు త్రైలింగ స్వామి
గురు లాహిరి మహాశయ
గురు రామకృష్ణ పరమహంస, అమ్మ శారదాదేవి
గురు వివేకానంద
గురు సాయి బాబా
గురు అరబిందో
గురు రమణ మహర్షి
గురు యోగానంద
గురు భక్తివేదాంత ప్రభుపాద
గురు మళయాళస్వామి
గురు విద్యాప్రకాశానందగిరి
గురు చంద్రశేఖర పరమాచార్య
వందే గురుపరంపరాం..

భారత ప్రభుత్వపు వెబ్ సైట్ - డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా

http://www.new.dli.ernet.in



అతి విశిష్టం ఈ దానం!

స్వామి వివేకానంద

"దానాలలోకెల్లా ఆధ్యాత్మిక విద్యాదానం చాలా శ్రేష్ఠమైంది! దాని తరువాతిది లౌకిక జ్ఞానదానం, ప్రాణదానం, అన్నదానం" అని వ్యాసమహర్షి చెప్పారు.

మన ఆధ్యాత్మిక జ్ఞానం భారతదేశ హద్దులలో నిలిచి పోకూడదు. లోకమంతటినీ ఆవరించాలి! ఇలా లోకవ్యాప్తమైన ధర్మప్రచారాన్ని మన పూర్వులు చేశారు. హైందవ వేదాంతం ఎన్నడూ ఈ దేశం దాటి పోలేదని చెప్పేవారూ, మతప్రచారార్థం తొలిసారిగా, పరదేశాలకు వెళ్ళిన సన్న్యాసిని నేనే అని చెప్పేవారూ, తమ జాతిచరిత్ర నెరుగని వారే! ఇలాంటి సంఘటనలు ఎన్నోసార్లు జరిగాయి. అవసరమైనప్పుడల్లా, భారతీయ ఆధ్యాత్మిక జ్ఞానప్రవాహం వెల్లువలా లోకాన్ని ముంచెత్తుతూ వచ్చింది.



రాజకీయ ప్రచారాన్ని రణగొణధ్వనులతో, యోధులతో సాగించవచ్చు. అగ్నిని కురిపించి, కత్తిని ఝళిపించి, లౌకిక జ్ఞానాన్నీ, సంఘనిర్మాణ విజ్ఞానాన్నీ విరివిగా ప్రచారం చేయవచ్చు. కానీ ఆధ్యాత్మిక జ్ఞానదానం కళ్ళకు కనిపించకుండా, చెవులకు వినిపించకుండా కురుస్తూ, రోజా పువ్వుల రాసుల్ని వికసింపజేసే మంచులాగా నిశ్శబ్దంగా జరగవలసి ఉంది. భారతదేశం నిరాడంబరంగా, లోకానికి మళ్ళీ మళ్ళీ చేస్తూ వచ్చిన దానమిదే!

మిత్రులారా! నేను అవలంబించే విధానాన్ని తెలియజేస్తాను వినండి. భారతదేశంలోనూ, ఇతర దేశాల్లోనూ మన పారమార్థిక ధర్మాలను బోధించడానికి తగినవారుగా మన యువకుల్ని తయారు చేయడానికై భారతదేశంలో కొన్ని సంస్థలను నెలకొల్పాలి! ఇప్పుడు మనకు కావలసింది బలిష్ఠులు, జవసంపన్నులు, ఋజువర్తనులు, ఆత్మ విశ్వాసపరులు అయిన యువకులు. అలాంటి వారు నూరుమంది దొరికినా, ప్రపంచం పూర్తిగా పరివర్తన చెందగలుగుతుంది!!

ఇచ్ఛాశక్తి తక్కిన శక్తులన్నిటి కన్నా బలవత్తరమైంది. అది సాక్షాత్తూ భగవంతుని దగ్గరి నుండి వచ్చేదే కాబట్టి దాని ముందు తక్కినదంతా లొంగిపోవలసిందే. నిర్మలం, బలిష్ఠం అయిన 'ఇచ్ఛ' (సంకల్పం) సర్వశక్తిమంతమైంది. దానిలో మీకు విశ్వాసం లేదా? ఉంటే మీ మతంలోని మహోన్నత ధర్మాలను ప్రపంచానికి బోధించడానికై కంకణం కట్టుకోండి. ప్రపంచం ఆ ధర్మాల కోసమై ఎదురుచూస్తోంది. అనేక శతాబ్దాలుగా ప్రజలకు క్షుద్రసిద్ధాంతాలు నేర్పడం జరిగింది. వారు వ్యర్థులని ప్రపంచమంతటా బోధలు జరిగాయి. ఎన్నో శతాబ్దాల నుండి వారు ఈ బోధనల వల్ల భయభ్రాంతులై, పశుప్రాయులైపోతున్నారు. తాము ఆత్మస్వరూపులమనే మాటను వినడానికైనా వారెన్నడూ నోచుకోలేదు. "నీచాతినీచుడిలో కూడా ఆత్మ ఉంది. అది అమృతం, పరమ పవిత్రం, సర్వశక్తిమంతం, సర్వవ్యాపకమైనది" అని వారికి ఆత్మను గురించి చెప్పండి. వారికి ఆత్మవిశ్వాసాన్ని ప్రసాదించండి. ❖

మూలం: శ్రీ రామకృష్ణ ప్రభ - ఫిబ్రవరి 2014



ఓమ్.

పరమార్థవినోదములు.

ప్రథమభాగము.

---

1 వ కథ.

ధర్మరాజులవారు బాల్యమున విద్యనభ్యసించునప్పుడు ఉపాధ్యాయులొకనాడొకపాఠమునిచ్చిరి. మరునాడు తోడిబాలురందరు పాఠమునువప్పగించిరి. క్రొత్తపాఠములను నేర్చుకొనుచు నిట్లు చాలదినములు గడచినను ధర్మరాజు తన కింకను మొదటిపాఠమే చక్కగ రాలేదని

చెప్పుచుండుటచే గురువులవా రాగ్రహచిత్తులై కఠినముగ గొట్టిరి. ఎంతగొట్టినను ఆబాలుఁడు కంటతడిసైనను బెట్ట కుండుటచే ఆయన మిగుల నాశ్చర్యమునొంది అందులకు కారణమడిగెను. అప్పుడా బాలుడు అయ్యా మీరు నాకి చ్చినపాఠమున రెండుమాటలు గలవు. ఒకటి "సత్యమును బల్కుము" రెండవది "ఓర్పు గలిగి యుండుము". అందు మొదటిది పూర్ణముగ నభ్యసించితిగాని రెండవది పూర్ణముగ నభ్యసింపనైతి, ఏలయన మీరు నన్ను కొట్టినపుడు మొదట నోర్చుకొంటినిగాని నెత్తురు వచ్చిన పిదప నోర్చుకొనలేక పోతినని చెప్పెను. గురువు యాబాలుని జ్ఞానవికాసమున కచ్చెరువంది తనవాక్యమునకు విచారమును బొంది, నాకింక నొకవాక్యమే బోధపడలేదనిచెప్పి యబ్బాలుని ముద్దిడి నీవే నాగురువై యుండుట కర్హుడవగెను.

2 వ కథ.

రావణాసురుని ప్రధానమంత్రి యొకనాడు రావణు నితో "దేవరా, తాము అణిమాద్యష్టసిద్ధులను స్వాధీనము

చేసుకొని యుండ రామరూపమును దాల్చి సీత నేలవశప రచుకొనకుంటి''రని యడిగెను. అంగులకు రావణుడు ''ఓరీ యవివేకీ, ఏమంటివి? పరమపావనమగు శ్రీరామచంద్రుని దివ్యరూపము నొకసారి మనమున ధ్యానించినచో, రంభా తిలోత్తమాదియప్సరసలు గూడ వల్లకాటిలో నుండు పీనుగుల బూడిదకంటె హేయముగా దోపరా! అట్లుండ నొక మానవాంగనకై నాచిత్తము యాసింపగల్గునా? యని ప్రత్యుత్తరమిడెను.

3 వ కథ.

ఒక శిష్యుడు తనగురుస్వామియందు పూర్ణమైన భక్తిగలవాడై తనగురుమూర్తియొక్క నామజపము చేయుచు నొక నదిపై నడచిపోయెను. అది యాగురువు చూచి ''అవా! నా నామమందింత మహిమగలదా! నాశక్తి నాకే తెలియకున్నదే, అని తలచి తానును యానదిని ''నేను, నేను'' అనుచు దాటపోగెను, గాని పాపమతడు మునిగి నశించెను. భక్తిచే నెంతటి యసాధ్యమును కార్యమైనను చేయ

వచ్చును, గాని యహంకారముచేనాశనమే సంభవించును

4 వ కథ.

భోజమహారాజొకనాడు ఋషిసత్తములతోడను, సామంతరాజులతోడను, పండితోత్తములతోడను, సభాసీనుడై సభికులంజూచి "మీలో నెవ్వరెవ్వరు స్వర్గమునకు బోగలైదరో చెప్పవలెను" అని వినోదముగ ప్రశ్నించెను. అప్పుడందొక్కడైన యీప్రశ్నకుత్తరమీయజాలక మానము దాల్చి కొందరును, తలలువంచికొందరును, గుసగుసలాడుచుకొందరును యూరకుండిరి. అంతలో కాళిదాసమహాకవిలేచి "ఓ భూపాలాగ్రణీ, స్వర్గమునకు నేనుబోయినబోవచ్చు" ననెను. ఇదివినినంతనే సభాసదులందరును నవ్వసాగిరి. రాజాశ్చర్యముతో "ఓ కాళిదాసా, యీసభయందిందఱుతపోనిష్ఠాగరిష్ఠులూరకుండ నీవిట్లుసాహసించి యిట్లు బల్కితి" వనెను. అప్పుడు కాళిదాసు "ఓ రాజశేఖరా, నేనుజెప్పినదాని యర్థమును మీరుగ్రహించక యిట్లు సెలవిచ్చుచున్నారు. నేనుబోయిన బోవచ్చుననగా నేను

ఆనాడి అహంకారము ఎవనికిబోవునో వాడే స్వర్గమునకు బోవుటకర్హుడుగాని నేనే పోయెదననుట కాదని చెప్పెను. రాజువాని చమత్కారమునకు మిగుల నానందించెను.

5 వ కథ.

అహమద్ అనుభక్తుడు తన మరణకాలమునందు తనలో తాను "అప్పుడేగాదు, అప్పుడేగా" దని యనుకొనుచుండెను. వెంతనున్న కుమారుడు దీనిం జూచి "నాయనా ఏమట్లనెద"వని యడిగెను. అప్పుడా భక్తుడిట్లు జవాబు జెప్పెను. ఓకుమారుడా! నాయిరుప్రక్కలయుందును దేవతలు నిలుచుండినన్ను స్వర్గమునకు దీసుకపోవుటకై విమానము దెచ్చియుంచిరి. సైతాను నాయెదుట దూరమున నిలిచి "ఓఅహమ్మద్, తుదకు నాపాశములనుండి తప్పించుకొంటివిగదా" యనెను. అందుకు అప్పుడేగాదని నేను బలుకుచుంటిని. ఏలయన గొంతుకలోనూపిరి యున్నంతవరకు సైతానుయొక్క మాయాజాలమునుండి తప్పించుకొనుట కష్టసాధ్యముగనుక నిట్లంటి"నని జవాబు చెప్పెను.

6 వ కథ.

పుట్టంధుఁడగు ధృతరాష్ట్రు డొకనాడు శ్రీకృష్ణభగవానులను కన్నులార జూడనిచ్ఛగించి యాదేవదేవుని బ్రార్థించెను. అప్పుడా సర్వశక్తుఁడు ధృతరాష్ట్రునకు నేత్రములనిచ్చి తనయభీష్టమును నెరవేర్చుకొనుమనెను. అంతట నాయంధుడు నేత్రములను గల్గినవాడై శ్రీకృష్ణస్వామిని పరికించిజూచి మహదానందంబునొంది "హా కృష్ణా కృష్ణా తక్షణమే నన్ను తిరిగి గ్రుడ్డివానిగ జేయుమ" ని వేడుకొనెను. శ్రీకృష్ణులవారు ఆశ్చర్యమును చెంది ఓధృతరాష్ట్రా తిరిగి అంధత్వమునే కోరుచుంటివేలనని ప్రశ్నించెను. అందులకాయన "హే మహానుభావా! పరమపావనంబగు నీ సచ్చిదానందస్వరూపంబును దర్శించిన కన్నులతో పాపయుతమగు నీప్రపంచమును చూడ నాయుల్లమొల్లకున్నదని జవాబు చెప్పెను.

7 వ కథ.

ఒకనాడు రుక్మిణీదేవి శ్రీకృష్ణభగవానుని గాంచి "నా

థా! నిన్ను నమ్మినవారలును, నమ్మనివారలును అందరును నీకు బిడ్డలేగదా, అట్లుండియు అందరిని నీవొకేవిధమున ప్రేమించక నీదాసులచెంతనే యెప్పుడు నుందువు. ఇట్టి పక్షపాతము నీయంతటివానికి తగునా జెప్పుమనెను. అందులకాభక్తవత్సలుడు ఓప్రాణనాయకీ! ఒకతండ్రి కిద్దరు పుత్రులుండిరి. అందొకడు సమర్థుడు. రెండవవాడు పిచ్చివాడు. ఆతండ్రి కిద్దరియందును ప్రేమయొకటిగానే యున్నను పిచ్చివాని నెక్కువ జాగరూకతతో గాపాడుచుండును. అకేవిధమున నాబిడ్డలలో ననేకులు తమస్వశక్తిపైనే భారమునైచి దేహయాత్ర గడుపుచుందురు. కొందఱుమాత్రము వారిభారమంతయు నాపైనుంచి, పసిబిడ్డలవలెనో లేక పిచ్చివారివలెనో దిరుగుచుందురు. కావున సదా వారిచెంతనేయుండి వారికి బరిచర్యలు సహితము నేనే చేయవలసియుండును'' అని ప్రత్యుత్తరమిచ్చెను.

8 వ కథ.

ఒకరాజు లక్షలకొలది ద్రవ్యము వ్యయపరచి యొక

దివ్యమైన దేవాలయము గట్టించెను. అందు భగవంతుని
విగ్రహమును బ్రతిష్ఠచేయుటకై యొక సుముహూర్తము
నిశ్చయించి యా ముహూర్తమునకందు భగవంతుని విచ్చే
యుమని ప్రార్థించెను. నాటిరాత్రి యారాజునకు స్వప్న
ములో భగవంతుడు గాన్పించి "ఓరాజా నీభక్తికి సంతసిం
చితి. నీవు నిశ్చయించిన ముహూర్తమునకు నన్ను నీదేవా
లయమునకు రమ్మని ప్రార్థించితివి నీయభీష్టమును నెర
వేర్చవలెననియున్నది, గాని సాధ్యమగునో లేదోయని సందే
హము గలుగుచున్నది. ఏలయన నీపట్టణమునకు సమీపము
నందున్న మాలపల్లెలో మద్భక్తుండగు నొకమాలవాడు నన్ను
దన దేవాలయంబున మాటిమాటికి బంధించుచుండును.
నీ ముహూర్తసమయమునకు నాతడు నన్ను విడచిన యెడల
నీమనోభీష్టమును నెరవేర్చెదనని చెప్పి యదృశ్యుండయ్యె.
ఈకల గాంచినంతనే రాజు ఆశ్చర్యమునలేచి ఆహా మాల
వాడట! దేవాలయమును గట్టించెనట! అందు భగవంతుని
బంధించుచుండునట! నేను గట్టించిన దేవాలయమునకంటె

నిది యెక్కడ సుందరముగ నుండునట నమ్మదగినదికాదు. ఐనను జూడవలెనని యెంచి యామాలవాని గుడిసెకు బోయెను. ఆచట నొక మాలవాడు పద్మాసనాసీనుండై, ధ్యాననిష్ఠయందు మగ్నుడై బాహ్యస్పృహ లేక ప్రతిమవలె గూర్చుండుట జూచి యాతడు కండ్లు తెఱచునంతకు నచటనేయుండి "ఓరీ, నీవు దేవాలయమును గట్టించితివట, అందు భగవంతుని బంధించుచుంటివట, దానిం జూపు" మని యడిగెను. బ్రహ్మజ్ఞానముతో ప్రకాశించుచున్న యాభక్తుడు చిరునగవుతో తనహృదయమును చూపి "యిదే నాదేవాలయ"మని చెప్పి తిరిగి కండ్లుమూసుకొనెను. ఇది వినినంతనే రాజు విస్మయమునొంది "ఆహా, లక్షలకొలది ద్రవ్యము కొల్లబెట్టి గట్టించిన నాయసమానమగు దేవాలయమునకంటె కాసైనఖర్చుగాని హృదయాలయమే శ్రేష్ఠతరమగుదాయని జ్ఞానము దెచ్చుకొని యామాలవానికి "నీవే నాగురువ"టంచు మ్రొక్కిపోయెను.

9 వ కథ.

ఒక జ్ఞానిచెంతకు నొక రాజుపోయి "స్వామీ భగవం

తు డెట్టివాడో వర్ణించుమనెను. అందుల కాజ్ఞాని మూడు దినములు సావకాశ మడిగెను. మూడుదినములు గడచిన పిదప రాజు తిరిగివచ్చి యడిగెను. కాని యాజ్ఞాని మరిమూడుదినములు గడు వడిగెను. ఇట్లెన్నిదినములు గడచిన నింక మూడుదినములు సావకాశమిమ్మని యడుగుచుండుటచే రాజు విసికి "ఏమి స్వామీ, ఈచిన్నప్రశ్న కిన్నిగడువులు పెట్టుచున్నారు, కారణమేమ"ని యడిగెను. అందులకాజ్ఞాని "రాజా నీవడిగినప్రశ్న మిగులకఠినమైనది. భగవంతు డెట్టివాడో వర్ణించుమనిగదా నీవడిగితివి. ఆద్యంతములులేని భగవంతుని వర్ణించుటకు యెన్నిదినములు సావకాశము పుచ్చుకున్నను చాలకున్నది. దినములేల యెన్నియుగములు తరచి చూచినను నామహాప్రభు వింకను నపారమైయున్నవాడు" అని చెప్పెను.

10 వ కథ.

ఒక రాజు తనకుమారుని విద్యాభ్యాసమునకై యొకగురువుచెంతకు బంపెను. కొంతికాలము గడచినపిదప యా

రాజు కుమారుని జూడవచ్చి పాఠశాలకు బోయి కుమారుని పరీక్షించి సమస్తశాస్త్రములలో నబ్బాలునికి గల పాండిత్యమునకు సంతసించి తుదకు నాబాలుని భగవంతు డెట్టివాడో వర్ణింపుమనెను. ఈప్రశ్నకు బాలుడుత్తరము చెప్పక యూరకుండెను. ఈప్రశ్నగాక యేమడిగినను క్షణమే జవాబిచ్చువాఁడు భగవంతుని వర్ణింపుమని అడిగినతోడనే మ్రొక్కువలె నోరుమూసుకొని యూరకుండెను. తోడిబాలురందరు నొక్కపెట్టున భగవంతుడు సచ్చిదానందస్వరూపుండనియు, నిర్వికారుండనియు, నిరామయుండనియు, సృష్టికర్త యనియు, నిర్గుణుండనియు పలువిధముల వర్ణించుచుండిరి. కాని యాబాలుడు మాత్ర మెన్నివిధముల నడిగినను జవాబు చెప్పక మౌనముద్రను దాల్చి యుండుటఁ జూచి రాజు మిగుల నాశ్చర్యంబునొందె. "ఓహో, కుమారా విద్య నేర్చినది భగవంతుని దెలిసికొనుటకే గదా, అసర్వేశ్వరుని దెలిసికొనని చదువు లెన్ని చదివిన నేమి ప్రయోజనము? జగములకెల్ల ప్రభువగు యాపరమేశ్వరునిపై వైరముబూని వానిపేరైన నుచ్చరింపనొల్లని నీవంటి దుష్టుని

ముఖము జూడరాదు ఛీ పొమ్మని నాబాలుని నావలద్రోసెను. అప్పుడారాకుమారుడు "నాయనా, కోపించకుము. మీరడిగిన ప్రశ్న కుత్తరము చెప్పలేనిగాని, మీరు గ్రహించకుంటిరి. భగవంతుని వర్ణింపుమనిగదా మీరు బ్రశ్నించితిరి. వాక్కునకును, మనస్సునకును బుద్ధికిని గూడ నతీతమగు యాపరమాత్మను వర్ణించుటకు నాదిశేషునకైనను దరమే! ఆవాఙ్మానసగోచరుండగు పరమేశ్వరుని వర్ణించుటకు మౌనముకంటె నుత్తమమైన మార్గము నాకు గాన్పించదే" దనెను. ఈమాటలకు తండ్రి మహదానందభరితుడై కుమారుని కౌగలించుకొనెను.

11 వ కథ.

పతివ్రతాశిరోమణియగు ద్రౌపది కౌరవులచే మానభంగ ప్రాప్తురాలగుచుండ, నామానినీతిలక మొకహస్తముచే దన వస్త్రము గట్టిగాఁ బట్టుకొని రెండవకరమును పైకెత్తి "హేకృష్ణా! ద్వారకావాసా, ఆపద్బాంధవా, నన్ను రక్షింపుమని విలపించుచుండెను. ఇట్లు కొంతతడవు

దుఃఖించి భగవంతుని వేఁడుకొనఁగవినిన నాయాపద్బాంధవుఁడు వచ్చియామెనురక్షించెను.

అప్పుడు ద్రౌపది "హేకృష్ణా! జగద్రక్షకా! నన్నురక్షించుట కింతతడవేల చేసితివి. నామొఱ వినినంతనే వచ్చి నన్నేల రక్షింపనైతి"వని యడిగెను అందులకు శ్రీకృష్ణభగవానులు చిరునగవుతో "ద్వారకయందుండెడికృష్ణుని గదా నీవు పిలిచితివి. ద్వారకనుండి నీచటకు వచ్చుటకు నెంతకాలము పట్టునో యోచింపు మనెను. అప్పుడు ద్రౌపది "హేకృష్ణ! సర్వవ్యాపివై యున్ననిన్ను ద్వారకవాస యని పిలిచినందులకుఁ దగినట్లు బుద్ధిచెప్పితివి. గాని మఱియొక సందేహము దీర్చుము. నీవు వచ్చియు నన్నుఁ దక్షణమే రక్షింపక కొంతతడవు వూఱకే చేతగానివానివలెఁ జూచుచుంటివి. శరణాగతరక్షకుఁ డనుబిరుదున కిది తగునా చెప్పు" మనెను. అప్పు డాభక్తవత్సలుఁడు "ఓద్రౌపదీ, నీవు చెప్పినది సత్యమే గాని నీవొక చేలతో నిన్నుఁగాపాడుకొనుచుంటివి. అప్పుడు నిన్ను రక్షించవలసినంతి

యవసరము గన్పించలేదు. పిమ్మట భారమంతయు నాపై నుంచి రెండుహస్తములను పైకెత్తితివి. అప్పుడుగదా నాబాధ్యత! అప్పుడుగదా నీవునిజముగ నన్ను నమ్మినదానవు, నన్ను నిజముగనమ్మి భారమంతయు నాపైనుంచి నప్పుడె నేను రక్షింతు'నని చెప్పి యదృశ్యుండయ్యె.

13 వ కథ

ఏసుక్రీస్తులవా రొకనాడు శిష్యులతో గూడి పోవుచుండఁగా మార్గమధ్యమున నొకచచ్చినకుక్క కనుపించెను. శిష్యులు దానింజూచి “అబ్బా యిదియెంత యసహ్యముగ నున్నది, దేహ మంతయుఁగుళ్లి పురుగులు గారుచు కండ్లులొట్టలుపోయి యెంతహేయముగాఁ గాన్పించుచున్నదో” యని యనుకొనిరి. అప్పుడా సర్వసముఁడు “ఓ బుద్ధిహీనులారా, ఆకుక్క పండ్లనుజూడుఁడీ. ఆహా, అవియెంతశుద్ధముగాను తెల్లగాను ప్రకాశించుచున్నవో! ఎప్పటికైనను మీరు దేనిని జూచినను దానియందుండెడిమంచినే గ్రహించవలెను. గాని దానియందుండెడిదోషములను బరికించరాదు”

అని హితవుచెప్పెను.

13 వ కథ.

భక్తాగ్రేసరుండగు శ్రీఆంజనేయులవారిని నేడేమితిథి యని యొకరు ప్రశ్నించిరి. అందున కాభక్తుఁడు "నాకు తిథియును తెలియదు, వారమును తెలియదు, శ్రీరామచంద్రుని పాదారవిందములు దప్ప మఱేమియు నాకుఁ దెలియదని" జవాబు చెప్పెను.

14 వ కథ.

పారశీకమతోద్ధారకుండును బ్రహ్మజ్ఞానియు నగుజొరోయాస్టరొకనాఁడు కొండగుహయందుఁ దపస్సు చేసికొనుచుండఁగా, విలువగలవస్త్రాభరణములను ధరించినయొక ప్రాపంచకుఁడా జ్ఞానిని దర్శించి "అయ్యా నాకుజ్ఞానోపదేశముఁ జేయుఁడ"ని యడిగెను. అంతట నాజ్ఞాని వాని చేతికి నొకదీపము నిచ్చి యాచటఁ బ్రమిదలో నున్నవత్తిని వెలిఁగించ మని చెప్పెను. కాని యతఁ డెన్నివిధములఁ బ్రయత్నించిన నావత్తి వెలుఁగకుండెను. అప్పుడాతపసి

"ఓసహోదరుఁడా ప్రమిదలో నేమున్నదో పరీక్షించు" మని చెప్పెను. అప్పు డాతఁడు దానిని బరిశీలించి యందుఁ జమురుకు బదులు నీరుండుటఁ గాంచెను. అంతట 'బోరాస్టరు' అయ్యా యానీటిని బారబోసి చమురు పోయుమనెను. అట్లు జేసినను నావత్తి వెలుగనందున నాతఁడు విస్మయము జెంది యందులకుఁ గారణమడిగెను. అంతట నామహానీయుఁడు "ఓసోదరా, వత్తియం దింకను నీరున్నది అదియును శుభ్రముగాఁ బోవునట్లు నెండఁ బెట్టు" మనెను. అట్లు చేసినపిమ్మట దానికి దీపము వెలిగించినమాత్రముననే వత్తిమండెను. అప్పు డామహానుభావుఁడు "అయ్యా మీరు జ్ఞానోపదేశముఁ జేసితిని నిఁకఁ బొమ్మనెను" గాని యామానవున కదేదియు గోచరించక పోవుటచే నిట్లుపదేశించెను "నీవే వత్తివి యనుకొనుము నీవు విషయభోగము లనెడినీటి యందు నానుచుంటివి. వానిని విసర్జించి భక్తియనెడిచమురు నింపుము, అట్లు చేసినను నీయందు విషయవాసనయుండును గాన వైరాగ్య మను నెండచే దానిని నిర్మూలముచేయు

ము. అజ్ఞానపేపినగాని నీయందు బ్రహ్మజ్ఞాన మనెడిజ్యోతి ప్రకాశించదు" అని బోధచేసెను.

15 వ కథ.

శ్రీకృష్ణభగవాను డొకనాఁ డొకభక్తురాలిగృహంబునకుఁ బోయెను. ఆభక్తాగ్రేసరి శ్రీకృష్ణునిదర్శనంబుచే ఆనందపరవశురాలై నేమైన ఫలహారము స్వామికి నియ్యఁదలంచి యేమియుఁ గానక తుదకుఁ గొన్నియరటిపండ్లను నొకగూటిలోఁ గాంచి చిత్తమంతయు నచ్యుతునిమీఁద నుండుటచే నొడలెఱుంగక, యాపండ్లను నొలిచి తోళ్లను తినిపించుచు గుజ్జును బాఱవేయుచుండెను. ఆకరుణాసముద్రుఁడు చిరునగవుతో నాతోళ్లను భక్షించుచుండెను. ఇంతలో నాభక్తురాలు తనయజ్ఞానమును దెలుసుకొని తాను జేసినయపరాధమునకు విక్కిలి చింతించి మిఁగిలినపండ్ల నొలిచి యతిజాగ్రతతోఁ దోళ్లుపాఱవైచి గుజ్జును శ్రీకృష్ణస్వామినోటఁ బెట్టగా నామహానుభావుఁడు దానినిగొంచము చప్పరించి తుటుకున నేలపై నుమిచెను. అప్పు డాభక్తు

రాలు నీనురాలై హే దేవాదిదేవా! నేనేమియపరాధము చేసితి? తోళ్లను బెట్టినపుడు తాముచక్కగ భుజించి గుజ్జును బెట్టినపు డేల స్వీకరింప కుండిరి? అనియాడుగ నామహాను భావుఁడు ఓభక్తాగ్రేసరీ, నీవు తోళ్లనుబెట్టినపుడు నీచిత్త మంతయు నాయందేయుండెను. గుజ్జుబెట్టినపుడు నీకు చిత్తచాంచల్యముగలిగి నీమనస్సు కొంత పండ్లయందును, గొంతతోళ్లయందును గొంతనీదేహమందును, గొంతమా త్రము నాయందును నిట్లు చెదరియున్నది. పూర్ణచిత్తముతో నాకర్పణచేసినది తృణమైనను నాకు మిక్కిలిప్రీతికరమని హితోపదేశము చేసెను.

16 వ కథ.

ఒకనాఁడుభూదేవి మిక్కిలివాడినమోము గలదై దుఃఖించుచున్న సమయమున సృష్టికర్తయగు బ్రహ్మదేవుఁడు భూదేవినిజూచి నాపెనుదుఃఖమునకుఁ గారణమడిగెను. అప్పుడుభూదేవి ఓదేవా! ఎట్టియున్నతములైన పర్వతము లైనను అట్టివిస్తీర్ణమైన వృక్షములైనను సులభముగమో

యుగలను గాని యనృతములాడుమహాపాతకులను భరింపఁ
జాలక దుఃఖించుచున్నానని చెప్పెను.

17 వ కథ.

పరమభక్తుండగు శ్రీహనుమంజనేయులవారొక్క గంతున
సముద్రమును దాఁటి శ్రీరాముల సాన్నిధ్యమునకు వచ్చి
"దేవా, మీయనుగ్రహముచే సముద్రమునయితము దాటఁగ
లిగితిని" అని చెప్పెను. అందులకు శ్రీరామచంద్రులు
"ఓహో ఆంజనేయా! సంసారమను మహాసముద్రమునే
దాఁటగలిగిన నీకీసముద్రము దాఁటుట యొకగొప్పపనియా"
యని మందహాసము చేసెను.

18 వ కథ.

మహానుభావులగు శ్రీశంకరులవారు ప్రతిదినము వారు
పూజచేసికొనినపిదప దీర్ఘప్రసాదములను దూరమునఁ గాచి
యుండు నొకమూలవానికి ముందిచ్చి పిమ్మట బ్రాహ్మణుల
కిచ్చుచుండిరి. ఇట్టిపనిచేతబ్రాహ్మణులకుఁ గష్టముగాఁ దోఁచి
దానిని సహింపఁజాలక యొకదినము ధైర్యమువహించి

యామహానుభావునిచెంతకుఁ బోయి స్వామీ మీరుసర్వజ్ఞులని యనుకొంటిమి. మీవంటిపెద్దలిట్టినింద్య మగుకార్యము నేలచేయుచుండిరో తెలియకున్నది. చతుర్వేదములను గంఠోక్తిగఁ జెప్పఁగలుగుమహనీయులుండ సమస్తశాస్త్రములను దెలిసికొనిన మహాపండితులుండఁగ, యజ్ఞయాగాదిక్రతువులనుజేసి కుండలములు ధరించినమావంటిగౌరవనీయులుండఁగ మమ్ములనందరిని నావలకుఁద్రోసి యొకపరమనీచుని నెక్కువగా గౌరవించుచుండిరి. ఆహా యిది యేమియన్యాయమని యొకపెద్దపెట్టున నవ్వసాగిరి అప్పుడాశాంతిమూర్తి చిరునగవుతో మీసందేహమును దీర్చెద శాంతము వహించుఁడని వారిని నెమ్మదిపఱిచి కొన్నియరటిపండ్లను దెప్పించి యందరికి నొక్కొక్కటినిచ్చి నేఁటిరాత్రి మీపండ్లను నెవ్వరు చూడనిరహస్యప్రదేశమునఁదిని యుదయమున నేరంపని చెప్పి పంపెను. ఆమరునాఁ డందఱును బండ్లనుదిని స్వాములవారిచెంతకువచ్చిరి. అప్పుడాయన ఓబ్రాహ్మణులారా మీరు పండ్లను దినుచుండ నెవ్వరును జూడలేదు గదా యనెను. అప్పుడు వారిలోనొకఁడయ్యా నేను

గదిలోఁ దింటిననియు నొకఁడు చీఁకటిలోఁ దింటిననియు, నొకఁడడవిలోఁ దింటిననియు, నొకఁడు ముసుగు వేసికొని తింటిననియు, నిట్లు పలువిధములఁ జెప్పిరి. పిమ్మట మాల వానినడుగఁగా నాతఁడు "అయ్యా నేను దినలే"దని చెప్పెను. బ్రాహ్మణులు పకపక నవ్వసాగిరి. అప్పుఁడామాల వాఁడిట్లు చెప్పెను. "అయ్యా నాకు రహస్యప్రదేశ మెంత వెదకినను గాన్పించలేదు. ఎందుఁ జూచినను సర్వాంతర్యామియగు శ్రీమన్నారాయణుండు గనిపించుచునే యున్నాఁడు. ఆజగదీశుఁడు లేనిస్థలము నాకెచటను గన్పించనందునఁ బండ్లను తినలేదు"ని చెప్పెను. బ్రాహ్మణులందఱు వీఁడు మహాభక్తుఁడని గ్రహించి తమయజ్ఞానమునకు సిగ్గుపడి మహానుభావుఁడగు నామాలవానికి మ్రొక్కి యిండ్లకుఁ బోయిరి.

19 వ కథ.

ఒకనాఁడు యమధర్మరాజు పకపక నవ్వుచుండెను, అప్పుడు మంత్రి "స్వామీ యేల యిట్లు నవ్వెద" రనియడిగెను. అప్పుడతిభయంకరుఁడగు నాయముఁడు "అహో

యేమివింత! ఎట్టివిపరీతము! పరమేశ్వరుని నిత్యకల్యాణదాయకంబగునావైకుంఠము చూడుము, అతిభయంకరంబును దుఃఖదాయకంబును నగునాయమపురిఁజూడుము. దినదినము నారాజ్యము మనుష్యకోటిచే నభివృద్ధిఁగాంచుటయు ననిర్వచనీయసుఖము నిచ్చువైకుంఠమునకు నెవ్వడో యొకఁడు వచ్చుటయుఁ జూచి నాకుఁ బట్టశక్యముగాని నవ్వు వచ్చుచున్న" దని జవాబు చెప్పెను.

20 వ కథ.

ఒకపండితుఁ డొకవివేకి యగురాజునొద్దకుఁ బోయి "రాజా నేనుభగవద్గీతఁ జక్కఁగాఁ దెలిసికొంటిని. ఏలినవారు పరీక్షించి బహుమానింతురని వచ్చినాఁడ" ననెను. బుద్ధిమంతుఁ డగునారాజు నీవింకను భగవద్గీతఁ జక్కఁగా నేరువలేదని తోఁచుచున్నది. ఇంటికిఁ బోయి చక్కఁగాఁ జదువుకొని వచ్చినచో మంచిబహుమాన మిత్తునని చెప్పెను. వెంటనే యాబ్రాహ్మణుఁడు తిరిగి పోయి పూర్వముకంటె నెక్కువశ్రద్ధతోఁ జదివి రాజునొద్దకువచ్చెను.

అప్పుడును రాజదేవిధమున “నీ వింకను బాగుగాఁ జదివి నట్లు కనుపించుట లేదు. తిరిగి పోయి చక్కఁగాఁ జదువు కొని వచ్చినచో మంచిబహుమాన మిత్తు”నెను. ఇట్లెన్ని మార్లువచ్చినను రాజదేప్రకారము చెప్పుచుండెను. పండితుఁడును విసుకుఁ జెందక యంతకంతకు నెక్కువశ్రద్ధతోఁ జదువుచుండ భగవద్గీతాసార మంతయు మనమునఁ బట్టి క్రమక్రమమున ననిత్యములగువిషయములందు విరక్తిఁ జెందుచుఁ దుదకుఁ బూర్ణవైరాగ్యమును జెందిపరబ్రహ్మనిష్ఠాగరిష్ఠుఁడై రాజును సహితము మఱచి యాత్మానందమున మగ్నుఁడైయుండెను. పండితుఁడు తిరిగి రాజుచెంతకు రానందునఁ దానే యాతనియింటికిఁ బోయి “ఓపండితోత్తమా బహుమానముకొఱకుఁ దిరిగి యేలరాకైతిరి” అని యడిగెను బ్రహ్మజ్ఞానముచేఁ బ్రకాశించుచున్నయావిప్రుఁడు రాజా నీ కేమిబహుమానము నా కీయ గలవు? ఈభూమండలమంతయు నాకు దాన మిచ్చినను తృణప్రాయముగాఁ జూచునంతటిభాగ్యము సంపాదించితిని. నే నిప్పుడు వాంఛాశూన్యుఁడను బరిపూర్ణసంతుష్టుఁడ నని చెప్పిమానధారియై

యుండెను. అప్పుడు రాజు “ఆహా యిప్పుడు గదా మీరు భగవద్గీతాసారమును గ్రహించితిరి” అని సాష్టాంగదండ ప్రణామ మాచరించి యింటికిఁ బోయెను

21 వ కథ.

రావణుఁడు సీతామహాదేవిని నెత్తుకొనిపోయినపిదప రామలక్ష్మణులా దేవిని వెదకుటకై పోవుచుండఁగా మార్గమధ్యమున నామె పాఱవైచిన నగలమూఁట గాన్పించెను. వానిని లక్ష్మణున కిచ్చి నీవదినయొక్క నగలను గుర్తించఁగలవా యని శ్రీరామచంద్రుఁ డడిగెను. అప్పు డాసుగుణసంపన్నుఁడు వానిని బరికించి కాళ్లనగలనుమాత్రము దీసి “దేవా యివి మాతల్లివే అందులకు సందేహము లే” దని చెప్పెను. మిగిలిననగలను నేల గుర్తించవైతి వని శ్రీరామచంద్రు డడుగ “దేవా నే నాతల్లియొక్క పాదములుతప్ప పైభాగము నెన్నఁడును జూడ లే”దని జవాబు చెప్పెను.

22 వ కథ.

సత్యశీలుఁ డగుహరిశ్చంద్ర భూపాలుని బొంకించ వల

యునని ప్రతిజ్ఞగట్టి యెన్నడో యిడుములఁ బెట్టుచున్న విశ్వామిత్రమహర్షి యొకసమయంబున మిక్కిలియాగ్రహముతో వచ్చి హరిశ్చంద్రచక్రవర్తిని దనకాలితోఁ గిరీటము పైఁదన్నెను. అప్పు డాశాంతమూర్తి కన్నీరు గార్చుచు హే దేవా ప్రభువైనతమపాదపద్మములకు నాకిరీటమందలి కఠినమైనమణులు గ్రుచ్చుకొని యెంతబాధ నొందించెనో గదా యని పరితపించెను.

23 వ కథ.

ఒకకుక్క యెంగిలివిస్తరిలోని యన్నమును దినుచుండ నుక్తీయుండినయొకసాధు వాకుక్కను గౌగిలించుకొని అన్నా నాకును గొంచెమన్నముఁ బెట్టుమని చెప్పి యావిస్తరిలోని యన్నమును దానును భుజించి పోవుచుండెను. దీని నంతయుఁ జూచుచున్న శ్రీరామకృష్ణపరమహంసల వారు తనశిష్యుని నాసాధువువెంటఁ బోయి యాతఁడు చెప్పినది తెలుసుకొని రమ్మని పంపించెను. అంత నాతఁడు వెళ్లఁగా నీ వేల నావెంట వచ్చుచున్నావని సాధు వడి

గెను. శిష్యుడు “అయ్యా నాకు జ్ఞానోపదేశముఁ జేయు” డని వేడెను. అప్పుడా సాధువు మరికి తూములోనిబురద నీరును గంగానదిలోని నిర్మలోదకమును, నొక్కటిగా జే ప్పసువాంచను, మఱియు వీణానాదమును, సంతయందలికల కలధ్వనియు నీచెవులకు నొకటిగా నెప్పుడువినఁబడునో యా ప్పుడు నీకుజ్ఞానసిద్ధి యైనట్లు తెలిసికొనుమని వెడలిపోయెను.

24 వ కథ.

మిక్కిలిహీనజాతియందుఁ బుట్టినయొకభక్తుఁడు రహస్యముగ దేవాలయముఁ జొచ్చియందలి దేవతావిగ్రహము పైన మేఁకుని నమ్మి యావిగ్రహమునకుఁ బాదపూజచేయుచు నతిభక్తితో ధ్యానము సల్పుచుండ నర్చకులుదీనింజూచి మిగుల నాగ్రహచిత్తులై వానింబంధించి న్యాయాధిపతి చెంతకుఁబంపిరి. న్యాయాధిపతి విచారించి వీఁడుచేసినతప్పునకు శిక్షగా నొకపాదమును ఖండించుఁడనియాజ్ఞనొసఁగెను. అప్పుడా మహాభక్తుఁడు “ఓతండ్రులారా! నాయందుఁ గటాక్షించి యాభగవంతునిదివ్యమంగళస్వరూపము మరియొక్క

సారికన్నీరుఁ గారవిచ్చు యిందుకుఁ గ్షగా రెండవపాద
మునుగూడ ఖండించుఁ"డని ప్రార్థించెను.

25 వ కథ.

భగవంతుఁడు దుష్టజనసంహారమునకై నృసింహావతార
ము దాల్చి దానవేంద్రుఁడగుహిరణ్యకశిపునిసంహరించిముల్లో
కములను గంగజ వణకింపఁజేయునట్టియు భూమ్యంతరిక్ష
ములు నిండినయగ్నిజ్వాలలతో భయంకరముగా నున్న
ట్టియు రూపమునుజూచి బ్రహ్మాదిదేవతలుసహితము సమీపిం
చుటకు భయమొందినవారలైయుండ భక్తాగ్రేసరుండగు
ప్రహ్లాదుఁడు భగవంతుని యెదుట నంజలిబద్ధుఁడై గజగజవ
ణకుచు నిలుచుండెను. అప్పుడానృసింహుఁడు తనప్రియ
భక్తునిఁ జూచి, "కుమారా, నాయాకారము నీకుభయముఁ గలి
గించుచున్నదా" యనియడిగెను. అందులకాభక్తశిరోమణి
"హేదేవాదిదేవా, దీనశరణ్యా, ఆనందస్వరూపుఁడవగు నీయా
కారము నాకు భయమేలపుట్టించు"ననెను. అప్పుడానుగ్ర
నృసింహుఁడు "అట్లైననీవు గజగజవణకుచుభయముఁ జెందియుం

కుటకు గారణమే'' మనియడిగెను. అంతలకు ప్రహ్లాదుడు "హే కరుణాసముద్రా, నన్ను సదా, నీదివ్యచరణారవిందము లందు నివసింపజేతువో లేక దుర్భరమగురాజ్యభారమునకై సంసారసాగరంబునఁ బడద్రోయుచుంటివో యనిఖేదించు చున్నాననెను.

26 వ కథ.

పూర్వకాలమునం దొకనాఁడు ముగ్గురుమనుష్యులు విమానమెక్కి మోక్షమునకుఁ బోవుచుండిరి. అప్పుడొక గరుత్మంతుఁడొక సర్పమును నోటఁ గఱచుకొని యెగిరిపోవుట వారికంటఁ బడెను. అందులో నొకఁడు దానింజూచి "శాబాష్, ఆపక్షిరాజ మెంతమంచిపనిఁ జేయుచున్నది! విషపురుగును సంహరించి లోకమునకు నెంతమేలు చేయుచున్నదో మా చిత్రరా యని" అనెను. అట్లనినంతనే గిఱగిఱ విమానమునుండి నరకములోనికిఁ గూలెను. రెండవ వాఁడు "అయ్యో యెంతవిచారము, పాపము దిక్కులేని పాము నాపక్షి చంపుచున్నదే, జీవహింస జరుగుచుండఁ

కన్నులారాఁ జూచి యీబాలకుండ వలసివచ్చినదే, నేనేమి సేతును" అని జాలిపడినంతనే గభాలున స్వర్గములోఁబడెను. మూఁడవవాఁడు సుఖదుఃఖములును, రాగద్వేషములును మంచిచెడుగులును మొదలగుద్వంద్వములన్నియు మాయాస్వరూపములని తెలిసికొని చరాచరప్రపంచమంతయు బ్రహ్మస్వరూపముగాఁ గాంచుచు ధ్యానమును ధరించి మోక్షసామ్రాజ్యమును జేరెను.

27 వ కథ.

ఒకబ్రాహ్మణుఁ డొకరమణీయ మగుతోఁటను వేయించెను. ఒకనాఁ డొకయావాతోటయందుఁ బ్రవేశించి యాబ్రాహ్మణుఁడు మక్కువతోఁ బెంచుచున్న మామిడిచెట్లను పాడుచేసెను. అప్పు డాబ్రాహ్మణుఁడు మిక్కిలి నాగ్రహముఁ జెంది నాయావునుగఱ్ఱతో గొట్టి చంపెను. అంతలోఁ బురజనులందఱు చేరి యాబ్రాహ్మణుని రాక్షసకృత్యమునకు నిందింపసాగిరి. కాని యాబ్రాహ్మణుఁడు "ఓ పిచ్చివారలార నన్నేల నిందించెదరు? ఆయావును నేను జంపలేదు. సకల

కార్యములకుఁ గర్తయగుభగవంతుడే దీనిని జంపెను. అదో షమాయనదే కాని నాది కాదు. అనిబ్రాహ్మణుడు వేదాంత మును బోధించుచుండెను. సర్వాంతర్యామి యగుభగవం తుఁడు దీనినివిని యొకవృద్ధబ్రాహ్మణవేషముఁ దాల్చివ చ్చియీతోఁట యెవరిదని యడిగెను. బ్రాహ్మణుఁడు "ఇ దినాదే" అనెను. అంతవృద్ధుఁడు "ఆహా! ఇదియెంతరమణీ యముగ నున్నది. ఈచెట్లనింతసొగసుగ నాటిపెంచినదెవ" రని యడిగెను. బ్రాహ్మణుఁడదికూడ నాపనియే యనిచెప్పెను. అంతట వృద్ధుఁడు "ఆహా బ్రాహ్మణుఁడా యిదంతయు నీప నియే యైయుండ నీవుచేసినగోహత్యమాత్రము నాదెట్లగును? అదియునుగూడ నీదే" యనిచెప్పి యదృశ్యుండయ్యె.

28 వ కథ.

వ్యాసమహాఋషి యొకనాఁడు చింతాక్రాంతుఁడై కూర్చునియుండ నారదులు వారిం జూచి వారిదుఃఖమునకు గారణమడిగెను. అందులకు వ్యాసులు "ఓనారదా, నేనుభా రతరామాయణాదిమహాగ్రంథములను రచించినను నాకు

హృదయశాంతి యింకనుగలుగలేదు. అందులకై కారణము విచారించుచున్నాను. నీకేమైనఁదోఁచినచో జెప్పఁగలవా" యనెను. అందులకు నారదులు "ఓ ఋషిపుంగవా, నీవు గ్రంథరచనయందే కాలముగడపితివి, గాని భగవత్సంకీర్తన చేయనైతివి. అదే కారణముసుమా" యనెను.

29 వ కథ.

ఒక క్రీస్తుమతబోధకుఁడు వీధియందు జనులకుఁదనమతమును బోధించుచు "మీవిగ్రహమునొకకర్రతోఁ గొట్టినది యేమిచేయున"ని జనులనడిగెను. వారిలోనొకఁడునీదేవుని నేనుదిట్టిన వాఁడేమిచేయఁగలఁడని తిరిగిప్రశ్నింపనా క్రిస్తవుఁడు నీవుచచ్చినవెనుక దేవునిచేతశిక్షింపబడుదువనెను. అందులకుజనులుగా నాదేవుఁడుగూడ నీవుచచ్చిన వెనుకశిక్షించు ననెను.

30 వ కథ.

ఒకడాంబికుఁడు తన్ను మహాభక్తుఁడనియందఱు ననుకొనవలయునని ప్రతిదినము దేవాలయమునకుఁబోయిదీర్ఘ

కాలమువఱకు నచటనే కండ్లమూసికొని జపమాలఁ ద్రిప్పుచుఁ గూర్చుండెను. ఇంతు చేఁ బూజారికి దేవాలయముతలుపులు వేయుటకుఁ బ్రతిదినము నాలస్యమగుచుండ విసుకుఁ జెంది యొకనాఁడు మూలవిగ్రహముచాటునఁ గూర్చుండి "ఓ భక్తాగ్రేసరా, నీభక్తికి సంతసించితి. ఇదిగో యిప్పుడు నిన్ను నాయం దైక్యము చేసుకొనుచున్నా" నని బిగ్గరగా ననెను. ఇదియా కపటభక్తుఁడువిని దేవుఁడు తన్నెక్కడ మ్రింగునో యని తిరిగి జూడక పాఱిపోయెను.

31 వ కథ.

మహాభక్తుఁడగు మహమ్మదొకనాఁ డొంటరిగా నొకచెట్టు క్రిందఁ గూర్చుండెను. అప్పుడాతని శత్రువులలో నొకఁడగు "డర్‌తర్" అను వీరుఁడు ఖడ్గము చేతఁబూని మహమ్మదులవారి చెంతకు వచ్చి కత్తినిజాపు మఓరీ నేటికిఁగదా నీ వొంటరిగా నాచేతఁజిక్కితివి. ఇప్పుడు నిన్ను రక్షించువారలెవరని బెదరించెను. అప్పుడా పరమభాగవతోత్తముఁడు కొంచమైనను జంకక యత్యంతశాంతముతో "ఓరీ పిచ్చివాఁడా? నేనొంట

రిగానున్నానని' యనుకొంటివా, సర్వజీవులకు రక్షకుఁడైన
పరమేశ్వరుఁడు లేనిచోటుగలదా? ఆతఁడే యిప్పుడునన్ను
రక్షించఁగలఁడు" అనిపల్కి భగవధ్యాన పరాయణుఁడై
నిశ్చలముగఁ గూర్చుండెను. ఆయనశాంతచిత్తమును జూచి
నంతనే యాకాఠిన్యుని మనం బించుకమెత్తపడి తనచేతను
న్నఖడ్గమును జారవిడచెను. తక్షణమే యాభక్తుఁడాకత్తిని
దీసికొని గిఱగిఱఁ ద్రిప్పుచు నిన్నిపుడెవరు కాపాడఁగలరని
'డర్ తర్'ను బ్రశ్నించెను. అప్పుడాతఁడుమిగుల భయము
నొంది "అయ్యో, యిప్పుడీ యరణ్యమందు నాకుదిక్కెవరు
నన్నురక్షింపు"మని మహాత్ములవారిపాదములపైఁ బడెను.
అప్పుడాకరుణాసముద్రుఁడు "ఓరీబుద్ధిహీనుఁడా, యిప్పుడైన
నీకుజ్ఞానములేదా. నన్నేలప్రార్థించెదవు? రక్షకులకెల్లరక్ష
కుడగు నాపరమేశ్వరునిఁ బ్రార్థించు"మని హితోపదేశము
చేసివానిని దనశిష్యునిగాఁ జేసికొనెను.

32 వ కథ.

ఏసుక్రీస్తులవారిచెంత కొకఁడువచ్చి తనభార్యమిగులజ

బ్బుగానున్నదనియూ నామెబాధ నివారణ చేయుమనియుఁ బ్రార్థించెను. అంతటనాభక్తుఁడు తనశిష్యునిపోయి యామె జబ్బుకుమర్పుమని యాజ్ఞాపించెను. కాని యాశిష్యుఁడెన్ని విధములఁ బ్రయత్నించినను నామెజబ్బునివారణ కాసందున మిక్కిలివిచారముతోడను నాశ్చర్యముతోడను దనగురువుల వారిచెంతకువచ్చి "స్వామీ యిదేమిటింత! తామొక్కసారి భగవంతునినామ ముచ్చరించినతోడనే యెట్టివ్యాధియైనను నివృత్తియగుచున్నది. నేనెన్నిమారులు భగవన్నామ ముచ్చరించినను గొంచమైనను బ్రయోజనము కలుగలేదు" అనియడిగెను. అప్పుడామహా భక్తుఁడనునీవు ఓరీ నీకింకనుభక్తి కలుగలేదు. భగవంతునియెడలఁ బూర్ణమైనభక్తివిశ్వాసమును గలవానికి నసాధ్యమైనకార్య మొకటికలదా" అనిచెప్పెను.

౩౩ వ కథ

ఒకబ్రహ్మజ్ఞానికిఁ గడుపుమీదఁ బెద్దపుండు లేచి యందుండి పురుగులుతుట్టెలు తుట్టెలుగా క్రిందపైఁ బడుచుం

డెను. అప్పుడామహానుభావుఁడాపురుగుల నొక్కొక్కటి జాగ్రతతోఁదీసి తిరిగిపుండులో వేయుచుండెను. ఇదియొకఁడుచూచి "స్వామీ మీదేహము నేలయింతగా శ్రమపెట్టుచున్నా" రనియడిగెను. అందుకాపరిపూర్ణుఁడు చిఱునవ్వుతో "ఈబ్రహ్మాండమంతయు నాదేహముగాని నీవుచూచుచున్నయీదేహము మాత్రమేకాదు. కావున దీనిని పురుగుల కాహారముగా నిచ్చిన నాకేమికొఱంత" యనిప్రత్యుత్తరమిచ్చెను.

34 వ కథ.

ఋషిశ్రేష్ఠుండగు శ్రీశుకులవారు పరిపూర్ణవిరాగమును జెంది ఘోరారణ్యముల కేగుచుండెను. మార్గమధ్యమునఁ గొందఱుఋషికన్యలు వస్త్రవిహీనులై స్నానము చేయుచుండిరి. అత్తరి నీమహానుభావుం డాదారినేపోవుట సంభవించి దిగంబరులుగా నున్నయాకాంతలమధ్యనుండి పోవుచుండెను. వీనివెనువెంటనే యీయనతండ్రి యగువ్యాసమహర్షి హాకుమారా, హాపుత్రా అనివిలపించుచుఁ బయ్యె

డుచుండెను. ఋషికన్యకలు వీనినిజూచినంతనే వేవేగబట్ట లాధరింపసాగిరి. ఈవిపరీతము వ్యాసులవారు చూచి “ఓహో యిదేటివింత” పూర్ణయవ్వనమం దున్ననాకుమారుఁడుమీమ ధ్యనుండివెళ్లినపు డావంతైన సిగ్గులేక కాటికి గాళ్లుచా చుకొనిన నావంటి వృద్ధుమీచెంతకువచ్చినంతనే యింతసి గ్గేలకలిగెనో తెలియకున్నదనెను. అందుల కాకాంతలు నవ్వుచు “ఓఋషిపుంగవా నీవువయోవృద్ధుడవైనను మహా పండితుడవైనను నీకింకను విషయంబులే చావలేదు. నీపుత్త్రు డు నిష్కళంకుఁడు నిర్గుణుఁడు, నిర్మోహుఁడు లోకాతీ తుఁడు. ఆమహానుభావుఁడు మామధ్యనుండి వెళ్లినను మమ్ము లఁ జూచియైనను నుండడు. మాయకు లోనైననీవంటివానిని జూడసిగ్గగుచున్నది. కాని మాయాతీతుండగు నీపుత్త్రునికడ మాకు సిగ్గేలయుండును?” అనిచెప్పనామునితన యజ్ఞానము నకు సిగ్గుపడికుమారుని మహావిరాగమునకు సంతసించి యిం టికిఁబోయెను.

౪5 వ కథ.

ఒకనాఁడు వేమనయోగి యొకఘోరారణ్యమందు నొక

హస్తము తలక్రింద నుంచుకొని కటిక నేలపైఁ బరుండెను. అప్పుడిద్దరు ఋషికన్యలు వచ్చి యామహానుభావునిఁ జూచి ఆహా! ఈతని వైరాగ్యము శ్లాఘనీయమే గాని యింకను నీతని నొకటి విడువకున్నదిసుమీ యని తమలోఁ దామూమాట్లాడుకొను చుండిరి. ఆయోగి దీనినివిని నతక్షణమే తనహస్తమును దల క్రిందనుంచితీసి వేసెను. అదియాకన్యకలుఁ జూచి యయ్యో నీతనినొక చే విడువకున్నదని యనుకొంటిమి గాని యితనికి నింకను రెండున్నవే యనెను. ఆవిరాగి దీనిని వినినంతనే యేమియుఁ దోఁచక వారిపాదములపైబడి వారట్లనుటకుఁ గారణము తెల్పుమని వేఁడెను. అప్పుడాకన్యలిట్లు చెప్పిరి. ఓమునిశ్రేష్ఠా! నీవు ప్రపంచమంతయు విడిచితివి గాని యింకను గొంచము సుఖము నపేక్షించి తలక్రిందఁ జేయి పెట్టుకొని పరుంటివి. ఈకొంతయొక్కటియున్నదని మేమనినంతనే చేయిదీసితివి కావున నభిమానముకూడా యింకను బూర్ణముగా నశించలేదని నిన్ను నింకను రెండు విడువలేదని యంటిమి యని''జవాబు చెప్పి వెడలిపోయిరి.

36 వ కథ.

భగవన్నామసంకీర్తనము పాడుచున్నయొక భక్తునిచెంతకు నొకఁడుపోయి "అయ్యా భగవంతుని వర్ణింపు" మని ప్రార్థించెను. వెంటనే యాభక్తుఁడు మౌనముదాల్చెను. అప్పుడాతఁడు "స్వామీ యిదేమి! భగవంతుని వర్ణించుమని యడిగినతోడనే యదివఱకుఁ బాడుచున్నపాటసహితము మానుకొని మౌనముదాల్చితిరి!" అనియడుగ నాభక్తుఁడు "అయ్యా వర్ణనాతీతం బగుదానిని వర్ణింపు మంటిరేల" యనిజవాబుఁ జెప్పెను.

37 వ కథ

ఒకచాకలివాఁడు గలఁడు. వాఁడు నిశ్చలమైనభక్తిగలవాఁడు. ఒకనాఁడు నిదురించుచు మంచికలఁ గాంచుచుండఁగా నాతని నెవరో లేపిరి. అంతనాతఁడు మిగులవిసుకుఁ జెంది "అయ్యో నన్నెందుకు లేపితిరి? చక్రవర్తిగానుండి ప్రపంచ మంతయుఁ బాలించుచుంటిని. అష్టభోగములననుభవించుచుంటిని. భార్యాపుత్రాదులతో బంగరుతూఁగుటు

య్యలలోనూఁగుచుంటివి. ఇట్టిమహద్వరము భంగము చేసితివిగ
దాయని నిట్టూర్పులు విడచెను. అప్పుడామనుజుఁడు "ఓపి
చ్చివాఁడా నీవనుభవించుచుండిన దంతయు సత్యమనుకొం
టివా? అదికలయే గాన చింతించకు" మనెను. అప్పుడా భర్తుఁ
డు" ఓరీ! పిచ్చివాఁడవు నీవుకాని నేను గాను. నాకలయెం
తయసత్యమో నేనుజాకలిగానుండుటయు నంతఅసత్యమే.
అదియెంతసత్యమో యిదియు నంతసత్యమే: నీవజ్ఞానివై
యీప్రపంచమంతయు సత్యమేయని భ్రమించుచున్నావు
గానియీరెండును వట్టికలయేసుమా" యనెను.

౪౪ వ కథ.

శ్రీరామకృష్ణపరమహంసలవారు రోగపీడితులై యున్న
తఱి శశిధరుఁ డనునొక పండితుఁడు వారిసన్నిధికి వచ్చి
"స్వామీ! మీమనస్సునొక్కక్షణము మీశరీరముపై నుంచిపె
ట్టినయెడల మీవ్యాధినిమిషములో హరించిపోవునుగదా?
అని చెప్పెను. అప్పుడాభక్తాగ్రేసరుండు "శ్రీమన్నారా
యణుని పాదారవిందములకు సమర్పించిననామనస్సు నీకు

చ్ఛదేహముపైఁ దిత్రీగిరియెట్లు పెట్టుదును" అనిజవాబుచె
ప్పెను. అప్పుడాపండితులవారు "అట్లైనమీవ్యాక్తిని గురు
త్బుమని మీజగన్మాతేఁనైన వేఁడుకొనరాదా" అనితిరిగియడి
గెను. అందులకాపరమహంస "అయ్యా సచ్చిదానందస్వ
రూపిణి యగుజగన్మాతను దలఁచినంతనే నాదేహము నేమఱ
చుచుంటినిగాన నీశరీరమువిషయమై మాతల్లిని వేఁడికోరు
టకు వీలుపడ" దని జవాబుచెప్పెను.

39 వ కథ.

ఒకదొంగ రాజుగారియింటికిఁగన్నము వేసెను. అప్పుడు
రాజును భార్యయును మాటలాడుచుండుటచే నాకన్నములో
నేయుండి వారిమాటలువినుచుండెను. రాజుభార్య నాథా
మనపుత్రికను నింతవఱకుఁ దగినవరుఁడు రాఁడయ్యె, నేమిసే
తుమని, విచారించెను. అప్పుడురాజు "ఓప్రాణనాయకీ" చిం
తించవలదు. ఇంతవరకు నేనెంతయో విచారించితిని గాని
సుగుణసంపన్నుఁడగురాకొమరుఁడొక్కఁడును గానరాఁడ
య్యె, భాగ్యవంతుఁడైనను బుద్ధిహీనున కిచ్చినవానికంటె

ధనములేకుండినను సుగుణవంతుఁడైన దరిద్రునకిచ్చినదేమేలు గావలెనటిరోజున మనపురమంతయువెదకించి యెవఁడైననో కభక్తుని రావించి వానికి మనపుత్రికనిచ్చి వివాహముచేసి వానికి సగమురాజ్యము నిచ్చెదను" అని యాదంపతులను కొను నామాటలాదొంగవిని మిగులవానందభరితుఁడై యాక న్నమునుండి మఱలియింటికిఁబోయి యుదయమునసే చక్క గస్నానముఁజేసి మహాభక్తునివలె వేషముధరించి యొకతం బురశేఁబూని నారాయణస్మరణఁ జేయుచు రాజగృహము చెంతనుండి పోవుచుండెను. భక్తునికై వెదకుచున్నయా రాజు మిగులవానందించి వానిని దగుసన్మానముతో నింటికి రప్పించి నవరత్నఖచితసింహాసనంబుపైఁ గూర్చుండబెట్టి తన ముద్దులపుత్రికను స్వీకరించుమని ప్రార్థించెను. అప్పుడా దొంగ అహా! యేమివింత, యేమియాశ్చర్యము, దొంగభక్తి కేయిట్టి మహాపదవి దొరుకుచుండగ, నిజమైనభక్తిగలిగిన యెడల నెంతమహాభాగ్యము లభించునో గదా, యనితలం చుచు నిజమైనభక్తివైరాగ్యములు గలిగినవాఁడై సింహాసన

మునుండిదిగి నారాయణస్మరణఁ జేయుచు, రాజుసమర్పిం
చిన రాజ్యమును బుత్రికనుగూడ విసర్జించి తపంబునకై
పోయెను.

40 వ కథ.

శాంతిపమణి యనురాజు నిరంతరము స్త్రీలోలుఁడై యింద్రియసుఖానుభవమునందే కాలము పుచ్చుచుండెను. ఒక్కనాఁడీరాజు మధురమగుఫలములను భుజించి తోళ్లను గిటికీగుండ నావలఁ బాఱవేయుచుండెను. అట్టిసమయమున నున్మత్తుఁడగు 'బసుగను' మహాజ్ఞాని ప్రమాదవశమునఁ గోటలోనికిబోయి యాతోళ్లను దినుచుండెను. రాజు దానిని జూచి "ఈదురాత్ముఁడిక్కడికెట్లు వచ్చెను? వీనిని బాగుగ మర్దించుఁ" డనిభటుల కాజ్ఞాపించెను. భటులు రాజాజ్ఞ ప్రకారము వానిని గొట్టుచుండిరి గానియాజ్ఞాని యేడ్పుటకుబదులు నవ్వుచుండెను. అదిరాజు చూచి యాశ్చర్యపడి ఓరిమూర్ఖా నీవు శోకించుటకు బదులు నవ్వుచుంటి వేల? కారణముఁ జెప్పుమనెను. అప్పుడాబ్రహ్మవేత్త తిరిగి నవ్వి

“ఓరాజా పాఅవైచి: పండ్లతోళ్లను భుజించు నాకీశిక్షను విధించఁగాఁ, బండ్లనుభుజించు నీకెట్టిశిక్షను భగవంతుఁడు విధించునోయనియు, రాజగృహమునకు వెలుపల వర్తించు నాకీశిక్షను విధించఁగా నంతఃపురాంతర్వర్తి వగునిన్నీశ్వ రుఁడేమి శిక్షించునో యనియు, నేకాకియగు నన్నిట్లు శిక్షించఁ బెక్కుస్త్రీలతోడఁ గ్రీడించునిన్నెట్లు లోకేశుఁడు శిక్షించునో యనియుఁ, బయలకుఁ గీడుచేయని నాకిట్లు క్రూరదండనను విధించఁగా సాపరాధివగునీకెట్టి క్రూరదం డన జగదీశ్వరుఁడు విధించునో యనియు నింద్రియనిగ్రహ ముఁజేసి భగవద్భక్తుఁడ నగునన్నిట్లు శిక్షించగా నింద్రియ కింకరుండవయి భగవద్విముఖుఁడ వగునిన్నెట్లు శిక్షించునో యనియు నవ్వితి” ననిజవాబు చెప్పెను.

41 వ కథ.

లాహోరునం దవతరించిన శ్రీరామతీర్థస్వాముల వారి నొకనాఁడు భార్యసమీపించిన “నాథా, నే నెవరి దైనది. మీకుజ్ఞాపక మున్నదా” యని యడిగెను. అప్పుడా మహా

పురుషుడు “లేదు జ్ఞాపక మనుమాటయే లేదు. నేను జ్ఞాపక ముంచుకొనుటకు నీవు నాకన్యముగా నుండినఁ గదా? బ్రహ్మాండ మంతయు నేనై యుండ నేను జ్ఞాపక ముంచుకొనుటకు నాకన్యమేమి కలదని” జవాబు చెప్పెను.

42 వ కథ.

ఒకనాఁడు శ్రీదయానందసరస్వతీ స్వాములవారిని “స్వామీ మీమనస్సునకెప్పుడు నింద్రియవికారములు గలుఁగ లేదా యని” నొకఁడడిగెను. అందుల కాపుణ్యశీలుడు “అహర్నిశములు పరమార్థప్రబంధములయందును, చింతనయందును నామనస్సు మునిఁగి యుండుటచే వేఱుచింతలు కలుగుటకు సావకాశమే లేకపోయెను.” అనిజవాబు చెప్పెను

43 వ కథ

‘సోక్రటీసు’ అనుతత్వవేత్త మరణమునొందు తఱి నొకానొకఁడు “మీరు మృత్యువున కణుమాత్రమైనను భయముఁ జెందకుండుటకుఁ గలకారణ మే” మని యడిగెను. అందుల కామహాపురుషుఁడు నవ్వుచు, “నాకు భయము లేక

పోవుటయాత్రమే కాక పరమానందమును గూడ నొందుచు న్నాను. ఏలయన నీతుచ్ఛదేహమునుండి నేఁడు నేను విముక్తి నొందుచున్నాను. నేనాత్మనుగాని శరీరముగాదు. నాకెన్నడును మృత్యువులేదు, ఈశరీరబంధన నాకు నేఁటి తో విడిపోవుచున్నది గదా యని మహదానందము గలుగు చున్నదని" జవాబు చెప్పెను.

46 వ కథ.

ఒకశిష్యుఁడు తనగురుస్వామిచెంతకుఁ జని స్వామీ, నావిలువగల కాలమంతయు నాపూర్వపుస్నేహితులు తరు చుగా వచ్చుచుండుటచే వృథాయగుచున్నది. యేకాంత మున ధ్యాననిష్ఠలు జరుపుకొనుటకు సావకాశమే లేకున్నది. అందుల కేదైన నుపాయముఁ జెప్పుఁడనియడుగ "ఓశిష్యా, నీస్నేహితులలోఁ బేదవారుగా నున్నవారికి నప్పియ్యుము. ధనికులుగా నున్నవారి నప్పడుగుము. ఇట్లుచేసితివేని నీస్నేహితులందఱు మాయమై నీకుఁదప్పక యేకాంతము లభించు" ననెను.

45 వ కథ.

శ్రీరంగావధూతలవారి నొకనాఁడమ్మహనీయుని మేనయత్త "ఓరీ నీవెప్పుడు పిచ్చిపట్టినవానివలె నూరక కూర్చుండ నేల, లే లెమ్ము, పనిపాటలు చేసుకొనుమని" కఱ్ఱతో వీపుపై మోదెను. అప్పుడాశాంతమూర్తి చిఱునవ్వు నవ్వుచు "తల్లీ నీకట్టెకుఁ దిఱిగిజవాబు చెప్పెడికట్టె దచ్చినదిసుమా" యనెను.

46 వ కథ.

శ్రీరామతీర్థస్వాములవారు బాల్యదశలో నుందుకాల మందొకనాఁడుపుస్తకము నొకదానిని జదువుచు వీథిలో నడచుచుండెను. అప్పుడొక పెద్దమనిషి యాతనింజూచి "ఓవెఱ్ఱివాఁడా పుస్తకమునుమూసి పాఠశాలకుఁబోయి చదువుకొనుము. వీథిలోఁ జదువుచుఁ బోయెదవేల యని" యనెను. అందుల కాబాలుఁడు "అయ్యా! ఈప్రపంచ మంతయు నాకుఁ బాఠశాలయే" యనిజవాబుచెప్పెను.

47 వ కథ.

ఒకనాఁడు శ్రీరామకృష్ణపరమహంసలవారిచెంత కొక డాక్టర్ పోయి "ఏమయ్యా మీవిలువఁగలకాలము నంతయు నిట్లు పిచ్చిపట్టినవానివలె వృథాపుచ్చుచున్నార"ని యడిగెను. అప్పుడాభక్తాగ్రేసరుండిట్లు జవాబు చెప్పెను. ఈప్రపంచమంతఁ బిచ్చివారు కానివారెవరు? ఈప్రపంచమే యొకపిచ్చి యాస్పత్రి: ఇందుండు వారందరును బిచ్చివారలే. కొందరుధనము కొఱకును, కొందరుకీర్తి కొఱకును గొందరు స్త్రీలకొఱకును, గొందరు ఐశ్వర్యము కొఱకును నిట్లనేకవిధములగుపిచ్చులచేఁ గాలమంతయువృథాపుచ్చుచున్నారు. నాయనా? నాకీపిచ్చులేవియుఁ బట్టక దేవుని విషయమైన పిచ్చిపట్టినది. నీచేతనైనచోఁ దగినమందిచ్చి బాగుచేసి పుణ్యము గట్టుకొనుము, యనెను.

48 వ కథ.

పిచ్చివానివలె నున్నయొకజ్ఞానిసన్నిధి కొకనవనాగరికుఁడు పోయివానిని హేళనచేయుటకై "అయ్యా! ఈలో

కమందు బిచ్చివాఁడెవ్వఁడనియడిగెను. అందుల కామహాను భావుఁడిట్లుజవాబుచెప్పెను. "రక్తము, మాంసము, చీము మొదలగువాటితో నిండివేలకొలఁదిపురుగులతోఁగూడి, మల మూత్రముల కునికిపట్టై, పేగులు నరములు నెముకలు గలిగి పచ్చితోలుతోఁ గప్పఁబడి సదాదుర్గంధమునే ప్రసరింపఁ జేయువ్రణమువంటి యిట్టిదేహమును సుందరమైనదని భ్ర మించి, దానిని మోహించు వానికంటెఁ బిచ్చివాఁడొకడుం డునా?" యని జవాబు జెప్పెను. ఆనవనాగరికుఁడు సిగ్గు పడి మఱలఁ బ్రశ్నింపకయే ఇంటికిఁ బోయెను.

49 వ కథ.

మచిలీపురమునం దవతరించిన శ్రీరంగావధూతలవారిని బాల్యమునందొకనాఁడు వారితండ్రి కొన్నిఫలములు గొని తెచ్చుటకై బజారునకుఁ బంపిరి. అంతటవారు వీధివెంబడిఁ బోవుచుండగాఁ గొందఱాకలిచేఁ బరితపించుభిక్షుకు లెదు రుపడిరి. తోడనేయాదయామయునికి మిక్కిలిదయగలిగి చేత నున్నడబ్బంతయు నాబీదలకిచ్చి "తండ్రులారా, యేదైనఁ

గొనితిని. నీ కాకలిబాధను దీర్చుకొనుము" డని చెప్పి యుత్తచే
తులతో నింటికిఁ బోయి తండ్రియొద్ద నిలచెను. అప్పుడు వారి
తండ్రి పండ్లు తెచ్చితివా యని యడుగ వాఁడు క్షాత్రగేసరుఁడు
"నాయనా తెచ్చితి" ననెను. అంతట వానితండ్రి యిటు
తెమ్మని చేయిచాచ "నాయనా, అశాశ్వతములైనట్టియు క్షణ
కాలమాత్రమే సుఖమునిచ్చునట్టియు పండ్లకుబదులు
శాశ్వతసుఖమునిచ్చు సుకృతఫలమును గొని తెచ్చితి" నని
తానుచేసిన కార్యమును వినయపూర్వకముగా విన్నవిం
చెను. తండ్రియా బాలుని ముద్దుపలుకుల కచ్చెరువునొంది
సంతోషించెను.

50 వ కథ.

నీచకులంబునఁ బుట్టినగుహుఁడు మహానుభావుండగు
శ్రీరామచంద్రుని "ఓరీ రామా" యనిపిలిచెను. అంతటలక్ష్మ
ణుఁడు మిగుల నాగ్రహముఁ జెంది వానిని జంపఁబోయెను
అప్పుడాపరమపావనుఁ డిట్లనియె "ఓయీ, లక్ష్మణా, నీవు
ప్రాణములను దీయఁబోవువాఁడు నాకుబరమమిత్రుఁడు

సుమా! నన్నుప్రేమవలన నోరీయనిపిలచెను. అట్లుపిలుచు
వాని నేనుమిక్కిలిప్రేమింతును. చండాలుఁడైనను భక్తిగల
వాఁడైనయెడల వానినిదరిజేర్తును" గాని భక్తిశూన్యుఁడైన
యెడల వాఁడుబ్రాహ్మణుఁడైనను వానిదరిఁజేర్పను. భక్తుఁడు
విషమిచ్చినను ద్రాగుదును గాని భక్తిలేనివాఁడమృతము నిచ్చి
నను స్వీకరింపనని యుపదేశించెను.

౫1 వ కథ.

ఒకానొకసమయమ్మునఁ గలిదేవత పరీక్షన్మహారాజురా
జ్యమునందుఁ బ్రవేశింపఁ జూచెను. గాని పరమపావనుఁ
డగునారాజు "ఓకలీ నీవు నారాజ్యమునం దుండుటకు స్థల
ము లేదు. నా రాజ్యము చెంతకు రాఁగూడదని" భయపెట్టెను.
అప్పుడు కలిమిక్కిలి దీనుఁడై "ఓమహారాజా అట్లైన నేనుం
డుటకుఁ దావుఁ జూపుమని" ప్రార్థించెను. ఆమాటలకుఁ
పరీక్షిత్తిట్లనియె. "ఓకలీ నీవునివసించుటకు నాల్గుస్థలము
లను జూపుచున్నాను. జూదము, మద్యపానము, పరస్త్రీ
సంగమము, జీవహింస, యనునీనాల్గుకార్యము లెచ్చటె

చ్చట జరుగుచుండునో యచ్చటచ్చట నీవు స్వేచ్ఛగా విహ రించుచుండుమనెను. అంతటఁ గలి "ఓమహారాజా, నాలు గుస్థలములయందు నివసించుట మిగులకష్టతరము. యీనా లుగువిధదోషములు గలయొకశ్రేష్ఠస్థానమును నిర్దేశింపుఁడని యరుగఁబ్రార్థించెను. అప్పుడామహారాజు "ఓకలీ. ధనమెచ ్చటచట నుండునో యచటనీవుండుము. ఈనాలుగుదోష ముల కునికిపట్టైనస్థానము ధనమేకనుక నచట నీయిష్టాను సారముగా నుండవచ్చునని" చెప్పెను.

52 వ కథ.

ధనవంతుఁడైనయొకమార్వాడీ తనయైశ్వర్యము నెల్ల విసర్జించి శ్రీరామకృష్ణపరమహంసలవారి చెంతకుఁబోయి "స్వామీ, నేనుసర్వసంగపరిత్యాగముఁ జేసినను భగవం తుఁడు గాన్పించలేదు. కారణమేమని" యడిగెను. అప్పుడా పరమహంస "పాత్రలోనున్న తైలమును బారబోసినను పాత్రయందింకను దానివాసన యంటియుండును, అట్లే నీవుసర్వవిషయములను విడచినను నీమనస్సునందు వానివా

సన యింకను నంటియున్నది. అదిపోడనశించినఁగాని నీకు భగవంతుఁడు గాన్పించఁడని'' చెప్పెను.

53 వ కథ.

శ్రీకృష్ణభగవాను లొకనాఁడు పతివ్రతాశిరోమణియు నగుకుంతిదేవిని ''నీకుయేమివరములు కావలయునని'' యడిగిరి. అప్పుడా భక్తాగ్రేసరిణి ''దేవా నాకెల్లప్పుడును గష్టములేగలుగునటుల వరముఁబ్రసాదించుఁడని'' కోరెను. శ్రీకృష్ణులవారిట్టివిపరీతపుఁ గోర్కెకువచ్చెరువునొంది యందులకుఁగారణంబడిగెను. అప్పుడా పుణ్యశీల ''హేదేవా? మనుజులు పూర్ణమైన యైశ్వర్యముతో నుండి ప్రాపంచకసుఖాభిరతులై యున్నప్పుడు మదాంధులై కన్నులుదెలియక ప్రాపంచకసుఖభోగములే శాశ్వతమనితమ్ము నిత్యానంద స్వరూపుఁడవగు నిన్ను సహితము మరచుచున్నారు. అరిగికష్టములు కలిగినతోడనే బుద్ధితెచ్చుకొని శ్రీమన్నారాయణుఁడే నాకుదిక్కు సర్వలోకములకు నాయకుఁడని సన్నిన్ను ధ్యానించుచుందురు. కావున హేదీనబంధూ! ఎప్పుడును నీపాదా

రవిందములు మరవకుండుటకై కష్టములనే కోరితినని సమాధానము చెప్పెను.

54 వ కథ.

జగత్ప్రఖ్యాతుండును, బ్రహ్మసమాజములోద్ధారకుండును. భక్తాగ్రేసరుండు నగు శ్రీ కేశవచంద్రసేనులవా రొకనాఁడు తానుధరించిన దివ్యవస్త్రముల నన్నిటినొకమూలఁ బారవైచి జుట్టుగొరిగించుకొని కౌపీనముధరించి మట్టిమూకుడొకటిచేతఁబట్టివీధిలోఁ బిచ్చమెత్తగా లభించినబియ్యమును నొకమట్టిపాత్రలో నొకబహిరంగస్థలమునవండి యన్నమును నేలపైఁబడవైచి యాయన్నమును దినుచుండెను. అప్పుడామహానుభావునితల్లి కుమారుని పిచ్చిచేష్టలకు ఖిన్నురాలై "నాయనా నేడు నీవేలయిట్టి పిచ్చిపనులుచేయుచున్నా" వనియడిగెను. అప్పుడాసుగుణసంపన్నుఁడు "ఓతల్లీ, స్వచ్ఛమై, నిష్కళంకమైననామనస్సునందు దుష్టసంకల్పమొకటికలిగినది. దానికిఁ బ్రాయశ్చిత్తముగా నీకార్యముఁ జేసితిగని" చెప్పెను.

55 వ కథ.

ముద్దులు గులుకునొక చిన్నపక్షి యొకవృక్షముపైఁ గూర్చుండి మధురమగుతనకంఠధ్వనిచే వీనులవిందుగఁ బాడుచుండఁగా నొకకిరాతుఁడు దానినొక యంబుతోఁ గొట్టి చంపెను. దీనింజూచినయొకభక్తుఁడు మిగులఖిన్నుఁడై “ఓనిర్దయుఁడా అయ్యో, అదినీకేమియపకారముఁ జేసినది? దానింగొట్టుటకు నీకుచేతులెట్లొచ్చినవి? దానియాటలు దానిపాటలు చూచిననీకానందముగలుగ లేదా” యనియడిగెను అందులకాదుష్టుఁడు “అయ్యా, మీరు దానియాటలు, పాటలు మాత్రమేచూచి యానందింతురు. నేనుదానింజంపి భక్షించికూడ నానందింతు”ననెను. అంతభక్తుఁడు “దీనింజంపిభక్షించి యానందింతునంటివిగాని రేపు దండధరుండగుయముడుచండతరంబగుగదాదండంబుచే నుగ్రుండైనిన్నుమర్దించుచుండనీవు పొందుయానందమును దలపవైతివికదా?” యని వానికి బుద్ధిచెప్పి నాటనుండి వానిని జీవహింసనుండి మఱల్చెను.

౫౬ వ కథ.

ఒకనాడు అక్బర్ చక్రవర్తి వేటకైయడవికిఁ బోగా నచట నొకఋషినిగాంచి వానితో ముచ్చటించి వానియద్భుతజ్ఞానమునకు సంతసించి వానిదరిద్రమును జూచిమిక్కిలిజాలిపడి యిట్లనియె "ఓపండితోత్తమా, నీ విట్టిదౌర్భాగ్యదశయందుండుటఁ జూచి నాకు నీమీఁదఁ గనికరము పుట్టినది. నాపట్టణమందు నీ కొకమంచిభవన మిచ్చెదను. అందుసుఖముగా నుండుము"నెను. అందులకాఋషి చిఱునవ్వు నవ్వి "రాజా, యీమనోహరమైన యరణ్యములకంటెను నిందుండుకొండగుహలకంటెను నీపట్టణములుగాని, నీభవనములు గాని సుఖప్రదములుకావు. ఇట్టిసుఖమును విడిచి నీపట్టణమందేల యుండవలె"ననెను. ఆచక్రవర్తి "అయ్యా అట్లైనయీపట్టు వస్త్రములనైన ధరించు"డని వేడెను. ఋషి "రాజా నాకీసహజంబగు చర్మవస్త్రముండఁగా తిఱిగి దీనిపై మఱియొకవస్త్రమేల చుట్టవలె"ననెను. అంతట రాజు "స్వామీ మీరు నిద్రావుటకి బంగారుపా

త్రము నైనదీసుకొను" డని ప్రార్థించెను. ఋషి "రాజా నీకు ద్రావుటకీదోసిలి చాలదా మఱియొక పాత్రతో నవసరం బేమ" నెను. అంత రాజు "ఓ మునిశ్రేష్ఠ మీరు శయనించుట కీమెత్తని పఱుపు స్వీకరించుఁడని ప్రార్థించెను. ఋషి "ఓ రాజా, పట్టువలెనున్న యీమెత్తని పచ్చిక యుండఁగ మఱియొక పఱుపు నాకేల" యనెను. "అట్లైన నో ఋషోత్తమా, మీరనుదినము భుజించుటకీ సామాగ్రి నైనఁ దీసికొనుఁడ" ని వేఁడెను. ఋషి "రాజా, నాకీయరణ్యమునందనేక ఫలములుండగా నాకివియేల" యనెను. ఈమహానుభావుని తృప్తిజ్ఞాన వైరాగ్యములకు రాజుమిగుల నాశ్చర్యముఁజెంది "అహా! యితండుగదా నిజముగ సంతుష్టాంతరంగుఁడ" నితలంచుచు నింటికిఁ బోయెను.

57 వ కథ.

అగ్బర్ చక్రవర్తి మఱియొకనాఁడొకఋష్యాశ్రమమునకు వచ్చియామునింజూచి "ఓ ఋషోత్తమా మీరు నిజముగ సర్వసంతుష్టులు; ఐనను నన్నుఁ గృతార్థుని జేయుటకై

నాగృహంబునకు విచ్చేసి నేనిచ్చు బహుమానములం గ్రహిం
చుఁడని వేడెను. ఆతపసి యందులకు సమ్మతించి వానివెం
టఁబోయెను. రాజగృహమును జేరినంతనే చక్రవర్తి యా
తపసిని సింహాసనముపైఁ గూర్చుండఁబెట్టి తాను భగవంతుని
నిట్లు ప్రార్థించుచుండెను. ఓదేవా నీకరుణచే నాకీమహా
రాజ్యభోగము కలిగినది. నీకనేకవందనములు. నాయందిం
కను బరిపూర్ణానుగ్రహముగలవాఁడవై నారాజ్యము విస్తరిం
పఁజేయుము, నాధనమును వృద్ధిజేయుము, నాబిడ్డలను దీవిం
చుము, నాకింక నింద్రభోగముల నొసంగుము" అని ప్రార్థిం
చుచుండ నామునిశ్రేష్ఠుండువిని మెల్లనలేచి వెడలిపోవు
చుండెను. అప్పుడు రాజు "ఓస్వామీ యిదిగో బహుమాన
ములను దీసుకువచ్చుచున్నాను. దయచేసి స్వీకరించుఁడని
ప్రార్థించఁగా, నావిరాగి "భిక్షుకుఁడు నాకేమి బహుమాన
ముసీయ్యఁగలఁడు! నీవు రాజువనుకొంటిని ఇంతవరకు నీవు
భిక్షమెత్తుచుండుట చూచితిని, నీవంటి దరిద్రునిబహుమానము
నేనొల్లనని చెప్పి తిరిగిపోయెను.

58 వ కథ.

అలగ్జాండరను మహావీరుఁడు దేశదేశంబుల ననివారిత శౌర్యంబున వశంబు చేసికొని, హిందూదేశమునుగూడ జయించి తిరిగితనదేశమునకుఁ బోవుచుండఁగా సింధునదీ ప్రాంతమందు నివసించుచున్నయొకతాపసి వారికంటఁబడెను. ఆమహానీయుఁడు మలమలమాడుచున్న యెండయందు నిసుకలో దిగంబరిగాఁ గూర్చుండియుండెను. ఆరాజు నవరత్నఖచితమగు కిరీటమును వాల్చి, ధగద్ధగాయమానంబగు భూషణములధరించి, గోచిపాతయైనను లేని యాతపోధనుని బారఁజూచెను. బాహ్యమున కామహానీయుఁడెంత దరిద్రుడుగాఁ గాన్పించినను వానిముఖము, మహదానందమును బ్రహ్మతేజమును గలిగియుండుటచేనాచక్రవర్తి వానింజూచినంతనే వానిపైమక్కువగలిగి తనతో దనపట్టణమునకు రమ్మనియాజ్ఞాపించెను. అంతనాతపసినవ్వి “ఓరాజా, నన్నునీపట్టణమునకు రమ్మంటివి. ఈప్రపంచమంతయు నాయందేయున్నది. ప్రపంచము నన్నుఁబట్టజాలదు.

ప్రపంచమన నేల? ఈబ్రహ్మాండమంతయు నాయందేయు న్నది. బ్రహ్మాండముసహితము నన్నుఁబట్టజాలదు. సూర్యచం ద్రాదు లుదయించుటయు నస్తమించుటయుఁ గూడనా యందే'' యనిచెప్ప నాచక్రవర్తి యిట్టివాక్యముల నెన్నఁడు వినియుండకపోవుటచే మిగుల నాశ్చర్యముఁజెంది యిట్లుచె ప్పెను ''నీకుఁగావలసినంతధనమిచ్చెదను. ప్రపంచభోగము లలో నిన్నుముంచెదను. దేవతాస్త్రీలను థిక్కరించునప్స రసలను నీకుఁబరిచారకులుగఁ జేసెదను. నీవు నైననాతోడ రమ్మ'' నెను. ఈమాటల కాజ్ఞాని తిఱిగినవ్వి ''ఈప్రపంచ ముయొక్క సౌభాగ్యముకంతకు నేనే కారణము. సూర్య చంద్రాదులు నాప్రకాశముచేత నే ప్రకాశించుచున్నారు. సృష్టిలోఁ గలసమస్తవస్తువులకు సుఖమును, సౌందర్యమును నావల్ల నేకలుగుచుండ నీవేమినాకీయఁగలవు'' అనిచెప్పెను. ఈమాటలకు రాజుగ్రుఁడైతనకత్తిని బైకెత్తి ''నీశిరస్సును ఖండించెద'' నని బెదరించెను. అప్పుడాజ్ఞాని తిరిగిపకపకనవ్వి ''రాజా నీజన్మమధ్యమం దిట్టియసత్య మెప్పుడాడియుండవు.

పుట్టుచావులులేనినన్ను నీవుచంపుటెట్లు. నేనెండకు నెండను, వానకుఁదడియను, నగ్నిచేఁగాల్పఁబడను, ఖడ్గముచేఁ దెగఁబడను. ఇప్పుడు ఖడ్గమునీవు పైకెత్తుటకుఁ గలశక్తియు నాదేసుమాయని గంభీరముగఁ బల్కినంతనే యారాజు నిస్పృహుండై విశ్చేష్టితుండై, ఖడ్గమును భూమిపైజారవిడచెను. తిరిగికొంతతడవు కారాజు స్పృహదెచ్చుకొని "ఓ తాపసీ, నాశక్తిసామర్థ్యము లెఱుంగక నీవిట్లుపల్కుచున్నావు. ఈభూమండలమునఁ గలసమస్త రాజ్యములను జయించి ప్రపంచమంతయు నేకచక్రముగా నేలుచున్ననీ రాజకేసరుండ నగుటనీవెఱుంగ" వనెను. ఋషియామాటలు వినినంతనే తిరిగి పకపకనవ్వి "ఓరాజా గర్వించకుము, నీవు జయించనట్టియు, నీకసాధ్యమైనట్టియు, మఱియొకప్రదేశముగలదు. అందుండెడి భాగ్య మసమానము. సౌఖ్యమో నిరుపమానము" అనెను. అంతట నారాజు మిగుల నాతురతతో "అహా నేను జయించనట్టిరాజ్యము నలుదిశలయందెచట నెదకినను గన్పించలేదు. అంతియేగాక అది నాకసాధ్యమనికూడ

జిక్కితివి, ఏమీవిపరీతము! ఓఋష్యోత్తమా తత్కారణమేదానిం జెప్పు" మనియడిగెను. అప్పుడామునిపుంగవుఁడు "ఓరాజా అదినీకుసాధ్యముకాదు, అచటమిక్కిలిపరాక్రమవంతు లగు నాలుగురు శూరులు కావలికాచుచుందురు. వారినిజయించినఁ గాని నీవారాజ్యముచెంతకుఁ బోఁ జాలవు, అర్ధరన నేల అందొక్కనినైన నీవు జయింపఁ జాలవు సుమా! ఒకవేళ నీయదృష్టమున వారిం గెలిచినచో వారిసేనానాయకుం డగునొకమహాశూరు డారాజ్యముచుట్టును దిరుగుచుండును యెట్టిపరాక్రమవంతులైనను వాడు భస్మీకృతము చేయును ఇట్టికష్టతరమగురాజ్యమును నీవుగెలుచుట దుస్తరములలో దుస్తరము, కావున నీగర్వము నిక జాలించు మని చెప్పెను. రాజామాటలకు మఱింత నాశ్చర్యమును జెందిదానిం జెప్పుమని బ్రతిమాలెను. అప్పుడాజ్ఞాని "ఓరాజా ఆరాజ్యముకొఱకు నీవు దూరముపోనక్కరలేదు. అదినీయందు గలమోక్షసామ్రాజ్యమే. దానిని బొందనీయక పలుకష్టములం బెట్టు కామక్రోధలోభ మోహమదమాత్సర్యము లనెడి

రక్కసులెగ్గురు గావలి గాచుచున్నవారు. వారిని జయించినపిమ్మట సంకల్ప మనెడిరాజును జయించవలెను, అప్పు డారాజ్యము నీకు స్వాధీనముకాగలదు అది నీకు సాధ్యమైనతోడనే బ్రహ్మాండమంతయు నీకు స్వాధీనమగును. అప్పుడు గదా నీవు శూరుడవు, అప్పుడుగదా నీవుచక్రవర్తివి. అప్పుడే నీవు ధన్యుడవు. కాన నీ నీడంబమును జాలించు" మని హితోపదేశము చేసెను. అలగ్జాండరు వీటి యర్థమును చక్కగ గ్రహించి "ఓతాపసేంద్రా, నాయపరాధమును క్షమించ' మని వేడి నమస్కరించి చనెను.

59 వ కథ.

విశిష్టాద్వైతమత స్థాపకుండును బరమభాగవతోత్తముండు నగుశ్రీరామానుజులవారికి వారిగురుమూర్తి రహస్యముగ నొకమంత్రమును జెప్పి దాని ప్రభావమును తెలుపంగ జేసి దానినితరులకుఁ జెప్పక యతిరహస్యముగ నుంచుమని చెప్పి యాయనచేఁ బ్రమాణము చేయించుకొనెను. ఆమ లుసటిదినమే రామానుజులు నూరంతయు జాటింపఁజేసి

జనులనందఱిని యొకచోటునకు రప్పించి తానొక యున్నతస్థలమునందు నిలిచి సంసారబద్ధులై యవివేకాంధకారములో మునిఁగి యల్లాడుచున్న యామనుష్యుల నందఱింజూచి మిగులఁజాలినొంది తాను నేర్చుకున్న మహామంత్రమును దాని ప్రభావము, గొంతెత్తి యందఱికి వినిపించునట్లు ఎలుఁగ జేసెను. అప్పుడు ప్రక్కనున్న గురువులవారు తనశిష్యుని యసత్యమునకును, నప్రమాణమునకును, ద్రోహమునకును విస్మయము చెంది ఓరి పాపీ, పరమనీచ! యెంతటిఘోర పాపమునొడిఁగట్టుకొంటివి! నీవొనరించిన గురుద్రోహమునకు రౌరవాదినరకము ప్రాప్తమగునని తెలిసియు నేల యిట్లు జేసితివని యడిగెను. అప్పుడారామానుజుఁడు రెండుహస్తములను జోడించినవాఁడై దేవా! నేనొక్కరుండను నరకకూపమునఁ బడుటచే ననేకులు తరించుచున్నారు. నాదేహమును, నాత్మయుఁగూడ మానవకోటికి రక్షణార్థమైబలిగా నర్పణచేసితినని చెప్పెను.

60 వ కథ.

శ్రీరంగావధూతలవారిని నొకపండితుఁడు "మీరువివాహము చేసుకొనరాదా" యని యడిగెను. అందుకువారు "జాతరలో దిరుగుట తేలికే గాని గంతులువేయలేకచావవలె" నని ప్రత్యుత్తర మిచ్చెను.

61 వ కథ.

ఒకయక్షుఁడు ధర్మరాజును లోకమునఁ బరమాశ్చర్యకరమైన వింతయేమని యడిగెను. అందుకు ధర్మరాజిట్లనియె. "సృష్టియందలి పిపీలికాది బ్రహ్మపర్యంతమునగల ప్రతివస్తువుయును నశించునదే యని యెఱింగియు, ననుదినము నెన్నియో జీవులు జచ్చుచుండుట కండ్లారఁ జూచుచుండియు మనుష్యుఁడు దానుమాత్రమునశింపక యెల్లకాలము స్థిరముగ నుండులాగున మంచిసంగతి నావంతయైన విచారింపకయైహికవిషయములందే పాటుపడుటకంటె నెక్కువయాశ్చర్యమేమికల" దని ప్రత్యుత్తరమిచ్చెను.

62 వ కథ.

నామదేవుఁడను పరమభాగవతోత్తముఁడు తన చిన్న

ద్రవ్యమంతయుఁ బేదలకు దానముచేయుటచే నతఁడు మిక్కిలి దరిద్రదశలో నుండఁగా కరుణాపూర్ణుండగు భగవంతుఁడు గ్రహించి యాభక్తునకుఁ గొన్ని వరహాల మూఁటల నిచ్చెను. అప్పుడావైరాగ్యశీలుఁడు మిగుల దుఃఖించి "దేవా? నీవు నాకొసంగిన ఐశ్వర్య మంధునికి దీపదానము చేసినట్లును, నపుంసకునకుఁ గన్యాదానము చేసినట్లునున్నది. వాంఛాశూన్యుఁడ నగు నాకు ద్రవ్యమేల? నీపాదారవిందములే నాకు మహాభాగ్యము"ని యాద్రవ్యమునహితము దానముచేసి భగవధ్యానపరాయణుండై యుండెను.

68 వ కథ.

భక్తాగ్రేసరుండగు కుచేలుఁడెల్లప్పుడు భగవద్భక్తిచే సర్వప్రపంచమును మఱచియుండుటవలన బిడ్డలు దినుట కన్నములేక కట్టబట్టలులేక కృశించి స్పృహదప్పియుండు తఱి భార్యమిగులఁ జింతాక్రాంతురాలై తదేకనిష్ఠాగరిష్ఠుఁడైయున్న తనపెనిమిటిచెంతకుఁ బోయి "ఓప్రాణేశ్వరా? మీరు సదాయిట్లుండుటచే బిడ్డలగతిఁ జూడకున్నారుగదా",

యనెను. అందుకాభర్తుఁడు చిఱునవ్వునవ్వి "ఓ కాంతా? నేనా వాండ్లగతిఁ జూచువాడను! తండ్రులకెల్లఁ దండ్రియయిన శ్రీమన్నారాయణుండే యందరిని రక్షించువాడు. అడవిలోనున్నపక్షుల కాహార మెవ్వరు పెట్టుచుండిరి. రాతిలోనున్న కప్పను బోషించున దెవరు? మనకు బండ్లు లేక నములుటకు శక్తి లేనప్పుడు అదయానిధి పాలిచ్చిమనలను బెంచలేదా? వాడేమనలను రక్షించును. కావున దుఃఖింపకు మనెను. అందులకామె యసంతుష్టురాలై "నాథా! మీబాల్యస్నేహితుఁడగు శ్రీకృష్ణుని యాచించి కొంతధనమును దెచ్చి యీయాపదను దొలఁగించకూడదా యనెను. ఈమాటల కాపరమభాగవతుఁడు చిఱునవ్వునవ్వి "అహా అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుండగు భగవంతునిచెంతకుఁ బోయి ధనము యాచించుట కల్పవృక్షముచెంతకుఁ బోయి మట్టిపెళ్ళను యాచించునట్లుండు" ననెను.

64 వ కథ.

కబీర్ దాసు మ్లేచ్ఛుఁడగుటచే వాత్సుకువర్యుఁ డతనిని

దన దగ్గఱఁ జేర్చుట కిష్టములేక యెన్నివిధముల ద్రోసివేసి
నను నాభక్తుఁడు కొంచమైనను విసుకు చెందక తిరిగి పోవు
చుండెను. అట్లుండనొకనాఁడు గురువుమిగుల నాగ్రహ
మును జెంది దనపాదుకచేఁ గప్పీసుశిరస్సునుండి రక్తము
గారునట్లు కొట్టెను. అప్పుడాశాంతమూర్తి మిగుల నానంద
ముతో "దేవా నేనుయిప్పటికిగదా ధన్యుఁడనైతిని. మీపా
దుక నాశిరస్సునకు దాకినంతనే నాపాపములన్నియు నశించి
కృతార్థుడనైతి" నని చెప్పెను. గురువు వాని యసమాన
సుగుణసంపత్తికి నాశ్చర్యముచెంది తనయవివేకమునకు
సిగ్గు పడెను.

65 వ కథ.

సోక్రటీసు ఒకనాఁడు గాఢమైన విచారణయందుండ
ఁగా భార్యయాతని బిలిచెను. అందుల కాయనమాటలాడఁ
నందున మిగుల గోపించి ఊరంతయుఁ బ్రతిధ్వని యగునట్లు
అఱచుచుఁ దిట్టుచు దూషింపుచుండెను. అప్పటికిని నాతఁడు
చలింపకుండుటచే నామె పట్టరాని యాగ్రహమును

జెంబి యొక కుండతో బురదనీళ్లను దెచ్చి యాయన నెత్తిపైఁ గుమ్మరించెను. అప్పటికిని నామహానుభావుఁడా వంత యయినను గోపించక పకపక నవ్వుచు "అహా ఉఱిమినవుఁడే వర్షించు ననెడిలోకోక్తి యిప్పుడుగదా సాదృశమైనదని" పలికి తిరిగి తనయాలోచనయందే మగ్నుఁడై యుండెను.

66 వ కథ.

ఒకానొకఁడు మిగులభక్తితో ఒక దేవాలయమందుండిన దేవతా విగ్రహము నారాధించుచుండెను. ఒకనాఁడాతనికి స్వప్నములో భగవంతుఁడు ప్రత్యక్షమై "ఓభక్తుఁడా నీకు నాయందలి భక్తికి సంతసించితి. నాప్రియభక్తుండొకఁడీయూరువెలుపల నుండు దేవాలయమందున్నాడు. అతనిచెంతకుఁ బోయినచో నీకు జ్ఞానోపదేశము జేయువ నెను. ఈకలఁ గాంచినంతనే యాభక్తుఁడు మిగుల సంతసించి యాదేవాలయమునకుఁ బోయెను. అచట నొకఁడిగంబరి తనరెండుపాదములను దేవతావిగ్రహముపైఁబెట్టి పరుండుటఁ జూచి అయ్యో నేనెంతమోసపోతిని, కలనిజమను

కొని యిచటకువచ్చి రొట్టెను షాక్కర్యమునఁ జూచుట సంభవించినదని మిగుల నాగ్రహమును, పరితాపమును గలవాఁడై "ఓయీ యస్వస్తుఁడా! నీకుఁ గండ్లు గాన్పించుటలేదా? ఇంతటిమూర్ఖమా భగవంతుని శిరస్సుపైఁ బాదములుబెట్టుట కెట్లు సాహసించితివ" ని కోపించెను అప్పుడా దిగంబరి అయ్యా! కోపించకుము నాకు దేహస్పృహ లేకుండుటచే యిట్లు చేయుట గలిగినది నాయందనుగ్రహించి నాపాదములను భగవంతునిమీఁదనుండి తొలగించి పుణ్యముగట్టుకొనుమా యని వేడినంతనే యాభక్తుఁడు వానిరెండు పాదములనుబట్టి ప్రక్కకులాగెను. తోడనే యాస్థలమందొక దేవతావిగ్రహము గాన్పించుటచే మఱియొక ప్రక్కకు లాగెను. తత్క్షణమే యక్కడ నొకవిగ్రహము గన్పించఁగా భక్తుఁ డాశ్చర్యమునొంది యాదేవాలయమంతటను వానినీడ్చెను. కానివాని పాదము లెచటఁ బెట్టిననచట భగవంతుని విగ్రహము గన్పించుటచే, ఆహా యిదేమి చిత్రము! భగవంతుడు సర్వవ్యాపియయి యున్నాఁడే

అయ్యో నేనెంతటి పాపిని. ఈమహానుభావుని నిష్కారణముగ దూషించి పాపముఁగట్టుకొంటినే అని చింతించి యాబ్రహ్మవేత్తకు సేవయొనర్చి ధన్యుఁడయ్యెను.

67 వ కథ.

పరమదుర్మార్గుం డగురావణాసురునితమ్ముఁ డగువిభీషణుఁడు తనసోదరునిపాపకృత్యములు సహింపఁజాలక యాతనివీడి శరణాగతరక్షకుం డగుశ్రీరామచంద్రుని శరణు చొచ్చెను. తోడనే యాకరుణాసముద్రుఁడు వాని కభయమునిచ్చి లంకాపట్నమునకుఁ బట్టాభిషిక్తునిఁగ జేసెను. అంతట లక్ష్మణుఁడు అన్నుఁజూచి “దేవా, మీరింతతొందరపడితి రేల! రావణుఁడేవచ్చి మీకుశరణుచొచ్చిన మీరపుడేమి సేతురని యడిగెను. అందుకాపావనమూర్తి “ఓతమ్ముఁడా, రావణునకే యంత భక్తిగలిగి తనపాపకార్యమునకుఁ బశ్చాత్తాపచిత్తుఁడై నన్నుశరణు చొచ్చినయెడల, నారాజ్యమంతయు నాతనికిచ్చి ‘నేనరణ్యవాసమే చేసెదను’, అని చెప్పెను.

68 వ కథ.

ఒకకుష్ఠరోగి తనవ్యాధిబాధ సహింపజాలక ప్రాణ
త్యాగము చేసికొనవలెనని యొకనాఁడు నదీతీరమునకుఁ
బోయియుండు దుముకఁబోవుచుండెను అప్పుడు కబీర్ దా
సుగారిశిష్యుఁడగు పద్మనాభుడు వానిఁజూచి మిగులజాలి
నొంది రామనామమును మూఁడుమాఱులుచ్చరించినఁతోడనే
యాకుష్ఠరోగి కష్టములు దీఱిస్వస్థతఁజెంది మహానందభ
రితుఁడయ్యెను. ఈవృత్తాంతమంతయు భక్తాగ్రేసరుండగు
కబీరునకుఁ దెలిసినంతనే యాగ్రహమునొంది “ఓశిష్యా
పవిత్రమగు రామనామము నింతస్వల్పకార్యమునకే మూఁడ్మా
ఱ్ఱయ పెట్టితివా? అట్టిమహామంత్రమును త్రికరణశుద్ధిగనొ
క్కమాఱుచ్చరించిన మాత్రముననే యెట్టియసాధ్య మగుకా
ర్యమైనను సాధించవచ్చునే, నీకింకను బూర్ణమైనభక్తిక
లుగలేదు గదా”యని చింతించెను.

69 వ కథ.

ఒకనాఁడొకఁడు జాన్‌సన్’ అనుతత్వవేత్తయొద్దకుఁ

బోయి అయ్యో చచ్చితి, చచ్చితి. నింక నాకేమిగతి? ఏంయుఁ బోదునని దుఃఖించెను. జాన్‌సన్ ఆశ్చర్యముతో నీకేమి సంభవించినదని యడిగెను. అందులకాతఁడు "అయ్యో యిఁక నీప్రపంచమున నూనవుఁనేమి చేయఁగలఁడు? మనుష్యుని జీవితము నూరేండ్లకంటె నెక్కువ లేదుగదా" అవ్యంతములు లేని కాలప్రమాణములో నూరేండ్లన నెంతయల్పము? ఇందు నర్ధకాలము నిద్రయందే గడచిపోవుచున్నది. ఇంతియే గాక మిగిలిన యర్ధకాలములో బాల్యమున నాటపాటలయందుఁ గొంతయును, యౌవనమునఁ గామక్రోధాదులకులోనై యుక్తాయుక్తములరయక తిరుగుటయందు గొంతయును, వృద్ధాప్యమునఁ గరచరణాద్యవయవములుఁ పట్టుదప్పనేమియుఁ జేయఁజాలని స్థితియందును వ్యర్థమైపోవుచున్నది. ఇది గాక అప్పుడప్పుడు గలిగిన పావకాలమంత యుఁడినుటయందును, త్రాగుటయందును గడచుచున్నది ఇదంతయుఁబోఁగా మిగిలిన యించుక కాలము బిడ్డలతోడను స్నేహితులతోడను, బంధువులతోడను గృహకృత్యములను

చక్కఁబెట్టుకొనుటతోడను పోవుచున్నది. మానవునిజీవితమం తయు నిట్లుపలువిధముల నితరవృత్తులచే నాక్రమించఁబడి యుండ మనుష్యునికిఁ బరమార్థచింత జేయుటకు నావకాశ మెట్లుండును. స్వతస్సిద్ధముగా మనుష్యునికి నావకాశమే లేన ప్పుడికఁ నీదేవాలయములెందుకు, బోధకులెందుకు, గ్రంథ ములెందుకు? కొల్పనా! ఆరోగ్య యిఁక నేఁ దరించు టెట్లు! నాకు నావకాశమెక్కడిది! యని యేడ్చెను. ఇదంతయు జాన్ సన్' విని కొంచెమాలోచించి వెక్కి వెక్కి యేడవసా గెను. ఆమనుజుఁడు నీవెందుకేడ్చుచున్నావని' యావేదాం తి నడుగ "ఆరోగ్య యిఁక నాగతియేమి నాభుక్తిగడచు టెట్లు! మనమెంతయో పెద్దది యనుకొనుచున్న యీప్రపం చమంతయు బ్రహ్మాండములోనొక యావగింజంతయైయుండ దుగదా, యింతయల్పప్రపంచము మూఁడుభాగములుసము ద్రమయమై యొక్కపాలుగదా నివాసయోగ్యమైనది. ఆయొక్కభాగములోఁ గొంతయెడారులచేతను, మఱికొంత కొండలచేతను నాక్రమించఁబడి మిగిలినకొంచములో

జాలాభాగము నదులచేతను, సరస్సులచేతను నాక్రమించఁ బడి, మిగిలినయింక మరికొంచెము పట్నములచేతను నివస దారులచేతను రోడ్లచేతను నాక్రమించఁబడఁగా మనుష్యున కెంతమిగిలి యుండునో యోచించుము. మహాసూక్ష్మమగు ఈప్రపంచమందు మిగిలిన యత్యల్పభూమియందెన్ని కోట్ల జీవరాసులు బ్రతుకవలెనో చూడుము, ఇన్నిజీవరాసులజీవనము గడుపఁగా నింక మనుష్యునకేమి మిగులును? ఒకవేళ నిసుమంత మిగిలిన నెన్నికోట్లమంది మనుష్యులు బ్రతుకవలెను? అయ్యో యింక నాకుగతియేమి నేనెట్లు బ్రతుకుదును" అని యేడ్చెను. ఇదంతయు నాతఁడు విని "అయ్యా మీరు చెప్పినదంతయు యుక్తియుక్తముగానున్నను నీభూమియందు మీరు బ్రతుకుటకు నాహారము లేకపోదు. మీరు దుఃఖించుట వట్టివెఱ్ఱితన" మనెను. అందుల కాతత్వవేత్త "అయ్యా నేను దుఃఖించుట వెఱ్ఱితనమైనచోఁ బరమార్థచింతనసేయుటకు నవకాశమే లేదని మీరు దుఃఖించుట యంతకన్న వెఱ్ఱితనముగదా?" యనెను.

70 వ కథ.

రామతీర్థ స్వాములవారికిని అమెరికాదేశమునం దొక క్రైస్తవ మతాచార్యునకును జరిగిన సంభాషణ.

క్రై—స్వామీ, మీమతమగోచరముగా నున్నది! మీరు భగవంతుని నమ్మెదరా లేదా?

రా—లేదు, నేను భగవంతుని నమ్ముటలేదు. నాకు ఆయన విషయమై యనుభవమే. ఒకదానిని దెలియనప్పుడే నమ్ముటయు నమ్మకపోవుటయుగాని, తెలిసినతరువాత, నమ్ముటకాదు, యనుభవమే.

క్రై—అహా యిదేమివింత, పోనిమ్ము నీకు ఆత్మగలదనియైన నొప్పుకొనెదవా?

రా—లేదు, నాకు ఆత్మలేదు, నేనే ఆత్మను, నాకు దేహముకలదు. దేహములన్నియు నావే.

క్రై—మీది విపరీతమతముగా గాన్పించుచున్నదే!

రా—విపరీతమేకాదు, సర్వోత్కృష్టమతము.

క్రై—నీమతము నెవరైన గ్రహించగలరా?

రా—గ్రహించిననాకేమి? గ్రహించకున్ననాకేమి? సత్యమును బోధించుటే నాపని. సత్యబీజములు విరజిల్లుటే నా కార్యము. అవియెప్పటికైనను మొలకలెత్తకమానవు.

క్రై—నిన్ను పిచ్చివాఁడని యనుకొనెదరేమో!

రా—అనుకొననిమ్ము, కురుక్షేత్రమందు నేఁగృష్ణునిగావచ్చి బోధించినప్పుడుమాత్రము నన్నుగ్రహించఁ గలిగిరా? పాలస్తినయందు నేనుయేసుక్రీస్తుగా నవతరించి బోధించినప్పు డెంతమంది నన్నుగ్రహించఁగలిగిరి? తిరిగియిప్పుడు మరియొకసారి ఘంటానాదముగ బోధించుచున్నాను.

క్రై—నీమాట లతిగంభీరముగ నున్నవే! నీవేమి, ప్రవక్తవా? లేక అవతారమా?

రా—ప్రవక్తయు, అవతారమును, నాక్రిందివే. పరమాత్మనే నేను.

క్రై—నీబోధ తెలుసుకొనుట కెంతకాలము బట్టునో,

రా—ఎంతకాలమైననాకేమి! యుగములు నావే, కల్పములు నావే, అనంతకాలమునాదే. ఇదంతయు నాయాటయే యానెను. అంతనాశ్రీస్తవుఁడమ్మహానీయునిఁ యపూర్వమగుప్రత్యుత్తరములకు విస్మయమునొంది మారుబలుక జాలక వెడలిపోయెను.

71 వ కథ.

ఒకరాజొకభక్తుని కొకయమూల్యమగుపట్టువస్త్రమునిచ్చెను. ఆభక్తుఁడు దానిందీసుకుబోయి, గుడ్డలులేక చలిచేగజగజవణకుచు భిక్షమెత్తుకొనుచున్నయొక ముసలిదానిపైగప్పెను. ఈసంగతి రాజుకుఁదెలసి అగ్రహామనస్కుఁడై యాభక్తునిఁ బిలువనంపి "ఓరీ, నన్నెంతయవమానపరచితివి! నీకుబహుమాన మిచ్చినవస్త్రమేదని" యడిగెను. అంతట నాభక్తుఁడు రాజా, నీవిచ్చినబహుమానమును, సకలచరాచరప్రపంచమునకు నీశ్వరియగు జగన్మాతకు సమర్పించితి" నని చెప్పినంతనే, రాజుసిగ్గుపడి క్షమాపణవేఁడెను.

72 వ కథ.

‘అబ్రహామ్’ అను క్రైస్తవభక్తుఁడు ప్రతిదినము తనయింట్రముందరఁ గూర్చుండి బాటసారులకొఱకుఁ జూచుచు, వారుకనుపించినతోడనే వారినిరగుసన్మానముతో నింటికిఁదీసుకొనిపోయి తగునుపచారములు చేయుచుండెడివాఁడు. ఇట్లుండ నొకనాఁడు నూరుసంవత్సరములు వయస్సుగలనొక కడువృద్ధుఁడట్లువచ్చుచుండుటఁజూచి “అహా! నేఁడేమి నాపుణ్యము! ఇట్టియతిథి నాకెప్పుడును లభింపలేదు, అని సంతసించుచు యతనిఁగడుభక్తితో నింటికిదీసుకొనిపోయి కాళ్లుగడిగి, పిండివంటలతో భోజనముబెట్టెను. అంతటనా వృద్ధుఁడు మిక్కిలిసంతోషమున దినుటకుఁ బ్రారంభించెను. అప్పుడు ‘అబ్రహమ్’ ఆశ్చర్యముతో “ఓముసలివాఁడా నీకింతవయసువచ్చినను లోకనాయకుండగు పరమేశ్వరుని నారాధించకయే భుజించుచున్నావు. ఇప్పుడైనను యాదేవదేవుని స్మరించి భుజించుమా” యనెను. అప్పుడాముసలివాఁడు “అయ్యా నేనెన్నఁడును దేవుని బ్రార్థించియే యెఱు

గా నాజన్మమధ్యమందు వానినొక్కసారియైన దలఁచలేదు, నీవు దేవుఁడు దేవుఁ డన్నవాఁడున్నవాఁడో లేనివాఁడో నాకు దెలియదు. అట్టివానిఁ బ్రార్థించనేల” యనిచెప్పినంతనే అబ్రాహాము మిగులఁ గోపముగలవాఁడై యాముసలివానిని దనయింటనుండి రాత్రియనిగూడవిచారించక తరిమివేసెను. ఆరాత్రి పరమదయాళుండును, జగములకెల్లఁ దండ్రియు నగుభగవంతుఁడు అబ్రహామునకు దర్శనమిచ్చి ఆముసలివానిని వెళ్ళఁగొట్టుటకుఁ గారణమేమని యడిగెను. అంతనాభక్తుఁడు “దేవా వాఁడు పరమనీచుఁడు, కృతఘ్నుఁడు భక్తిశూన్యుడు అట్టిమహాపాతకుఁడు నాయింట నుండఁగూడదని తరిమివేసితిని” అనిచెప్పెను. అంతనాదయానిధి “ఓక్రూరుఁడా, వాఁడెట్టివాఁడైనను నాబిడ్డయేగదా? నూరుసంవత్సరములనుండి నేనువానిని రాత్రింబగళ్ళు గాపాడుచుండఁగా నొక్కరాత్రి నీవుకాపాడలేక తరిమితివిగదా” యనెను. ఈమాటలకు అబ్రహాముసిగ్గుపడి బుద్ధితెచ్చుకొని నాఁటనుండి యందఱియందు నొకేవిధమున దయగలవాఁడై ప్రవ

ర్తించుచుండెను.

73 వ కథ.

పడమటలంకయందు సాధనాశ్రమములో నివసించు చున్న సీతారామావధూతను గొందఱసూయాపరు లాయవ ధూతలవారికిని వారిశిష్యులకు నవమానము కలుగఁజేయ నెంచి వారిప్రియశిష్యుఁడైనశాంతానందుని మిక్కిలిబా ధించి యంతటితోఁ దృప్తిఁజెందక వారియాశ్రమము నిర్మూ లముఁ జేయయత్నించుచుండగా వారియందుభక్తి గలకొం దఱు గృహస్థులీపాపకృత్యము నివారింపఁబూనికొందఱు రాజభటులను దీసుకవచ్చి యాదుష్టులను బంధించి చెఱసా లకుఁబంప యత్నించుచుండఁగాఁ బరమపావనుం డగునా యవధూత యాగృహస్థులతో నిట్లనియె "తండ్రులారా, రాజభటులచే మీరుకొందరినిమాత్రమే స్వాధీనము చేసుకొ నఁగలరు, గానిముల్లోకములను స్వాధీనము చేసుకొనగల్గిన యొకమహామంత్రమును మీకుఁజెప్పెద. దానింగ్రహించి జయశాలురుకండని చెప్పినంతనే వారువానిం దెల్పుమని

వేఁడిరి. అంతవారు చిఱునగవుతో "శాంతమే యీమహా మంత్రము. శాంతముచే బ్రహ్మాండ మంతయు జయించవచ్చును" అనియుపదేశించి, వారుచెప్పినచొప్పున వారియొక్కశాంతమే వారివిరోధుల మనంబులనుగూడఁ గరగించి వారియం దనురాగము గలవారలుగాఁ జేసెను.

74 వ కథ.

శ్రీసీతారామావధూతలవారిశిష్యుఁ డగుశాంతానందుఁడు దుష్టులచేమిగులఁ బాధింపఁబడియుండ వారిహితులు "అయ్యో, యీపరమదుర్మార్గులు మీకెంతకష్టము గల్పించిరి" అనిమొఱవెట్టుచుండ నాశాంతనిధి "తండ్రులారా, వారినినిందింపకుఁడు వారునాకు బరమమిత్రులు, నాశాంతమును బరీక్షించుటకై యేతెంచిన దయామయులుగా వారి భావించుచున్నా" నని నుడివిరి.

75 వ కథ.

శ్రీరామచంద్రులు రాక్షససంహార మొనరించి సీతామహాదేవితోఁ దిరిగియయోధ్యఁ బ్రవేశించి పట్టాభిషిక్తుఁడైన

కాలమందు శ్రీ ఆంజనేయులవారికిఁ దేవేంద్రునిచే సమర్పించఁబడిన యొకయమూల్యమగు పచ్చలపతకము నొసంగిరి. ఆభక్తాగ్రేసరుఁ డాపతకము నోటఁబట్టి యొకచెట్టు కొమ్మనెక్కి యందలిరత్నముల నొక్కొక్కటి కొరికి తుబుక్కున నేలపై నుమియుచు దానినంతయుఁ బాడుచేసెను. దీనిం జూచి లక్ష్మణుఁడు మిగుల నాగ్రహముఁ జెంది శ్రీరామచంద్రునితో నీసమాచార మంతయు వెఱుంగఁజేసెను. వెంటనే శ్రీరామమూర్తి యాంజనేయులను బిలిపించి యాంజనేయా నీకోతిచేష్టలు మానవైతివిగదా? నీకిచ్చినపతకమును జూపుమని యడిగెను. అప్పుడాపరమపావనుఁ డంజలిబద్ధుఁడై "దేవా మీరు నాకిచ్చిన పతకమునందలి మణుల నొక్కొక్కటియుఁ గొరికి చూచితి, నములి చూచితిఁ, గాని యందొక్కదానికిని రామనామమాధుర్యము కొంచమైనను గాన్పింపలేదు, దేవా, నేనేమి యపరాధముఁ జేసితి? నాకిట్టినిస్సారపువస్తువ నేలదయచేసితి రని యడిగెను. లక్ష్మణుఁడు వీని యపారభక్తికి నచ్చెరువునొందెను. రామమూర్తి మిగుల సంతసించెను.

76 వ కథ.

ఒకనాఁడు సీతారామాశ్రమస్థులవారికి గొందఱుస్త్రీలోకపళ్ళెరమునిండఁ పిండివంటలనుదెచ్చి వారినోటఁ బెట్టుచుండిరి. అప్పుడువారు వానినన్నిటిని భుజించి ''తల్లులారా, మీభక్తికి సంతసించితి. కానిమీరునాకుఁ బెట్టినట్టి పదార్థము లన్నియుఁ గోటీశ్వరుని కొకగ్రాసము దానము చేసినట్లున్నది. నేనాకలిదప్పులు లేనివాఁడను. ఆకలిచేఁ బరితపించుదీనులకు వీనింబెట్టినచో నిక్కలిప్రయోజనకరమగును. బ్రహ్మానందముచేఁ గడుపునిండినవాకు వీనిఁ బెట్టుటకంటె భక్తియనెడిఫలములను బెట్టినచో మీరుధన్యులగుదురని హితోపదేశము చేసెను.

77 వ కథ.

ఒకబ్రాహ్మణుఁడు తనభార్యతోఁ గలహించి యిల్లువిడచి సంతోబాయనుజ్ఞాని చెంతకుఁబోయి ''ఓస్వామీ, నేనునిస్సారమగుసంసారమును దృజించి వచ్చితిని. నన్నుఁ గృతార్థునిఁ జేయుము'' మనిప్రార్థించెను. అప్పుడాభక్తుఁడు

వానిప్రార్థన నంగీకరించి తనచెంతనే యుంచుకొనెను. పిమ్మటవానికి నాకలిగలిగి సంతోషానుచూచి «స్వామీ నేనాకలిబాధను సహింపఁజాలకుంటిని. తినుటకేమైన, బెట్టుమని ప్రార్థింపఁగా నాతపసి యొకవెఱ్ఱిపుచ్చకాయ నిచ్చి తినుమనిచెప్పెను. ఆబ్రాహ్మణుఁడు దానిని గొంచము నోటబెట్టుకొని యదిమిక్కిలిచేదుగా నుండుటచే దినఁజాలక దుఃఖించుచు సంతోషానకుఁ జెప్పగా నాపరమయోగి చిఱునవ్వునవ్వి «యీవిప్రా వైరాగ్యశీలురను రుచియిట్టి దనితెలియదు. నీకట్టివైరాగ్యము కలుగకమునుపే సంసారము విడచివేసి యిక్కడికి వచ్చితి" వనియాతని యింటికిఁ దిరుగఁ బంపెను.

78 వ కథ.

శ్రీ శుకమహర్షికిని రంభకును జరిగినసంవాదము.

రం—ఓశుకమునీంద్రా, ఆర్యా, నీయౌవన మంతయుఁ గారడవులపాలుజేసి కాలమంతయు వృథాపుచ్చుచుంటివే!

శు—వనితా! భగవత్సందర్శనమునకై పాటుపడుటకు యౌవనమే తగుకాలముగాని వృద్ధాప్య మగునా?

రం—మునిశ్రేష్ఠా, కామిగానివాఁడు మోక్షకామి యెట్లగును?

శు—తరుణీ! హరిసాయుజ్యము నొందఁగోరుటే కామము. ఇంతకన్నను త్కృష్టమైనకామము మఱియొకటిక లదా?

రం—స్త్రీపురుషులయన్యోన్యముకన్న సుఖమున్నదా? అట్టి సుఖమును త్యజించుట యెంత వెఱ్ఱితనము!

శు—అహా! యేమంటివి, క్షణభంగురమై దుఃఖదాయకమై తుచ్ఛమైన కామినీసుఖ మెక్కడ! పరబ్రహ్మానుసంధాయకమగు నిత్యానందమెక్కడ!

రం—ఋషోత్తమా, సకలధర్మవేదులగుమీకుఁ దెలియని ధర్మములు లేవుగదా! తానైకోరి వచ్చినయువతీమణిని నాదరించకపోవుట భ్రూణహత్యామహాపాతకమునకుఁ గారణముగాదా?

శు—కాంతా, నీవుచెప్పినధర్మము మదాంధు నగుకాముకులకుఁ జెల్లునేమోకాని తపముచే నడవుల గాలము పుచ్చుయోగులకుఁ గాదుసుమా!

రం—పూర్వఋషుల్లు కోరివచ్చినమేనకను విశ్వామిత్రుఁడు చేరఁదీయలేదా పర్వతముని వారిణి యనుదేవవేశ్యను నాదరించలేదా? వారెల్లను మీవంటియోగులు కారా?

శు—తరుణీ, నీవుచెప్పినవారు స్త్రీసాంగత్యమున యోగభ్రష్టులై యెన్నియో యిడుములపాలై రనినీవు విని యుండవా?

రం—మునిశ్రేష్ఠా, వేయిమాటలేల స్త్రీలపొందే నరకహేతువైనచో భగవంతుడు స్త్రీలనేల పుట్టించవలెనో పరికించి చెపుమా?

శు—ప్రపంచమునే సత్యమనినమ్మి సంసారసాగరమున మునిగితేలెడు గృహస్థులకొఱకే స్త్రీలను సృష్టించెను గాని, ప్రపంచమంతయు స్వప్నతుల్యముగా

సెంచినతపోనిష్ఠాగరిష్ఠు లగుమునీంద్రుల కొఱకుఁ గాదుసుమా?

రం—మునీంద్రా, కులముచెడనిమ్ము, తపంబులు మంటఁగల యనిమ్ము, బంధువులు వెలిఁబెట్టనిమ్ము, తల్లిదండ్రులు వందనిమ్ము, తనకన్నియిడుములు పొడమినవోర్చిచంద్రునిబోలుముఖకాంతులు గలకాంతలఁ జేపట్టి, సుఖించువాఁడే ధన్యుఁడుసుమా!

శు—పంకజాక్షీ, తనభార్య యెంతవుండినను గుందనిమ్మ, బంధువు లెంతచిన్నచూపునఁ జూచినఁనుజూడనిమ్ము; లోకులుతన సెంతదూటినను దూఱనిమ్ము, అన్నిటి యందును నభిమానశూన్యుఁడై, యాత్మబోధాసుధారసమును గ్రోలుమహనీయుఁడే ధన్యుఁడుసుమా!

రం—మునీంద్రా, కళలనుదెలిసి, మన్మథుఁడే నిజదైవమని నమ్మి! సదాస్త్రీలోలత్వముచేఁ గాలముపుచ్చువాఁడే పూజ్యుఁడుసుమా?

శు—రంభా, వేదములుచదివి, అజ్ఞానము నణఁగఁద్రొక్కి,

ముక్తికాంతంగలసి తన్మయత్వము నొందుమహాను
భావులే పూజ్యులుసుమా!

రం—వేషములన్నియు బూడిదగానిమ్ము, పరమాత్మ పాదు గానిమ్ము? మోక్షపదము వంటఁగలయనిమ్ము, నిండువెన్నెలయందు, రమణీయమగునుద్యానవనముల లేజవ్వనులతో విహరించు పుణ్యపురుషునికి నేసదానమస్కరింతును.

శు—అవివేకీ, యేమంటివి! ఘోరారణ్యముల నివసించుచు, దనశాంతస్వభావముచే, క్రూరమృగంబులసహజబుద్ధిని గూడమాన్పి, వానితో నన్యోన్యమైత్రినివిహరించుచు హరిధ్యానపరాయణుం డైనమహనీయునికే నేసదా నమస్కరింతును.

రం—ఆర్యా, నన్నేలబాముల బెట్టెదరు. మదనతాపమున కోర్వలేకనీకు శరణంటిని రక్షింపుఁడు, శరణాగత రక్షణమునకన్నఁ దపమున్నదే!

శు—వనితా, అదిసత్యమేగాని అసమర్థుఁడేమి చేయఁ

గలఁడు? దుర్బలుని శరణువేఁడిన కాచిరక్షింపఁగ లఁడా?

రం—అయ్యయ్యో, మునీంద్రా, ఇట్లనుటన్యాయమా, నామన వాలకింపవా! నీవు నపుంసకుఁడవా! నన్నే లబాముల ముంచెదవు!

శు—బాలా, నన్నేల యీలాగున బాధించెదవు? నేను నపుంసకుఁడనే కాదు. నపుంసకులలో మొదటివాఁ డనుసుమా!

రం—ఎంత పిచ్చివాఁడవు! సుందరీమణులఁ గూడినసౌ ఖ్యము నీకనుభవములేక యట్లనుచున్నావు సుమా!

శు—ఛీ! ఛీ! మలమూత్రములతోఁ గూడి, దుర్గంధమయమై, పైకిమాత్రము వన్నెచిన్నెలు చూపునీతనువులమర్మ మేరికి తెలియును! తరుణీ నీకొకనమస్కారము. ఇం తటితోఁ జనుము.

రం—మునీంద్రా, ఇదియా నీసందేహము! నేను దేవాం గన ననుమాట మఱచితివా? ఇదిగో నాశరీరము

చించి చూపెదఁ జూడుము. మానవుల శరీరమువలె దుర్గంధముగాక సుగంధమయమై మనోహరమై, దేదీప్యమానమై యున్నది. ఇఁక నన్నుఁ జేకొనుము! (అనిపొట్ట చీల్చి చూపెను).

(అంతమహదానందభరితుఁడై)

శు— "తల్లీ, ఆబ్రహ్మదేవుఁ డటువంటిసుగంధమయమై, పరిశుద్ధమైన నీకడుపునఁ బుట్టఁజేయక నాజన్మము వ్యర్థ మొనరించెఁగదా!" అనిబల్కి రంభ శుకయోగి యొక్క నిశ్చలవిరాగమునకు నచ్చెరువునొంది, సిగ్గుపడి, నమస్కరించి వెడలిపోయెను.

79 వ కథ.

ఒక యరణ్యమందు నివసించునొక ఫకీరొకనాఁడు పెద్ద పులిచే మిక్కిలిబాధకర మగుగాయమును బొందినవాఁడై, దుఃఖించు చున్నసమయమున నొకఁడు వానింజూచి "అయ్యో యాపులి నిన్నెంతబాధించె" నని మోదాశ్చర్య మొందుచుండ నాఫకీరు "అయ్యా నేనుబాధకై విచారించుటలేదు.

ఇంతకు వేయిరెట్లెక్కుడుబాధ కలిగినను, విచారము లేదు.
గాని యిట్టిశిక్షను భగవంతుఁడు నాకు విధించుటకు నే నేమి
పాపము చేసితినో కదా యని నా పాపకృత్యములకై వగచు
చున్నా ననెను.

80 వ కథ.

ఒకపట్టణమందు ఒకమిక్కిలి బలాఢ్యుఁడు గలడు. అతఁ
డు బరువులు మోయుటయందుఁ దనకెవ్వరును సాటిలేరని
యధికగర్వము గలవాఁడై యుండెను. అతఁ డొకనాఁ
డత్యాగ్రహంబున గ్రుడ్లెఱ్ఱఁజేసి, నోటఁ జొంగఁ గార్చుచు,
కత్తిని ద్రిప్పుచుఁ, బలుగుచుండ నొకఁడు వానిఁ జూచి
వానియాగ్రహమునకుఁ గారణమడిగెను. అప్పుడావస్తాదు
"ఒక స్త్రీ నన్నుఁ దిట్టినది. అందుచే దానిని జంపుటకుఁ
బోవుచున్నా" నని చెప్పెను. ఇది వినినంతనే యాతఁడు నవ్వి
"ఓహో! యిదియే నీ బలము! నీ వెంతయో గొప్ప భారములను
మోయఁగలనని ప్రగల్భములు కొట్టుచుంటివి, ఒక్కయాఁడు
దాని వాక్యమునే మోయలేకపోతివి." యని చెప్పినంతనే

యాతఁడు సిగ్గుపడి యింటికిమఱలెను.

81 వ కథ.

ఒకబాటసారి మలమలమాడు చున్ననిండువేసవిలో నడచిపోవుచు మిగులనలసి యొకపెద్దమఱ్ఱివృక్షమును గాంచి దానినీడనుబఱుండి, యావృక్షమును బారఁజూచి "అహా! యేమిది, భగవంతుఁడు సర్వజ్ఞుఁడని యనుకొంటినే చిన్న గుమ్మడిచెట్టునకు బానలంతకాయలుచేసి మిక్కిలివిస్తీర్ణమగు మఱ్ఱివృక్షమునకుఁ గురువిందగింజలంతకాయలను సృష్టించెను, మనుష్యునకున్నంతవివేకమైనను నున్నట్లుగా న్పించ" దనితనలోఁ దానుదలంచుచు నిద్రించెను. ఇట్లించుకనిద్రించి లేచినతోడనే తనదేహముపై మఱ్ఱికాయలు రాలియుండుటఁజూచి విస్మయమొంది అహా! నేనెంతమూఢుఁడను! సర్వేశుఁడొనరించుప్రతికార్యమును మనమేలునకేనని గ్రహింపఁజాలక యజ్ఞానముచే బ్రహ్మాండములకెల్లఁ బ్రభువగు వాదేవదేవుని దూఱితినిగదా! ఈమఱ్ఱివృక్షమునకే గుమ్మడికాయ లంతకాయ లుండినయెడ నొక్కకాయ

నాపైఁ బడినచోఁ జస్మనగదా; అంతియేగాక దీనినీడ నను భవించెడి యనేకకోట్లజీవరాసులకుఁ బ్రాణాంతకమై యుండునే! ఆహా! భగవంతునికార్యము లెంతయగోచరములు! అనుచు వెడలిపోయెను.

౮౨ వ కథ.

ఒకఁడొకభక్తునియొద్దకుఁ బోయిస్వామీ యెట్టివిరోధులనైననుదయతో నాదరించుమని చెప్పితిరిగదా కామక్రోధములనుమాత్ర మేలదయతో నాదరించరా దనెను. అందులకాభక్తుఁడు ఎట్టివిరోధియైనను దుదకుఁ గ్రూరమృగమైనను దయకులోబడి దానిసహజ మగుకార్యమును మానునుగాని కామక్రోధములకు దయచూపుటచే వాటిదుర్మార్గము హెచ్చుచుండును గావున వాటియెడ మాత్రముదయ నేమాత్రమును జూపరాదనెను.

౮౩ వ కథ.

ఒక రాజొకఫకీరును నీ వెప్పుడైన నన్నుఁదలచెదవాయని యడిగెను. అందుకు ఫకీర్ ఆహా తలచెదను. భగ

వంతుని మఱచినప్పుడా. చిత్తము భగవదాయత్తము గాని యప్పుడు బాహ్యవిషయములను జింతించును గాని రాజుల కెల్ల రాజును రక్షకులకెల్ల రక్షకుడు నగు సర్వేశ్వరుని ధ్యానించు నీవ మైనప్పుడె యితరవిషయములు జ్ఞాపకము వచ్చును? అనిజవాబు చెప్పెను.

84 వ కథ.

ఒకనాడు "జహీద్" అను ఒకమతగురువు ఒకరాజుచే విందునకుఁ బిలువఁ బడెను. అప్పుడందును మిక్కిలియు త్సాహముతో నక్కడ నమర్చబడిన రుచిగలపదార్థములను నాశగొలిపి కడుపుబ్బునట్లు దినుచుండఁ "జహీద్" దన నెల్లరును మహాభక్తుఁడని కొనియాడుటకై చాలఁ దడ వగా భుజించి నమాజ్ (దైవప్రార్థన) దీర్ఘకాలము చేసెను. ఇంటికిఁ బోయినవెంటనే యన్నము పెట్టుమని యాజ్ఞాపించెను. మూర్ఖబుద్ధిగల యాతనికుమారుఁడు "దండ్రీ, మీరిపుడేగదా విందారగించి వస్తిరి. అప్పుడే యాకలియయ్యెనా? యనియడుగఁగ, దండ్రి "కుమారుఁడా ఓయీ! ప్రయో

జనము నుద్దేశించి రాజుగారియెదుట నే నేమియుం దినలే' దని చెప్పెను. అంతనమూఢుడు "నాయనా, నీవక్కడ చేసిన వానిలో నేదియుం బ్రయోజనకారిగాం జేయలేదు గావున నీ ప్రార్థనలనుగూడ నీతిండివలెనే తిరిగి చేయు మనెను.

౮౫ వ కథ.

ఎపెక్టిటస్, అనువిరాగి సమస్తవిషయములను విసర్జించి, భగవధ్ధ్యానము చేయుచుం, జేతనైనంతవఱకు నితరులకు సహాయము చేయుచుం గాలము గడుపుచుండెను, ఒక నాడు దొంగలు, ఎపెక్టిటస్ యొక్క గుడిశెలో బ్రవేశించి యందొక దీపపుస్తంభమును దప్ప మఱేదియుం గాంచక యద్దానినే దొంగిలించుకొనిపోయిరి. అప్పు డాభక్తుడు 'అయ్యో! నేనెంతపాపిని, నేను సర్వవిషయములను విడిచి పెట్టియు, నీదీపస్తంభము నొకదానినుంచుకొంటిని, ఇది యుండం బట్టియేకదా వారికి దీనిని దొంగిలించ వలెననెడి దుర్బుద్ధిపుట్టినది, అయ్యో వారొనరించినపాపమునకు నేనే

కారకుఁడను గదా యనిచింతించి నాటనుండి తిరిగి దీపముఁగూడ బెట్టుకొనుటయే మానుకొనెను.

౪౧ వ కథ.

శిఖిధ్వజుఁ డనునొకరాజు తప మాచరించుటకై యడవికిఁ బోయెను. బ్రహ్మజ్ఞాని యగు నతనిభార్య రాజునకు నిజమైన మార్గమును బోధింపఁ దలఁచి మునివేషమును దాల్చి రాజు చెంతకుఁ బోయెను. ఆచట నొకఘోరారణ్యమునందుఁ జిన్నపూరిగుడిశ నిర్మించుకొని యందుపద్మాసనాసీనుండై ధ్యాననిష్ఠయందున్న యారాజునెదుట నామె నిలిచెను. రాజు మునివేషముతో నున్న తనభార్యను గుర్తించక తన్నుఁ గృతార్థునిఁ జేయుటకై దర్శనమిచ్చిన ఋష్యుత్తముండని తలఁచి యామెపాదములకు నమస్కరించి "దేవా, నాకు మోక్షప్రాప్తి యగుటకుఁ, దగునుపదేశము చేసి నన్ననుగ్రహింపుఁ" డని వేఁడెను అంతనామె "ఓ రాజా, నీవు సర్వసంగపరిత్యాగము చేసిననగాని మోక్షము లభించ" దనెను. అంత రాజు "ఆహా, యేమి, నేను సకలభోగములను వీడి,

కౌపీనధారినై, యరణ్యమున నేకాంతముగాఁ దపమాచరించుచుండినను, నేను సర్వసంగపరిత్యాగిని కానఁట! (అని యాలోచించి) ఓహో తెలిసినది! ఈయరణ్యమందు సహితమొకకుటీరము నేర్పరచుకొంటిని. దీనిని నిర్మూలముగా వించెదవని, వెంటనే నాయింటిని మంటఁగలిపి యామెకును మస్కరించి “దేవా, ఇప్పుడనుగ్రహించుఁ” డని వేఁడెను. అప్పుడునునామె “ఓరాజా, నీవుసర్వసంగపరిత్యాగివైనఁగానిముక్తిలభించ” దనెను. రాజువిస్మయముచెంది యటునిటు చూచి, ప్రక్కనున్నతన దండకమండలములను గాంచి, వానినగ్నిలోఁ బాఱవైచి, చేతులుజోడించి తిరిగియామెను వేడెను. అంతనామె మునుపటివలెనే సర్వసంగపరిత్యాగివే మోక్షమున కర్హుఁడనెను. అంతరాజు తనకింకను నొకగోచి యుండుటఁజూచి దానినిగూడఁ బెరికి యగ్నిలోఁబడవేసి “మహానుభావా, యిప్పుడునిజముగ నేను సర్వసంగపరిత్యాగిని ఇఁకసంశయములేదు. ఇంకనైన యనుగ్రహింపుఁడు” అనిబల్కినంతనే యామె, యారాజుభుజ

ముపైఁ జేయివైచి “యీదేహ మెవ్వరిది” యనియడిగెను. వెంటనే రాజా “నాదే” యనెను. అంతనామె రాజా సర్వసంగపరిత్యాగియే మోక్షమున కర్హుఁడని తిరిగిచెప్పెను. రాజాకొంచెమాలోచించి ఆహా! నేను సమస్తము విడిచినను ఇంకను నాదేహము మిగిలియున్నదే! ఛీ, దీనిం గాల్పవలెనని యామంటలలోనికిదుముకఁ బోవుచుండెను. వెంటనే యామె, యాతనిచేయిఁబట్టుకొని “రాజా, “నిలువుము! నిలువుము! యేమిచేయుచున్నావు” అనియడుగ నారాజు “నాదేహమునుగూడ పరిత్యజించుచున్నా” నని చెప్పెను. అంతనామె రాజా నీదేహము కాలినపిమ్మట యేమియగునని యడుగ “బూడిద యగు” ననెను. అంతనామె “అబూడిదె యెవరిది” యని తిరిగి యడిగెను. రాజు అదియు నాదే” యనెను. ఆమె “రాజా సర్వసంగపరిత్యాగికే మోక్షము లభించును సుమా”! యనెను. అంతరాజు “ఓహో యిదేమి యాశ్చర్యము! నేనుజచ్చినను నాబూడిద మిగులుచున్నదే!’ నేనుసర్వసంగపరిత్యాగ మిఁకనెట్లు చేయవలెను” అనియే

మియుఁ దోఁచక యామెపాదములపైఁ బడి “దేవా, సర్వసంగపరిత్యాగము చేయు తెఱంగెఱింగించు మని వేఁడెను. అంతనామె “రాజా, ఈరాజ్యము నాది, ఈభార్యాపుత్రాదులు నావారలు ఈసకలభోగములు నావి, ఈ దేహము నాది, ఈమనస్సు నాది, యీమొదలగు వాటియం దన్నిటియందును నాదినాదియను మమకారము కలిగియున్నావు. అదియే బంధమునకుఁ గారణము. కానిబాహ్యవిషయములను విసర్జించిన మాత్రముననే సర్వసంగపరిత్యాగి కానేరఁడు. ఈమమత్వబుద్ధి యేక్షణమందు విడిచెదవో యాక్షణముననే మోక్షమును బొందఁగలవు” అని చెప్ప ధీశాలియగు నారాజు అన్నిటియందును మమకారమును వీడి, వెంటనే యాతని నిజస్వరూపంబగు పరిపూర్ణసచ్చిదానంద పరబ్రహ్మమును బొందినిరవధిక తేజోవిరాజితవదనారవిందుడై ప్రకాశించెను.

87 వ కథ.

పూర్వకాలమం దొక యోగిసత్తముడు కలఁడు. ఒక

ప్పుడు మృత్యుదేవత యతనిప్రాణములను గొనిపోవుటకే తెంచినప్పుడతఁడు తనయోగబలముచేఁ దనరూపమువంటి వి యనేకరూపములను సృష్టించెను. మృత్యుదేవత యారూపములనన్నింటిని జూచి నిజమైనమనిషిని గనుగొన లేకపోయెను. అంతకొంతతడవు విచారించి తుదకొకయు పాయమును గనుఁగొని "ఆహా! యేమినీశక్తియుక్తులు; అం తయుఁ జక్కగనే యున్నదిగాని, నీవొక్కలోపముమా త్రము జేసితివిసుమా!" యనెను. ఈమాటవినినంతనే నిజ మైనమనిషి నొక్కగంతునలేచి "నేనెక్కడ తప్పుజేసితిని! చూపు" మనియడిగెను. తక్షణమే మృత్యువు వానింబట్టి "ఇదియే నీతప్పు, అదినీయహంకారమే! ఓయీ నీకెంతసా మర్థ్యమున్నను, నిష్ప్రయోజనమయ్యెసుమా" యనిచెప్పి నీడ్చుకొనిపోయెను.

88 వ కథ.

ఒకఫకీరువకఁ గొంతద్రవ్య ముండెదానిని గడుదరిద్రున కియ్యవలెనని చూచుచుండెను. అప్పుడాదారినే యాయూ

యరాజు యేనుగపైనెక్కి పోవుచుండగా ఫకీరుచూచి యాధనమంతయు రాజుపైవిసరివేసెను. రాజాశ్చర్యము నొంది యందులకుఁ గారణమడిగెను. అప్పుడుఫకీరు "రాజా యీద్రవ్యమును గడుదరిద్రునకియ్యవలెనని యనుకొంటిని. నీకంటెదరిద్రుఁడు గాన్పించలేదు. ఏలయన, ఐశ్వర్యమెంత హెచ్చుగానుండునో కోరికలంతమెండై యుండును. ఎవరికి కోరికలు విశేషముండునో యట్టివాడే కడుదరిద్రుఁడు. కావననీవె నాకర్హుఁడవుగాఁ గాన్పించితివి" అని జనులం చెప్పెను.

89 వ కథ.

ప్రపంచ మంతయు బ్రహ్మస్వరూపమని గురువుచెప్పగా విని యొకరాజు తనభార్యతో "రాణికిని దానికిని భేదము లేదు. గనుక నేటినుండి నీదాసీవాడు రాణిగానుండు" నననెను. రాణి యీపిచ్చివేదాంతమునకు విచారించి నాఁటి రాత్రి రాజునకు భోజనము పెట్టినపు డొకగిన్నెలో నన్నమును, మరియొకగిన్నెలో నావుపేడయు దెచ్చి యెదుటబె

ట్టెను. రాజుదీనినిజూచి మిగుల నాగ్రహముచెంది భార్య నుగొట్టఁ బోయెను. అప్పుడు రాజుభార్యయిట్లనియె, "నాథా, మీరు మహాజ్ఞానులు. దాసికిని రాణికిని భేదములేదని సర్వమును సమదృష్టితోఁ జూచువారలు, గోమయమునకు నన్నమునకును భేదమేల చూచుచున్నారో తెలియకున్నద"నెను. ఈమాటలు వినినంతనే రాజుతనయజ్ఞానమునకు సిగ్గుపడి యూరకుండెను.

90 వ కథ.

ఒకరాజకొమారుఁ డరణ్యమునకుఁ బోయి దారితప్పి యడవి యంతయుఁ దిరుగుచు నొకయాశ్రమముచెంతకు వనుచ్చె. అచ్చటఁ దపమాచరించు చున్నయొకమునిపుంగవుని జూచి నమస్కరించి దారియడిగెను. ఆముని యాతనింజూచి, నీవెవ్వండవు, నీపేరేమి యనియడుగ నాతఁడు "నాపేరు మోహజిత్తు" అనిచెప్పెను. మునియాశ్చర్యమున "ఓహో! రాజులకేమి, మోహజిత్తనుపేరేమి! మోహమునుజయించినవాఁడే మోహజిత్తు. అదినీకుఁ దగినపేరుకా"

దనెను. అంతనాబాలుఁడు దేవా "మోహజిత్తును నేనే కాదు. మాయింట నున్నవారందఱు మోహజిత్తులే" యనెను. అంతనాముని మఱింతయాశ్చర్యము చెంది వాని మాటలు పరీక్షించ దలంచి నారాకొమరుని వస్త్రములు దీసుకొని వాటిపైరక్తమువంటి యెఱ్ఱనిరంగుచల్లి, యబ్బాలుని నక్కడనే యుంచితాను రాజుచెంతకుబోయెను. రాజమందిరముచెంతకు వచ్చినతోడనే యచట నొకదాసిని గాంచి "అయ్యో! మీ యువరాజు వ్యాఘ్రమునోటఁబడి చచ్చినాఁడు" అనిదుఃఖించెను. దాసియామునిని గాంచి "స్వామీ యిందుదుఃఖించుట కేమికారణ మున్నది? పుట్టినవాఁ డెప్పటికైనను జావకయుండునా?" యనిపల్కి యావంతయుఁ జలించక తనదారిఁ బోయెను. ఆతాపసి దాసీయొక్క మనోనిశ్చలతకు నాశ్చర్యమునొంది రాజుకడకేగెను. సింహాసనముపైఁ గూర్చుని యున్నరాజును జూచి "అయ్యో రాజా! యెంతయుపద్రవము! యెంతఘోరము! నీముద్దుబిడ్డఁడగు నీవరపుత్రుఁడు క్రూరమృగముచేఁ జంపఁ

బడెను, ఇవిగో యాతనిదుస్తులు" అనిచెప్పి వెక్కి వెక్కి
యేడువసాగెను. కాని రాజసుమంతి యైనను గలఁతచెంద
కుఁడీమునివరేణ్యా, యిందాశ్చర్యమేమి? ఒక చెట్టుకై నలు
దిక్కులనుండి వచ్చినపక్షులు రాత్రియంతయుఁగలసియుం
డి తెల్లవారినంతనే తిరిగి దేనికది యెగిరిపోవును, ఈచం
దమునసే సంసారవృక్షముపైనెక్క డెక్కడిజీవులో
యేతెంచి కొంతకాలము కలసియుండి తిరిగి కాలమాస
న్నమైనతోడనే దేనికదియే తొలఁగుచున్నది. ఇందు వింత
యేమి?" అని పల్కినతోడనే ముని నిశ్చేష్టితుడై యక్కడ
నుండిలేచి రాజుభార్యచెంతకుఁబోయి "అయ్యో, తల్లీ,
యిక నీసంతోషదినములు సున్న యయ్యెను! ఇవిగో నీకు
మారుని రక్తవస్త్రములు. అతఁడు వ్యాఘ్రమునోటఁబడి
మృతుఁడయ్యెను." అని మిక్కిలి విలపించెను. అంతనారా
ణిఆశ్చర్యముతో "యేమీ! మునివర్యా! ఇందులకేనా
మీరింతదుఃఖించుట! నలుదెసలనుండి వచ్చుబాటసారు
లందఱొకసత్రమునఁగూడి కొంతకాలము గలసియుండి

తిరిగి యెవరిత్రోవను వారుపోవుచుందురు. ఈప్రపంచమే యొక గొప్పసత్రమువంటిది. జీవులందఱును మోక్షపురికిఁ బోవుచు మార్గమధ్యమందీసత్రమునందుఁగలసి తమతమకార్యములంజేసుకొని తిరిగి తమతమదారులం బోవుచుందురు. ఇందు దుఃఖించుటకు గారణము గాన్పించుట లేదని శాంతచిత్తముతో నుండెను. ఈమె మనోస్థైర్యమునకు ముని దిగ్భ్రమచెంది రాకొమరుని భార్యచెంతకు వెళ్లి "అయ్యో తల్లీ! యిట్టిదుఃఖవార్త నేనెట్లు చెప్పుదును! పిడుగువంటియీ పాడువార్త నీ వెట్లుభరింతువో గదా! అమ్మా నీవు స్వయంవరముంగావరించిన నీమనోహరుఁడు పులినోటఁబడి మృతినొందెను. ఇవిగో వానిరక్తబట్ట" లని చెప్పి కడుపుబ్బ నేడువసాగెను. అంతనామెనవ్వుచు "ఓహో ఋష్యోత్తమా మీవంటితపోధనులు కారణములేకయే యింతదుఃఖించుటఁ జూడనవ్వు వచ్చుచున్నది! వేలు వేలడవులయందుఁ బెరిగిన చెట్లకొమ్మలు నదీప్రవాహమునఁబడి యొకచోటఁగలసి యొకచోటకై తుదకు మహాసముద్ర

ములోఁ గలియునట్లు మానవులజీవయాత్రకూడ నింతటిదే గదా! శాంతింపుఁ" డని యోదార్చెను. అప్పుడాఋషి ఆహా! నిజముగ వీరందఱు మోహజిత్తులే" యిఁకవీరిని బరీక్షింప నవసరములేదని తెలిసి తానుబన్నిన మాయానాటకము యొక్కరహస్యమును వెల్లడిచేసి రాజకుమారుఁడు సుఖంబునఁ దనయాశ్రమమందున్నాఁ డనిచెప్పెను. అప్పుడువారందరు నీశుభవార్త కిసుమంతయైన సంతసింపక నిశ్చలులై యుండ వారందఱికి నొక్కనమస్కారము చేసి శీఘ్రముగఁ దనయాశ్రమమునకు జని యాబాలునితో "అయ్యో! బాలకా, నేనేమని చెప్పుదును. ఈదుఃఖవార్త నీకెట్లుంగఁజేతు! నీరాజ్యమంతయుఁ బరరాజులపాలై నీతల్లిదండ్రులు, భార్యామిత్రులు, నాదుష్టరాజు క్రూరఖడ్గమునకు బలియై నీకోటయంతయు దగ్ధమై పోయినది. అయ్యో, యెంతకష్టము! యెంతకష్టము! అని దుఃఖించెను. ఈభయంకరవార్తం గా మోహజిత్తునిముఖతేజము కొంచమైనను మార్పుచెందక శాంతముతో నిట్లుపల్కెను.

“ఓమునివర్యా! రాత్రివేళ గలలో దాను జూచినవన్నియు సత్యమునినమ్మి వాటికై పరితపించుటకంటె నజ్ఞానముక లదా? ఈరాజ్యము, ఈసంపదలు ఈభార్యబిడ్డలు, ఇవియు న్నియుఁ గలవంటివేసుమా! ఎప్పటికిని నిత్యమై, చలనరహి తమై నిత్యానందదాయక మైనపరబ్రహ్మమొకటియే సత్యము గాని యినంతయు సత్యముకాదు. దీనికైదుఃఖించుట యెంతవెఱ్ఱితనము! అని చెప్పి నిశ్చలముతోనున్న యాబా లుని గౌగిలించుకొని “ఓహో యేమినాభాగ్యము, మీవం టినిశ్చలజ్ఞానులదర్శనంబుచే బావనుండనైతి” నని తాను జేసినపరీక్ష నంతయు విస్తరించి చెప్పెను.

91 వ కథ.

భక్తాగ్రేసరుండగు ‘కబీర్ దాసు’ మూఁడుదినములనుండి యన్నముదొరకనికతంబున మిక్కిలియాకలి గొనియుండ కొచ టనో యొకరొండినరొట్టెయుఁ గొంచము నేయియు! సంపా దించి భుజించుటకై కూర్చునియుండఁగా నింతలో నొక కుక్క యారొట్టెను దీసుకొని పారిపోవుచుండెను

అప్పుడు కబీరు "ఓస్వామీ! రొట్టెయెండియున్నది. కడుపు నొప్పివచ్చును. నేతిలో ముంచుకొని యారగింపు" మని యా కుక్కవెంట, నేతిగిన్నెఁ బట్టుకొని పఱుగెత్తెను.

92 వ కథ.

"తుకారాం" అనుభక్తునిచెంత నొక స్త్రీవచ్చి మృతి నొందిన తనపిల్లను నెదుటఁబెట్టి బ్రతికించుఁడని యేడ్చెను. చెంతనున్నజను లామెనుజూచి "ఓసీ, పిచ్చిదానా, నీపిల్లను బ్రతికించుటకుఁ దుకారాంస్వామి యొద్దనమృత మున్న దనుకొంటివాయేమి?" అనిపరిహసించిరి, ఆమాటలు ఆపర మభాగవతోత్తముఁడు విని "ఓభక్తులారా, శ్రీహరినామా మృతముకన్న నమృతము మఱియొకటికలదా"? యనిభగవ న్నామోచ్చారణ చేసినంతనే యాశవము తిరిగిబ్రతికెను.

93 వ కథ.

కాంతస్వరూపుఁ డగుకర్ణునితొడలపైఁ దనగురువు శిరస్సు నుంచి నిదురఁబోయి లేచినపిమ్మటఁ గర్ణునితొడలనుండి రక్తధారలు కారుచుండఁ జూచి విస్మయమొంది "ఓశిష్య

గన్నయూ, నీతొడలనుండి రక్తప్రవాహములేటికు గారణమేమని యడిగెను. అందుల కాశాంతమూర్తి "దేవా, మీరు నాతొడలపై నిదురించుసమయమున నెద్దియో యొకపురుగు నాతొడలను దొలుచుచుండెను. దేవరవారికి నిద్రాభంగము గలుగు నేమోయని బాధనుసహించి కదలకయుంటి" నని జవాబు చెప్పెను.

94 వ కథ.

భానుదాసుఁ డనునొకభక్తుని కుటుంబసంరక్షణార్థమై యాభక్తునిచే వానిహితు లొకబట్టలయంగడిని బెట్టించిరి. ఆయంగడికి విలువయైనవస్త్రములను గొనవచ్చువారి కీభక్తుఁడు "ఓజనులారా, రోతయగుశరీరమునకు మంచివస్త్రములను గోరుట, పుండుమీఁదఁ జుట్టుటకుఁ గవకాంబరములను గోరునట్లుండును. మీ రెంతమంచివస్త్రములచే శరీరము నలంకరించినను లోపలనుండు మలమూత్రరక్తాదులకు మార్పుకలుగదు. ఈవస్త్రముల కిచ్చుద్రవ్యముచే భగవంతుని బిడ్డలగు దీనుల కిచ్చుటవలన మీ కిహపరసుఖములు

గలుగును" అని హితోపదేశము చేయుచుఁ దనవద్దకు వచ్చు బేరగాండ్లను బంపివేయుచుండెను.

95 వ కథ.

ఒకనాఁ డొకప్రదేశమున నన్నిమతస్థులలో నుండెడి ప్రాముఖ్యులును మతచర్చ చేయుచుండిరి. అప్పుడు శివమతస్థుఁడు శివుఁడే దేవుఁడనియు, శివునికంటె నితరదేవతలను నారాధించువారు పాపకూపమునఁ బడెదరనియు, విష్ణుమతస్థుఁడు శ్రీమహావిష్ణువే భగవంతుఁడనియుఁ గ్రీస్తుమతస్థుఁడు యేసుకంటె నన్యదైవము లేఁడనియు నిటందఱు వాదించుకొనుచుండిరి. అప్పుడొకజ్ఞాని వారియజ్ఞానమును గ్రహించి శివమతస్థునితోఁ "నీవు శివుఁడే దేవుఁ డని చెప్పుటకు శివుని జూచితివా"? యనెను. విష్ణుమతస్థుని "నీవు విష్ణుని జూచితివా" యని యడిగెను. ఇదేవిధమున నన్నిమతస్థులవారిని బ్రశ్నించ నందొక్కరును దాము చూచియుండలేదని చెప్పిరి. అంతట నాజ్ఞాని "అయ్యలారా, మీవివాదము లిందుచేతనే కాని నిజముగ భగవంతుని జూచిన

వారికి నెట్టివివాదములుండ" వనిచెప్పి వారివివాదములను మాన్పెను.

96 వ కథ.

ఒకఘోరరక్కసి తనయాహారార్థమై దేవతలను భక్షించుచుండెను. ఇంద్రుఁడు మిగులభయము గలవాఁడై యిట్టి యాపదనుండి దేవతలను రక్షింపుమని భగవంతుని వేఁడఁగా నాదయామయుఁడు "ఓయింద్రా దధీచియను మద్భక్తుం డొకఁడు ఏకాగ్రచిత్తుఁడై తపమాచరించుచున్నవాఁడు. అతనివెన్నెముక యారక్కసికి మట్టించినమాత్రముననే యారక్కసి మృతినొందును" అనిచెప్పెను. కాని యింద్రుఁడది తనకెట్లు లభ్యమగునాయని మిగులఁ జింతాక్రాంతుఁడై యామునివర్యునిచెంతకుఁబోయి యీ సంగతిసంతయు విన్నవించెను. అప్పుడామునిశ్రేష్ఠుఁడు "అహా! యింతస్వల్పమునకై మీరింతచింత నొందనేల? ఈ శరీరము పరోపకారార్థమేగదా ఇదిగో నావెన్నెముకను దీసుకొం" డని తాను బ్రాణత్యాగము చేసెను.

97 వ కథ.

పారసీకదేశమం దొకపట్టణంబున ''రబియా'' అను నొకగొప్పభక్తుఁడుండెను. అతఁ డొకానొక సమయమందు మిక్కిలిబాధకర మగువ్యాధిచేఁ బీడింపఁ బడుచుండ ''మాలీక్'' ''హస్సేన్' అనునిద్దఱు తత్వవేత్తలు వానినోదార్చవచ్చిరి. అందులో ''హస్సేన్'' అనువాఁడు ''రబియా' యొక్కయాపదకు మిగులదుఃఖించి యతనితో ''ఓరబియా, నిజమైనభక్తి గలవాఁడు భగవంతుఁడు విధించిన దండనలను గష్టమనక మిక్కిలియోర్పుగలిగి యనుభవించవలె'' నని ధైర్యము చెప్పెను. అంత ''మాలీక్'' యొక్కువజ్ఞానము కలవాఁ డౌటచే ''ఓభక్తాగ్రేసరా, భగవంతుఁడు మనకు విధించినదండనలనోర్పుతోఁడ ననుభవించుటయే కాదు, వానిని సంతోషముతోడ ననుభవించ వలె'' నని పల్కెను. అంతభక్తశిఖామణి యగునారబియావారి కింకను జ్ఞానము కలుగ లేదని గ్రహించి ''ఓప్రియస్నేహితులారా' భక్తిగలవాఁడు భగవంతుఁడు తనను దండిచె

ననియే తెలంపఁడు" అని ప్రత్యుత్తర మిచ్చెను.

98 వ కథ.

పూర్వకాలంబున కొందఱు ముముక్షువులు భగవన్మహిమను బూర్తిగఁ దెలిసికొనవలె నని యిచ్ఛ గలిగి దీర్ఘకాలంబు తపంబు చేసిరి. ఇట్లు నూరుసంవత్సరములు తపం బొనర్చిన పిదపఁ గండ్లు తెఱవఁగనే భగవంతుఁడు వృద్ధబ్రాహ్మణరూపంబున వారిచెంత నగుపడి "ఓ తాపసులారా, మీ రెందుకై తపంబుచేయుచున్నా" రని యడుగ వారు "మేము భగవన్మహిమను దెలిసి కొనుటకై తపస్సు చేయుచున్నా" మనిరి. అంత భగవంతుఁడు "అట్లైన భగవన్మహిమను దెలిసికొంటిరా" యని ప్రశ్నించ "మే మింక నణుమాత్రమైనను దెలిసికొనలే" దని చెప్పి తిరిగి తపంబు చేయఁ బ్రారంభించిరి. ఇట్లుమఱియొకనూరుసంవత్సరములు నిశ్చల తపంబు చేసి కనులు విప్పినతోడనే తిరిగి భగవంతుఁడు పూర్వమువలెనే ప్రత్యక్షమై "ఓ తపోనిష్ఠాగరిష్ఠులారా, మీ రిప్పటికైన భగవన్మహిమను దెలుసుకొంటిరా" యని

యడుగ "మేమిప్పుడు కొంచము తెలుసుకొంటి" మని చెప్పి తిరిగి తడవు సేయక తపంబున మగ్నులైరి. ఇట్లు వారు ఆఱువందలసంవత్సరములు ఘోరతపంబు చేసి కనులు తెరచినప్పుడెల్ల భగవంతునిచేఁ బ్రశ్నింపఁ బడుచుఁ బ్రతి సారియు "మేము పూర్వముకన్న నెక్కువగాఁ దెలుసు కొంటిమి అని చెప్పుచుఁ గడపట ఇప్పుడు మేము తెలుసు కొంటి" మని చెప్పిరి. అందుకు భగవంతుఁడు "ఏమని తెలుసుకొంటి" రనియడుగ "ఆమహామహునిమహిమను బూర్ణముగ దెలుసుకొనుట కెవ్వరికిని సాధ్యము కాదని తెలుసుకొంటి" మనిచెప్పిరి. అది విని భగవంతుఁడు మిక్కిలిసంతోషించి "అహా మీరే భగవంతుని నిజముగా దెలుసుకొన్నవార" లని చెప్పి తననిజరూపమును వారలకుఁ జూపి యంతర్ధానం బయ్యెను.

99 వ. కథ.

ధర్మరాజులవారి నింద్రుఁడు స్వర్గమునకు సశరీరునిగాఁ దీసుకొనిపోవుచుండ మార్గమధ్యమందు నరకములో మహా

పుణ్యవంతులును, సకలసద్గుణసంపన్నులు నగుతననలుగురు సహోదరులును, పతివ్రతాశిరోమణి యగుద్రౌపదియుఁ గాన్పించిరి. పిమ్మట సకలభోగములకు నునికిపట్టగుస్వర్గమునకుఁ బోవ నచ్చట నతిదుర్మార్గు లగుదుర్యోధనాదులు గాన్పించ, నిదేమివిపరీతము? యింతకంటె నన్యాయ మెంతైనఁ గలదా? యని ప్రశ్నించ, ఇంద్రుఁడు "ధర్మరాజా, పుణ్యాత్ములు స్వర్గసుఖముల ననుభవించుటయును, పాపులు నరకబాధల ననుభవించుటయును న్యాయమే. కాని దుర్యోధనాదు లణుమాత్రపుణ్య మాచరించిరి. కావున వారలు క్షణమాత్రము స్వర్గమునం దుండి పిమ్మట వారి యనంతము లగుపాపములకు ఘోర మగు నరకమున నిత్యనివాసము చేయుదురు. మఱియు నీసహోదరులును, భార్యయుఁ గించిన్మాత్రముపాపము నాచరించిరి. వారలే కాదు నీవుకూడ పాపలేశమును చేసితివి కావుననే నీకును యమలోకదర్శన మయ్యెను. ఇంక నీవును నీభార్యయు సహోదరులును స్వర్గమున నిత్యము నుండఁ గల" రని చెప్పెను.

100 వ కథ.

ఒకయోగి సముద్రతీరమునందుఁ గూర్చుండి భగవంతుని మహిమను బూర్ణముగఁ దెలియఁగోరి దీర్ఘతప మాచరించు చుండెను. ఇట్లనేక సంవత్సరములు ఘోరతపస్సు గావించి యొకనాఁడు కండ్లుదెరచి చూడఁగా నొకబాలుఁడు దోసిలితో సముద్రజలమును దీసి నావలఁ బారబోయుచుండెను. ఇట్లు దినమంతయుఁ గష్ట మనక చేయుచుండుట యాముని చూచి "ఓయీబాలకా నీ వేమి చేయుచున్నా" వని యడిగెను. అప్పు డాబాలుఁడు "స్వామీ, సముద్రము నుండి జలమంతయు నావలఁ బారఁబోయుచున్నా" నని చెప్పెను. అంత నాయోగి "ఓ బాలుఁడా నీ కేమి పిచ్చి పట్టినదా యేమి? సముద్రజలమునంతయు నావలఁ బోయుట కెవరితరము?" అని చెప్ప నాబాలుఁడు నీవు భగవన్మహిమను బూర్ణముగఁ దెలుసుకొనుటకుఁ బ్రయత్నించుటకన్న నేను బూనినకార్యము పిచ్చి యగునా?" అనిచెప్పి యదృశ్యుం డయ్యె.

101 వ కథ.

ఒక బ్రహ్మసమాజికుఁడు శ్రీరామకృష్ణ పరమహంస చెంతకువచ్చి స్వామీ "మీ రెప్పుడు చూచినను మేల్కొనియే యుందురు. మీకు నిదుర యేల పట్ట" దని యడిగెను. అందులకాపరమహంస "అయ్యా యొకదొంగ వానికిఁ దనయింటిప్రక్కనే గొప్పధన మున్న దని తెలిసిన పిదప రాత్రింబగళ్ళు నాచోరునిచిత్తమంతయు దానిమీదనే యుండి, యాధనమంతయుఁ దనకెట్లులభ్య మగునా యని పరితపించుచు నిద్రపహాకము పోనేరఁడు. అదేవిధమున సచ్చిదానందస్వరూపుఁ డగు భగవంతుఁడు మనచెంతనే యున్నాఁ డని దృఢముగా నమ్మినవా డాభగవంతునిఁ గాంచువరకుఁ బరితపించుచు నిద్రాహారములుసహితము మఱచియుండు నని జవాబు చెప్పెను.

102 వ కథ.

ఒకరాజు మిక్కిలిదుర్మార్గుఁడై ప్రజాసంరక్షణ చక్కఁగఁ జేయకుండుటచేఁ బ్రజలందరొకనాడు ఆయుధపాణులై

రాజుమీఁదకు దండెత్తివచ్చిరి. రాజు యీయుపద్రవమునకు సిద్ధుఁడు గాకుండుటచే మిగుల జింతాక్రాంతుఁడై యుండెను. సకలసద్గుణశీలుండగు నారాజుకుమారుఁడు ఇదంతయు నెఱింగి తండ్రిచెంతకుఁ బోయి "తండ్రీ, మీరు చింతించవలదు. నేబోయి శత్రువులను జయించి వచ్చెద, సెలవిండు" అని వేఁడెను. అంతనారాజు "అయ్యో కుమారా, యిప్పు డేమిగతి, యింతశీఘ్రములో నాసైన్యములు కూర్చు టెట్లు!" అని నిట్టూర్పులు విడువ నా భాగవతోత్తముఁడు "నాయనా యీస్వల్పపనికి సైన్యములు కావలయునా, యిదిగో నేనొక్కరుండనే పోయి యీశత్రుల నోడించి వచ్చెద నాసామర్థ్యము చూడు" మని వేవేగ గుఱ్ఱము నెక్కి దండెత్తినవారలయొద్దకు బోయెను. రాజకుమారుఁ డొంటరిగా వచ్చుటఁ జూచి దండెత్తివచ్చినవారలందఱు నాతనిచుట్టును జేరిరి, అప్పు డాయువరాజు వారిని సంతోషముతో నెదుర్కొని, వారి యాగ్రహమునకుఁ గారణ మడిగి, వారిని ప్రియవచనంబులచే శాంతింపఁ

జేసి, వారికష్టసుఖములు తాను జూచుచుందు నని యభయ మొసంగి వారిని సంతోష చిత్తులంజేసి వారివారిగృహములకుం దిరిగి పంపివేసెను. పిమ్మటఁ దండ్రి చెంతకుఁ బోయి తాను విరోధుల సంపత్తిని జయించితి ననిచెప్పఁగా రాజాశ్చర్యమునొంది "ఒంటరిగా నింతటికార్యము నీ వెట్లుచేసితి వని యడిగెను. అప్పు డాబాలుఁడు 'తండ్రీ యెటువంటి శత్రుసైన్యమునైనను క్షణమాత్రమున జయింపఁ గలుగుప్రేమాస్త్రమును ప్రయోగించితి" నని తాను జేసినకార్య మంతయుఁ జెప్పి రాజును సన్మార్గునిగాఁ జేసెను.

103 వ కథ.

ఒకానొకమనిషి భగవంతునిఁ జూడఁ దలంచి యాసేతుహిమాచలపర్యంతము నున్నక్షేత్రముల నన్నింటిని దర్శించి తుదకు భగవంతునిఁ గనఁజాలక విసుకు చెంది యొకచెట్టు క్రిందఁ గూర్చుని చింతించుచుండెను. అప్పు డొక బాలుఁడు అక్కడ నిసుకలో నేదియో వెదకుచుండుటఁ గాంచి "ఓ బాలకా నీ వేమివెదకుచున్నా వని యడిగెను.

బాలుఁడు "అయ్యా మాయింటిలో నొకనూదిని బారవై చితి. దానికొఱకై వెదకుచున్నా"నని చెప్పెను. అంత నామనిషి పకపక నవ్వి "ఓ బుద్ధిహీనుఁడా మీయింటఁ బారవైచిన నూదిని ఇక్కడ వెదకిన నెట్లు దొరకును?" అని చెప్ప నాబాలుఁడు "నీహృదయమం దున్న దేవుని కొఱకు నీవు దేశదేశములు వెదకినట్లు లేదా?" యనిచెప్పి అంతర్ధానుండయ్యె.

104 వ కథ.

పూర్వ మొకరాజు తనపట్టణమున రాత్రివేళలందు గస్తి తిరుగుటకై, యొకతలారిని నియమించెను. ఒకనాఁ డాతలారి కద్దియో కార్యాంతరనిర్బంధ ముండినందున యూరిప్రక్కపాలములో శయనించి యున్న యొకజ్ఞానిని బట్టి తెచ్చి తనడప్పును వానిమెడకుఁ దగిలించి, నిద్రించుచున్న మనుష్యులను మేల్కొలిపి జాగ్రతగా నుండునటుల పాటించుటకైనియమించెను. అంతటనాజ్ఞాని డప్పువాయించుచు సందుసందుఁ దిరిగి యిట్లు మేల్కొలిపెను,

మొదటి జామున.

లోకమందు జనులందరు నాశచేత బద్ధులై దుఃఖముల పాలగుచున్నారు. ఆహా! దినదినము నాయుర్దాయము క్షీణించుచున్నది సుమా, జాగ్రత్త! జాగ్రత్త!

రెండవ జామున.

ఈసిరిసంపత్తులును నిజీవితములును క్షణికములు. నిర్దయుం డగుయముండు కాచుకొని యున్నాండు సుమా, జాగ్రత్త! జాగ్రత్త!

మూడవ జామున.

తల్లిదండ్రులు బంధుమిత్రులు, ధనధాన్యములు ఎప్పటికిని స్థిరముగానుండవు. గాన జాగ్రత! జాగ్రత! యనియు

నాలుగవ జామున.

దేహ మనెడిగృహమునందుం, కామక్రోధము లనెడి దొంగలు ప్రవేశించి జ్ఞానమనెడిరత్నమును దొంగిలించ వేచి యున్నారు గావున జాగ్రత! జాగ్రత! యనియు పాటించెను,

105 వ కథ.

ధర్మరాజులవారశ్వమేధయాగము చేయునపుడు కృష్ణార్జునులిరువురు నశ్వసంరక్షణార్థమై వెంటఁ జనిరి. ఇట్లా యశ్వము దేశదేశములఁదిరుగుచు మయూరధ్వజమహారాజు దేశమునకుఁ బోయినప్పుడా రాజు దానిం బట్టుకొనెను. అప్పుడు మహాశూరుం డగు అర్జునుఁడు వానిపై నాగ్రహమున బాణవర్షమును గురిపించ మయూరధ్వజుఁడు నిమిషమాత్రంబున వాటి నన్నింటిని గ్రసించి యొక్క బాణంబున నర్జునుని మూర్ఛిల్లఁజేసెను. అప్పుడు భువనైకరక్షకుం డగు శ్రీకృష్ణుఁడు చక్రమును గిరగిరఁ ద్రిప్పుచు నారాజుపై సింహమువలె నురుకఁ బోవుచుండఁగా మయూర ధ్వజమహారాజు, కృష్ణా! శాంతిల్లుము నే సేవకుండనైనది గుర్తించకుంటివి. ఇదిగో దీనిని గైకొనుమని యొక్క బాణము గొట్టగా యాదేవదేవుఁడు సహితము నేలపైఁబడెను. కొంతతడవైన పిమ్మట నర్జునుఁడు మూర్ఛనుండి లేచి తనయపజయమునకు మిక్కిలిచింతిల్లి యాగ్రహముతోఁ బండ్లు పటపట గొరు

నుచు గాండీవమును జేఁ బూని మయూరధ్వజునిఁ గొల క్రీటునటు చూచుచుండఁ బరమాత్మ స్వరూపుండగు శ్రీకృ ష్ణభగవానులు "ఓ యర్జునా, యేల యింతయాగ్రహము? నీవు మయూరధ్వజుని జయింపజాలవు. కౌరవులనోడించి. నట్లనుకొంటి వేమో? నీగాండీవ మాతనిపై నిష్ప్రయోజ నము సుమా, శాంతిల్లు" మనెను. అప్పు డర్జునుఁడు మిగుల నాశ్చర్యముచెంది "నాగాండీవము నిష్ప్రయోజన మైనచో నీచక్రముయొక్క సామర్థ్య మేమాయెను" అని మంద హాసముచేసెను. అందుకు శ్రీకృష్ణస్వామి "అర్జునా మయూరధ్వజుఁడు నాప్రియభక్తుఁడు అట్టిభక్తునిపై నాచ క్రము పోఁజాలదు, నేనుభక్తవత్సలుఁడ ననుమాట మరచి తివా? భక్తులయభీష్టమును నెఱవేర్చుటయే నాపనిసుమా? లేకున్న ముల్లోకములు కలసి వచ్చినను నాయాగ్రహజ్వా లకు భస్మీపటలము గావా యని చెప్పెను.

106 వ కథ.

మయూరధ్వజమహారాజుయొక్క. భక్తియు దాతృత్వ

మును శ్రీకృష్ణుఁడర్జుననికిఁ జూపవలెనని యిద్దరును బ్రాహ్మ
ణవేషములుదాల్చి యారాజుచెంతకుఁ బోయిరి. అప్పుడా
భక్తాగ్రేసరుండు మిగుల గౌరవముతో వారి నాదరించి
బంగారుపళ్లెములనిండ మణులను నింపి వారియెదుటఁ బెట్టి
స్వీకరించుఁడని ప్రార్థించెను. అప్పుడు మాయానాటక
సూత్రధారుఁడగు శ్రీకృష్ణుఁడు మఱియొక మాయానాటకము
నాడి యిట్లు జవాబు చెప్పెను. రాజా, యీధనము నాకే
ల? నాకొక్కఁడే కుమారుఁడు కలఁడు అతని నొకసిం
హము పట్టుకొని యీడ్చుకొని పోగానే నామృగరాజును
నాపుత్రుని విడువుమని ప్రార్థించితి. అప్పు డాసింహము
"రాజా నీవు మయూరధ్వజ మహారాజు దేహము రెండు
తునకలుగాఁ గోసి కుడిపార్శ్వమును నాకిచ్చినయెడల నీకుమా
రుని విడిపింతునని చెప్పినది. నామాటలయందు అనృతము లేదు.
కావలెనన్న నాతోరండు. నేబలికినపలుకు లన్నియు నిజ
మేయని మీకుఁ జూపించెదఁ గాన నోపుణ్యశీలా నాకుఁ బుత్ర
భిక్షము పెట్టి నన్నురక్షింపుఁడని వేడెను. అప్పు డాపరమ

పావనుఁడు మిగుల సంతోషముతో ఆహా! నేడెంత సుదిన మునే ధన్యుఁడ నైతిని. నాకు జన్మసాఫల్య మయ్యె నాశరీరము నేఁడుగదా పరోపకారార్థమై వినియోగపడు చున్నది. అని లేశమైనను శంకింపక మిగుల నానందముతోఁ దనదేహమును వారి కర్పణచేసెను.

107 వ కథ.

మయూరధ్వజునిఁ బరీక్షించుటకై వచ్చిన కృష్ణార్జును లామహారాజుదేహమును రెండుముక్కలుగాఁ గోయుట కారాజుభార్యను బుత్రుని నియమించి శిరస్సుపై రంపము నుంచి కోయుటకుఁ బ్రారంభించిరి. తల కొంచెము తెగిన పిమ్మట నారాజు నెడమకంటినుండి కన్నీరు గారుచుండగాఁ గృష్ణుడుచూచి "ఛీ యిట్టిదానము నాకేల, ఏడ్చుచు నిచ్చిన దానము నేనొల్ల" నని చెప్పి వెడలుచుండెను. అది యామహారాజు చూచినవాఁడై యాబ్రాహ్మణులతో "ఓ భూసురోత్తములారా! మీరిట్లు చేయుటకు నే నేమియపరాధము చేసితిని. బాధచేతఁ గాని యిట్టిదానము మీకిచ్చితినని

గాని నే నేడ్చుటలేదు. అట్లయిన నా రెండుకండ్లనుండి యుఁ గన్నీరు గారవలెగదా; దయచేసి వినుండు. నాకుడి భాగము మీవంటిమహానుభావులకు దానముగా వినియోగ పడి యెడమభాగము వ్యర్థమై పోయెనుగదా. నాకేమిగతి యని యెడమకన్నేడ్చుచున్నదే గాని మఱియొకటి కాదు" అని చెప్పఁగా నప్పుడు భగవంతుఁ డాతనిభక్తికిమెచ్చి తననిజస్వరూప దర్శనంబుచే నాతని ధన్యుంజేసి యర్జనుని సంశయముదీర్చి వెడలిపోయెను.

108 వ కథ.

మహాభక్తుండగు మహమ్మదునికంటినుండి యొకనాఁడు కన్నీరు కాల్వలై పాఱుచుండెను. వారిశిష్యులు దీనిం జూచి ఖిన్నులై "స్వామీ మీరింతగా దుఃఖించుటకుఁ గారణమే" మని యడిగిరి. అప్పు డాదయాసముద్రుఁడు "అయ్యో మనుష్యు లద్వితీయానందము నిచ్చు భగవద్భక్తిని విడనాడి తుచ్ఛములగు ప్రాపంచకసుఖములకు లోనై పడరానియిడుములఁ బడుచున్నారు. వారికెన్నివిధముల

బోధించినను వారిమనసునకుఁ బట్టకున్నది. వారియజ్ఞానము దలఁచినకొలఁదిని నాకు దుఃఖము కలుగుచున్నదని చెప్పిరి.

109 వ కథ.

అనూయాపరులైనకొందఱు దుర్మార్గులు శ్రీవేదాంతదేశికులవారిని నగౌరవపఱచుటకై యొకనాఁడు వారియింటి గుమ్మములోఁ దలకుఁ దగులునట్లు పాతచెప్పులను గట్టిరి. అప్పుడా మహనీయుఁడు తనశిరస్సున కవి తాకినంతనే కొంచమైనను విచారించక యిట్లుపలికెను. “ఈప్రపంచమందు ముక్తికొఱకుఁ గొందఱు కర్మమార్గమును, గొందఱు జ్ఞానమార్గమును నాశ్రయింతురు. కాని నేను హరిదాసుల పాదరక్షలను సదా నాశిరస్సున కద్దుకొనుచు భక్తిమార్గము నవలంబించెదనని మహదానందమునఁ బలికినంతనే యీపాపకార్య మొనరించిన దుర్మార్గులు సిగ్గుపడి పశ్చాత్తాపము నొంది వారిశరణు జొచ్చిరి.

110 వ కథ.

దరిద్రముచేఁ గృశించుచు, వృద్ధాప్యముచే గజగజ

వణఁకుచున్నయొక మానవుని శ్రీబుద్ధభగవానులు చూచి "నాయనా, యీజీవయాత్ర నీకెట్లున్నది" యని యడిగెను. అందు కాతఁడు "అయ్యా! మనుష్యుఁడు పుట్టిననాఁడనే తనకురాఁబోవు నవస్థలనుగూర్చి కావు కావు మని యేడ్చుచుండును. కావుననిఁక నేఁ జెప్పవలసిన దేమున్నది?" అని బదులు చెప్పెను.

111 వ కథ.

శ్రీరంగావధూతలవారి నొకబ్రహ్మసమాజ మతస్థుఁడు "మీకాలము నిట్లువృథా చేయక యేదైన నొకగ్రంథమును జదువుకొనరాదా యనెను. అంతట రంగావధూత "అయ్యా! నా కొకక్షణమైనను నావకాశమే లేకున్నది. ఇఁక నేఁ జదువుకొను టెట్లు?" అనిప్రత్యుత్తర మిచ్చెను. అప్పుడా బ్రాహ్మసమాజమతస్థుఁడు తిరిగి "ఏమీ, మీకు నావకాశములేకున్నదా! మీ రేమిపని చేయుచున్నారు?" అని యడుగ నాబ్రహ్మవేత్తపని లేనిపని యందుఁ బూర్ణుఁడనై యున్నానని జవాబు చెప్పెను.

112 వ కథ.

శ్రీరామానుజుల వారి శిష్యునిభార్య యొకనాటిరాత్రి నిదురించుచుండఁగా గొందఱుదొంగ లామెపడకటిల్లు ప్రవేశించి మెల్లన యామెనగలను దీయుచుండిరి. ఇట్లు కొన్ని నగలను వారు తస్కరించిన పిమ్మట నాసాధ్వీమణి మెల్లన ప్రక్కకు మరలెను. తోడనే వారు భయము చెంది పారిపోయిరి. ఈసంగతినంతయు మఱునాఁ డామెభర్తకుఁ జెప్పఁగా నాపరమభాగవతోత్తముఁ డాగ్రహము చెంది ,,ఛీ, నీ కింకను ధనముపై నాశ పోలేదు. వారు నగలను దీయుచున్నప్పుడేల కదిలితివి? పాపమాదరిద్రులు నీనగలలో సగముమాత్రమే తీసుకొనఁ గల్గిరి గదా'' యని కోపించెను. అప్పు డాపతివ్రతాశిరోమణి ,,నాథా కోపించకుడు ఆదొంగలు నాదేహముపై నున్నయొకవైపు నగలను దీసికొనినపిమ్మట రెండవ వైపునగలుకూడవారు తీసుకొనుటకై రెండవ ప్రక్కకు మరలితిని గాని పాపము వారు భయము చెంది పారిపోయిరి'' అని జవాబుచెప్ప నామెభర్త యామె

వైరాగ్యమునకు మిక్కిలి యానందించెను.

113 వ కథ.

శ్రీబుద్ధభగవాను డొకనాఁడు బాల్యమున, వనమునందు విహరించుచుండఁగా మంత్రికుమారుఁ డగుదేవదత్తుఁ డొక పక్షిని బాణముతోఁ గొట్టెను. అప్పుడది నేలపైఁగూలఁగా దయాసముద్రుం డగుబుద్ధుఁడు తన కన్నీటిచే దాని మేనంత యుఁ దడుపుచుఁ, దనపట్టువస్త్రముచే దాని రక్తముఁ దుడుచుచు గాయము జెంది యున్న యాపక్షినిమృదువైన తనహస్తములచేఁ బట్టుకొని యింటికిఁ బోవుచుండఁగా దేవదత్తుఁ డడ్డగించి “ నేను గొట్టినపక్షిని నీవు తీసుకొని పోవుటకు నీకేమిహక్కు గల” దని ప్రశ్నించెను. అప్పుడాదయామయుఁడు “ దయ యనెడియధికారము చేతను, ప్రేమయనెడి హక్కుచేతను, నీపక్షి నాదై యున్న” దని చెప్పి దానిం దీసుకొని రక్షించి విడిచిపెట్టెను.

114 వ కథ.

ఒకరాజు ధనలక్ష్మికొఱకనేక సంవత్సరములు తపము

చేసి యెన్నిదినములకును దనమనోభీష్టము నెరవేఱనందునం దుదకు విసుకుజెంది వైరాగ్యమును బూని రాజ్యమంతయు విడిచిపెట్టి యరణ్యమునకుం బోవుచుండెను. అప్పుడు ధనలక్ష్మి ఘల్లుఘల్లున వచ్చి యెదుటనిలచెను. అప్పు డారాజు ‹‹ఆహా ! నిన్ను గోరినంతవఱకు నీవు రావైతివి. నే నిప్పు డాశారహితుండను నీతో నాకవసరం బే'' మని యడిగెను. అంతట ధనలక్ష్మి ‹‹రాజా నీవింతవఱకు భిక్షుకుఁడవు గాని యిప్పుడో నీవు నిజముగఁ జక్రవర్తివి. నేను బ్రపంచమంతయుఁ దృణప్రాయముగఁ జూచు మహానుభావుల నాశ్రయింతును గాని యాశాబద్ధు లగుదరిద్రుల చెంతకు రానొల్లనని చెప్పెను.

115 వ కథ.

పరిష్యాదేశమునందు ‹సాదీ' యను నొక కవిశ్రేష్ఠుఁడు గలడు. ఒక నాఁటితెల్లవారుజామున సాదీయును నాతని తండ్రియును మసీదునకు వెళ్ళి దైవప్రార్థనలను గావించి తిరిగియింటికి వచ్చిరి. అప్పటికిని గొందఱుగురకలుపెట్టుచు

నిద్రించుచుండుట 'సాదీ' చూచినవాఁడై 'తండ్రీ' వీరి మూర్ఖత్వమును జూడుము! ఇంతపెద్ద వారైననుగూడ భగవంతునారాధింపక పశువులవలె నించుకైనను జ్ఞానము లేక యెట్లు నిద్రించుచున్నారు!" అని చెప్పఁగా దండ్రి "హా కుమారా యేమని పల్కితివి! నీవు వేకువజామున లేచి భగవధ్యానముచేసి పరదూషణ చేయుటకంటెఁ నీవును వారివలె నింకను నిద్రించుటయే మేలు. భగవదారాధన చేయుట కంటెఁ బరదూషణయే యెక్కువ పాపము సుమా" అని హితోపదేశము చేసెను.

116 వ కథ.

రామతీర్థస్వాముల వారిచెంత కొకనాఁడు అమ్మహానీయుని మామయేడ్చుచు, గుండెలుబాదుకొనుచు నతిదుఃఖములో వచ్చెను. బ్రహ్మానందమగ్నుఁడైయున్న యాస్వామి యాతని దుఃఖమునకుఁ గారణ మడిగెను, అప్పుడాయన "అయ్యో యిఁకేమున్నది. కొంపకూలినది. వంశము నాశనమైనది. నీముద్దులబిడ్డ హఠాత్తుగ మృత్యువు పాలయ్యె

ను" అని చెప్పి వెక్కి వెక్కి యేడ్చుచుండెను. ఆశ్వాడా మహానుభావుఁడు కించెమైనను చలించక యద్భుతశాంత ముతో ,, ఆహా యిందు దుఃఖించుట కేమికారణమున్నది! గాలివీచుచున్నది. నీరు ప్రవహించుచున్నది. అగ్ని కాల్చు చున్నది. అని చెప్పి యేడ్చువారుందురా? పుట్టినవాఁడు చచ్చినాఁ డని చెప్పుటయు నట్టిదేగదా ఇందాశ్చర్య మేమి?" అని పల్కి యూఱడించెను.

117 వ కథ.

ఒకనాఁ డొకస్వామి వీథిలోఁ బోవుచుండఁగా నొకఁ మహమ్మదీయుఁడు చేతిలో నొకపారాయిబుడ్డిఁ బట్టుకొని యకేదారిని బోవుచు నాస్వామినిజూచి "స్వామీ కైలాస మార్గమేద"ని యడిగెను. అంతనాస్వామి వానిచేత నున్న సీసాను జూపి "ఇదే కైలాసమార్గ" మని చెప్పెను.

118 వ కథ.

పూర్వకాలంబున నొకరాజు గలఁడు. అతఁడు సదా యైహికసుఖములందు లోనై మదోన్మత్తుఁడై యుండెను.

ఆరాజు తనవినోదార్థమై కొందరు హాస్యగాండ్రను తనకడ నుంచుకొని వారితోఁ గాలము గడుపుచుండెను. వారందఱిలో నగ్రగణ్యుఁ డగునొకనికి బంగారుపతకము నిచ్చి దానిపై, అవివేకదామోదరశిఖామణి అని చెక్కించెను. ఇట్లుండ నొకనాఁడు రాజునకవసానకాలము సమీపించి, వ్యాధిగ్రస్తుఁడై పరుండి యవివేకదామోదరశిఖామణిని బిల్వనంపి కన్నీరు గార్చుచు "ఓమిత్రమా నేను బోవుచున్నాను" అనెను. అప్పు డాహాస్యగాడు లటాలున లేచి "స్వామీ గుఱ్ఱపుబగ్గీ కట్టించమందురా" యని అడిగెను. అంతట రాజు "ఓబుద్ధిహీనుఁడా నేను బోవుస్తలముకుఁ బండ్లమీదఁ బో"రని చెప్పెను. తిరిగివాడు "అట్లైనదేవా యేనుగ దెప్పించ మందురా" యనెను. రాజు వీనియజ్ఞానమునకు విసుకుచెంది "ఛీ మూర్ఖా యచటకు నేనుగపైఁ గూడ బో" రని చెప్పెను. అప్పు డాయవివేకి కొంచెమాలోచించి "ఆహా జ్ఞాపకము వచ్చినది. రాజా, పల్లకీతెప్పించునా" యనెను. రాజువీని మాటలకు మిగుల నచ్చెరువు

నొంది "ఓబుద్ధిహీనుఁడా! యచటకు పల్లకిపైఁ గూడఁ బోవుటకు వీలుకాదనెను. ఈమాటల కాదామోదరశిఖామణి విస్మయము చెంది "ఓప్రభువర్యా, మీ కేమితక్కువ! మీరు నడచిపోవునంతటి గ్రహచారమేమి? అని తిరిగి యడిగెను. రాజు మరణావస్థయం దున్నను వీని తెలివి తక్కువకు నవ్వువచ్చి "ఓ పిచ్చివాఁడా నేనుబోవుచోటకు నడచిపోవుటకు సయితము వీలుండద"నెను. ఈమాటల కాహాస్యగాడు మఱింత యాశ్చర్యమును జెంది "రాజా, మీరు పోవుస్థలము వింతగా నున్నది. మీతో నేనుగూడ రావచ్చునా" యనెను. రాజు మిగుల కోపముతో "ఛీ! నోరు మూసుకొనుము. అక్కడకు నెవరికి వారేపోవలెను. కాని నీవునాతో నెట్లువచ్చెదవురా" అని యడిగెను. అంత నాయవివేకి ఇదేమి విచిత్రము! రాజా మీరు పోయెడిస్తలము బహువిచిత్రముగా నున్నది! అది దయచేసి యెద్దియో సెలవిందు" అని యడుగ నారాజు కొంచ మాలోచించి నేమి యుఁ జెప్పఁ జాలక "నాకుఁ దెలియదు" అని చెప్పెను.

ఇట్లు చెప్పినతోడనే నావాస్యగాడు తనబంగారుపతకమును వూడఁదీసి "రాజా దీనిని మీరే ధరించుట కర్హులు. ఇంత రాజ్య మేలుచు, నింద్రాదిభోగముల ననుభవించుచు మీజీవితములో మీరు తుదకెక్కడకుఁ బోయెదరో దానిని గూర్చి యించుకైనను విచారించ కుండుటకంటె నవివేక ముండునా? కనుక యవివేకదామోదరశిఖామణి యను బిరుదుకు మీరేతగుదురు గాని నేనుగాదని చెప్పి వెడలిపోయెను.

119 వ కథ.

ఒకనాఁడొక బ్రాహ్మణుఁడు బుద్ధభగవానులను జూచి "సోమరివలె నీవు బిచ్చమెత్తి జీవించెదవేల? ఏదైన నొక వృత్తి చేసుకొనరాదా" యనెను. అప్పు డామహానుభావుఁ డిట్లు జవాబు చెప్పెను. "ఓ బ్రాహ్మణోత్తమా నేను దున్నితిని. విత్తునాటితిని. ఇప్పుడది ఫలించినది. దాని ననుభవించుచుంటిని నీవును నావలె దున్ని విత్తు నాటినయెడల నీకును మేరలేనియాహారము దొరుకును." అంతట నాబ్రాహ్మణుఁడు "నీయెద్దు లేవి, నీనాగలియేది, నీపాలమెక్కడ యేగింజలు

నాటితివి?" అని యడిగెను. అప్పు డమ్మహానీయుఁడు "నాహృదయమే పొలము, మనస్సే నాగలి, వివేకమే కొరడా, ఇంద్రియములే యెద్దులు, ప్రేమయే విత్తనము, పట్టుదలయే ఎరువు, భక్తియే వర్షము, నిత్యానందమే దీనిఫలము, అది నేను సదా యనుభవించుచుఁ దృప్తుఁడనై యున్నాను. నీవును నావలెఁ గష్టించి సంతృప్తుడవు కమ్ము" అని చెప్పెను.

120 వ కథ.

పరమభక్తుండును, దేశోద్ధారకుండు నగు 'మహమ్మద్' ఒకనాఁడు భగవంతునిదర్శనార్థమై స్వర్గమునకుఁ బోయెను. అప్పుడు స్వర్గద్వారము మూసియుండుటచేఁ దలుపు గొట్టెను. అంతట లోపలనుండి యొకశబ్దము "నీ వెవ్వడవు" అని వినవచ్చెను. అంతట నామహనీయుఁడు "నేను మహమ్మద్" అని యుత్తరవు చెప్పెను. ఇట్లు చెప్పినంతనే "పో పొమ్ము. నీవు నిచటకు వచ్చుటకర్హుఁడవుగావు" అని తిరిగి వినఁబడెను. అప్పుడు మహమ్మద్ కొంచె మాలోచించి

మఱియొకసారి తలుపు గొట్టెను. అంతట తిరిగి "నీవెవ్వఁడవని ధ్వని వచ్చెను. అప్పు డాభక్తుఁడు "దేవా నేను నీదూతను మానవులకు సన్మార్గమును బోధించి నీ నిజభక్తులనుగా జేయుచుంటిని. నీపాదారవిందములను సేవించుటకై వచ్చినవాఁడ" నని చెప్పెను. అప్పుడును "నీకు స్వర్గప్రాప్తి యింకను గలుగలే" దని శబ్దము వినవచ్చెను. మహాత్ముఁడు ఖిన్నుఁడై మఱియొకసారి తలుపు గొట్టెను. తిరిగి యాదే విధమున "నీ వెవ్వఁడవు" అని ధ్వని వచ్చెను. మహాత్ముఁడు "దేవా నీదాసాను దాసుండను" అని జవాబు చెప్పెను. తిరిగి "ఛీ పాప్ము, నీ విచటకు వచ్చుటకు అర్హుఁడవుగావు" అని వినఁబడెను. ఈసారి యతఁడు తన మనోభీష్టము నెఱవేఱనందునఁ చింతాక్రాంతుఁడై విచారించి విచారించి బాహ్యస్పృహతప్పి యింద్రియచలనము లన్నియు నుడిగి సంకల్పశూన్యుండై సమాధినిష్ఠయందుఁ గొంతతడవు మగ్నుఁడై యుండి మహదానందమున లేచి తిరిగి యొకసారి తలుపు గొట్టెను అప్పుడును నదే విధమున "నీ వెవ్వఁడవు" అని

భగవద్వాక్యమును వినినంతనే "నేను నీవే" అని మహాత్ముఁడు ప్రత్యుత్తర మిచ్చెను. ఆతక్షణమే స్వర్గద్వారము తెరచుకొనెను.

121 వ కథ.

శంకరుఁ డొకనాఁడు తనయిద్దరు కుమారులగు గణపతి సుబ్రహ్మణ్యేశ్వరులను బిలచి "యిద్దఱిలోఁ బ్రపంచమంతయు ముందెవరు చుట్టివత్తురో వారికి మంచిఫలము నిత్తు"నని చెప్పెను. ఆతక్షణమే సుబ్రహ్మణ్యస్వామి తన నెమలివాహనముపై నెక్కి వాయువేగమనోవేగంబులతోఁ బరుగిడుచుఁ బోయెను. గణపతి యూరక తండ్రిచెంతనే కూర్చునియుండెను. ఇట్లు కొంతకాలము గడచిన పిమ్మట సుబ్రహ్మణ్యము భూమిచుట్టును దిరిగి యతివేగంబునఁ దండ్రి చెంతకు వచ్చుచుండుటఁ జూచి గణపతి మెల్లన లేచి తండ్రిచుట్టును దిరిగి "తండ్రీ నేనే గెల్చితిని, ఫల మొసంగుము"ని యడిగెను అంత శివుఁడు, నవ్వుచు "బాలకా ప్రపంచమంతయుఁ దిరిగివచ్చిన సుబ్రహ్మణ్యమునకుఁ గాక

నీ కెట్లు వచ్చు" నని యడిగెను. అప్పుడు గణపతి "దేవా నేనొక్క ప్రపంచమునే గాక అన్నిలోకములు సయితము లాయన్నకంటె ముందుగాఁ దిరిగి వచ్చితిని. ఏలయన సమస్తలోకములు నీయందే యున్నవి. నీకుఁ బ్రదక్షిణము చేయుట లోకము లెల్లఁ దిరిగినట్లే గదా" యని చెప్ప యాదేవదేవుఁడు మిగులసంతసించి ఫలమును గణపతికే యిచ్చెను.

122 వ కథ.

సకలసద్గుణసంపన్నుఁడై తపోనిష్ఠాగరిష్ఠుఁడైన యొక మునిపుంగవుని కొకశిష్యుఁడు గలఁడు. ఆశిష్యుఁ డనుదినము తనగురువునకు మిగులభక్తిశ్రద్ధలతో నుపచారము చేయుచుండెడివాఁడు. ఇట్లుండ నొకనాఁ డొక మాతరయోగి యాశిష్యునిఁ జూచి "ఓయీ! నీ వెంతవెఱ్ఱివాఁడవు, గురువున కేమిజాలియను నని వాని నాశ్రయించితివి? వాఁడెందుకును బనికిరానికట్టెమొద్దు. నావలె వాఁడు నీకృపై నడువఁజాలఁడు. అట్టి తెలివిహీనుఁడగు పరమనీచుని నాశ్రయించి

నీకాలమంతయు వ్యర్థము చేయుచుంటివి గదా" యనిపలు
క నాతఁడు మిగులశాంతవచనములతో "అయ్యా మీరు చెప్పి
న మహిమలు నాకు చేయవచ్చును, సంతకంటె వేయిరె
ట్లుత్కృష్టమైన మహిమ వారియొద్ద నుండుటచే వారి
నాశ్రయించితి" ననెను. ఈమాటల కాయోగి యాశ్చ
ర్యము చెంది "ఆహా యామహిమ యెట్టిదో కొంచము
నాకుఁ దెల్పు" మని కోపముగఁ బల్కెను. శిష్యుఁడు
"అయ్యా గర్వము, పరదూషణ, క్రోధము మొదలగుదుర్గుణ
ములు వారియొద్ద వెదకినను గాన్పించవు. ఇంతకన్న నెక్కువ
మహిమ కలదా?" యని చెప్ప నాయోగి తనదుర్గుణంబు
లకు సిగ్గుపడి యూరకుండెను.

1౭౬వ కథ.

ఒకజ్ఞాని బజారునఁ బోవుచుండఁగాఁ బురజనులు
చూడవచ్చిరి. కొందఱాయనకుఁ బట్టువస్త్రములఁ గప్పిరి.
కొంద ఱాభరణములచే నలంకరించిరి. కొందఱు నమస్కా
రములు చేయుచుండిరి. ఇదంతయు నాతఁడుచూచి

ఓహో నిత్యకల్యాణస్వరూపుండగు భగవంతుని చేతుల కాభరణము లేల, కాళ్ళకు నగ లేల, యాదివ్యమంగళస్వరూపుని దేహమునకుఁ బట్టవస్త్రము లేల" యని నవ్వుచుఁ బల్కెను ఈవృత్తాంతమంతయు రాజునకుఁ దెలిసి "ఔరా, యాకపటసాధువు తాను భగవంతునిగా భావించుచున్నాఁడు గా! ఇట్టిఘోరపాతకుని శిరము నాయెదుటనే ఖండింపుఁ డని యాజ్ఞాపించెను. తత్క్షణమే యాజ్ఞాధివి బంధించి రాజసాన్నిధ్యమున నిలువఁ బెట్టి, తలారి ఖడ్గము పైకెత్తి తల నరుకఁ బోవుసమయమున నాసాధువు "ఆగు ఆగు, రాజా మిమ్ముల గొన్నిప్రశ్నల నడిగెద. వాటికి బ్రత్యుత్తర మిచ్చి పిమ్మట మీపని కానిం" డని చెప్పెను. రాజందుల కంగీకరించెను. అప్పుడు సాధువు "రాజా! యీప్రపంచ మెవ్వరిది?" అనియడిగెను.

రాజు :— భగవంతునిది.

సాధు:— ఈసూర్య చంద్రాదు లెవ్వరివి?

రాజు :— భగవంతునివి.

సాధు:— ఈ యనంతకోటి జీవరాసు లెవ్వరివి?

రాజు:— భగవంతునివే.

సాధు:— ఈశరీరము లెవరివి?

రాజు:— భగవంతునివే. యందుకు సందేహ మేమి?

సాధు:— ఈచేతులు, కాళ్లు, మొదలైన యంగములెవరివి?

రాజు:— ఇవియును భగవంతునివే.

యనెను. అంత సాధువు "రాజా నే నీమాటలు చెప్పినందుకే గదా నాకుమరణదండన విధించిరి! ఇప్పుడు మీరు చెప్పినమాటలనే నే నంటిని గాని భగవంతుని నింద చేయలేదే!" యనెను. రాజు తనయవివేకమునకు సిగ్గుపడి యాభక్తుని పాదములపైఁ బడి క్షమాపణ వేఁడెను.

124 వ కథ.

ఒకనాఁడు రామతీర్థస్వాములవారిపరిచారకుఁ డగునొక బాలుఁడు మేడపై నెక్కి "నేనే పరమాత్మను, అంతా నేనే." యని సంతోషమున నరచుచుండెను. ఈమాటలు వినిన యొకపెద్దమనిషి వానిమాటలకు నవ్వి "ఓరీ బాలకా

నీవే పరమాత్మ వైనయెడల నక్కడనుంచి క్రిందకు దుముకుము చూచెద"ననెను. ఆబాలుడు కొంచ మైనను తడుముకొనక "ఓయీ బ్రహ్మాండ మంతయు నేనే నిండియున్నాను. నేను లేని స్థలము చూపించినచో నచట దుమికెదను" అని చెప్పెను. అంత నాతడు పరమాత్మ లేనిచావు చెప్పుటను నిర్దేశించలేక సిగ్గుజెంది వెడలిపోయెను.

125 వ కథ.

ఇద్దరు మనుజులు కలిసి యొకయూరికి బోవుచుండిరి అందొకడు దైవభక్తుడు, రెండవవాడు నాస్తికుడు వారి మార్గమధ్యమున నొక దేవాలయము తటస్థించెను. అప్పుడు భక్తుడు లోపలకుబోయి భగవంతుని ఇంచుక ప్రార్థించి తిరిగి వచ్చుచుండగా వాని కాలిలో ముల్లు గుచ్చుకొనుటచే కుంటుచు వచ్చెను. బయటనే కూర్చున్న నాస్తికునికి నొక వరహా దొరికెను. అప్పుడు నాస్తికుడు భక్తునిజూచి "ఓయి బుద్ధిహీనుడా, చూచితివా? దేవుడట! వయ్య మట! నీభక్తికి గలిగిన ఫలము కాలిలో

ముల్లు, నాభక్తిహీనతకుఁ గలిగిన ఫలము వరహా. నిజముగ భగవంతుఁడే యున్న నిట్టియన్యాయ ముండదుగదా? ఇక నైనను నీకిట్టిభ్రాంతి విడచి నావలె నుండుము'' అని చెప్ప నాభక్తునికిఁ గొంచెము మనసు కలవరపడి యను మానించుచుండగా నొకజ్ఞాని యటుబోవుచు వారింజూచి జరిగిన వృత్తాంత మంతయుఁ దెలిసుకొని యాభక్తునిఁ జూచి "ఓయీ, నీవు పూర్వజన్మంబున నొకగొప్ప నేరము చేసితివి. దానికిఁ బ్రతిఫల మిప్పుడు నీవు పాముచేఁ గరువఁబడి చావవలసి యుండెను. కాని యీజన్మమందు నీకుఁ గలిగిన దైవభక్తి యడ్డమువచ్చి నీశిక్ష తేలిక యయ్యెను. పిమ్మట నాస్తికునిఁ జూచి "ఓయీ నీవు క్రిందటి జన్మమున నొక గొప్ప సత్కార్యము చేసితివి. అందులకు ఫలముగా నీ కిప్పుడు ధనరాసి ప్రాప్తము గావలసియుండ నీభక్తివిహీనత దానికి నడ్డము వచ్చి నీఫల మతిస్వల్ప మయ్యెను." అని చెప్ప భక్తునికి ననుమానము దీరి భక్తి వృద్ధినొందెను. నాస్తికునికి భక్తిబీజములు నాటెను.

126 వ కథ.

ఒక పరమహంస సమాధినిష్ఠుఁడైయుండ సమ్మహాత్ముని స్థితి నెఱుంగని యొక గృహస్థుఁ డాతనిం జూచి, "యోగివర్యా! మీరేల సకాలంబున సంధ్యావందనము చేయరు?" అని యడుగ నాతఁడు "ఓగృహస్థుఁడా, అజ్ఞాన మనెడి తల్లి చచ్చినది; సుజ్ఞాన మనెడి పుత్త్రుఁడు పుట్టినాఁడు. ఇట్లు మూతకము, పురుడు రెండు నొకచేసారి సంభవించి యుండగా సంధ్యావందనము చేయుట కెట్లగును? అని యుత్తర మిచ్చెను.

127 వ కథ.

ఒకానొక స్థలమందుఁ బ్రతిదినమును వేదాంతులు గూడి పరమార్థమునుగూర్చి చర్చించుచుండెడివారలు. ఇట్లుండ నొకనాఁ డాగ్రామమున కొకమహానీయుఁడు వచ్చి నను సంగతి తెలిసి యావేదాంతు లందఱును వారిని దర్శించుటకై బోవ యత్నించుచుండఁగా నచటఁ బంజరమునున్న చిలుక చక్కఁగా మాటలాడుట నేర్చిన దగుటచే నొక

వేదాంతిని బిలచి "యయ్యా మీరమ్మహనీయునిఁ జూచిన ప్పుడు నాకీబంధమునుండి విముక్తి యెట్లగునో తెలుసుకొని రమ్మని" వేఁడుకొనెను. అట్లే యావేదాంతి యామహాపురుషుని చెంతకుఁ బోయెను. అప్పు డాయన నదిలో స్నానము చేయుచుండఁగా "స్వామీ పంజరములోనున్న చిలుకకు బంధవిముక్తి యెట్లగు" నని యడిగెను. ఆమహానుభావుని చెవికి నామాటలు సోకినంతనే తిరిగి మాట్లాడక గభాలున నీట మునిఁగి శవమువలె ప్రవాహములోఁ గొట్టుకొని పోయెను. ఈయుపద్రవమున కావేదాంతి యాశ్చర్య పడెను. మిగిలినవా రంద ఱామహానుభావుని మరణమున కీవేదాంతియే కారణమని వానిని దిట్ట సాగిరి. పాపమా వేదాంతి ఖిన్నుఁడై యింటికిఁ బోయెను. ఇల్లు చేరినంతనే చిలుక "అయ్యా నాప్రశ్న కేమి జవాబు చెప్పినార"ని యడిగెను. అప్పు డాతఁడు "అయ్యో! యేమని తెల్పు దును. నీపాడుప్రశ్న యడిగినంతనే యామహనీయుఁడు మృతి నొందెను." అని యిట్లు పలికినలోపనే చిలుకగిర

గిరగిర దిరిగి నిస్పృహమై క్రిందఁ బడెను. ఈయద్భుతమును జూచినవా రందఱు మిగుల నాశ్చర్యమును జెంది యేమియుఁ దోఁచక చచ్చినచిలుకను బంజరమునుండి తీసి యావల విసరి పారవేసిరి. అట్లు పారవేసినంతనే చిలుక బుఱ్ఱున నెగిరి యొకవృక్షాగ్రమునఁ గూర్చుండి "ఓమతిహీనులారా! మీరిన్ని దినములనుండి వేదాంతశ్రవణముఁ జేయుచున్నను, బంధవిముక్తికి మార్గమును గ్రహింపఁ జాలకైరి. ఆమహానీయుఁడు చచ్చెనని మీరు తలఁచుచున్నారు. అయ్యో! మీ రెంతవెఱ్ఱివారలు! నాప్రశ్నకు వారు చెప్పిన యుత్తరము వారు నాచరించియే చూపిరి. మీ రెన్నిదినములు వేదాంతశ్రవణము చేసినను, యెందఱి మహనీయుల దర్శించినను, నెన్ని దేవతలకు మ్రొక్కినను బ్రతికియుండియు నెవఁడు ప్రపంచమునకుఁ జచ్చునో వాఁడే జరామరణము లనెడి బంధములనుండి తప్పించుకొని యానందముతో నిత్యము నానరె స్వేచ్ఛను గాంతు రని హితోపదేశము చేసి యాకాశముపై కెగిరి పోయెను

128 వ కథ.

ఒకసాధువు సర్పముచేఁ గఱవఁబడి మరణావస్థయం దుండఁగా నాతని శిష్యులు "గురువర్యా! అయ్యో, యీ పాడుపాము మీకు మృత్యు వయ్యెఁగదా! మీయోగబలముచే దానివిషమును హరింపఁ జేయ రాదా" యని యడిగిరి. అంతట నాభక్తుఁడు "శిష్యులారా, జగన్మాత, నన్ను దక్షిణమే యామె సాన్నిధ్యమునకు రమ్మని సర్పముచే వార్తఁ బంపి యున్నది. మాతల్లియాజ్ఞను నే నుల్లంఘింతును" అని చెప్పి యానందమునఁ గండ్లు మూసుకొని ప్రాణములు విడచెను.

129 వ కథ.

ఒకానొక మనుజుండును వానిభార్యయు విరాగులై యరణ్యమునకుఁ బోవుచుండిరి. ఇట్లు పోవుచుండఁగాఁ ద్రోవలో నొకనవరత్నఖచిత మగు నాభరణము భర్తకుఁ గాన్పించెను. వెంటనే యాతఁడు దానిం జూచి "అహో! యిది నాభార్యకంటఁ బడినయెడల దీనిపై నాశ గలుగ

వచ్చు నని దానిపైఁ గాలితో మట్టి వేసెను. ఇదంతయుఁ జూచు చున్న యాతనిభార్య “ఆహా! మీ రేమి చేయు చున్నారు, చెప్పు” మని బ్రతిమాలుకొనెను. అంతనా తడు దాచుటకు వీలు లేక తాను జేసినకార్యమును చెప్పెను. అప్పుడామె నవ్వుచు “ఆహా మీరు తిరిగి యింటికిఁ బోవచ్చును. మీ కింకను వైరాగ్యము కలుగలేదు. నిజమైన విరాగికి మన్నును బంగారము నొకటిగానే గోచరించును. ఇట్టి భేదబుద్ధి మీకుఁ బోకమునుపే సంసారము నేల త్యజించితిరి” యని చెప్పినంతనే నాతఁ డామెవైరాగ్యమునకును, బుద్ధికుశలతకును మిగుల సంతసించెను.

150 వ కథ.

కర్ణునితో సమానమైనదాత లేఁడని ప్రశంసించు మంతయుఁ బొగడుచుండ దుర్యోధనుఁడు సహింపఁ జాలక యాతనికన్న నెక్కువపేరు సంపాదించ వలెనని, కర్ణుని వలె దానము దానకంకణము గట్టుకొనెను. సర్వజ్ఞుఁడగు శ్రీకృష్ణభగవానులు దుర్యోధనుని బరీక్షింపఁదలఁచి యొక

బ్రాహ్మణవేషము దాల్చి వానిచెంతకుఁ బోయి దాన మడిగెను. అప్పు డా రాజు "ఓభూసురోత్తమా మీకు ద్రవ్యముగాని, యిండ్లుగాని, భూములుగాని యేమి కావలెన నన్నను నిచ్చుటకు సిద్ధుఁడనై యున్నాను. మీ కేమి కావలయునో సెల వొసంగుఁడు" అని వినయవిధేయములతో నడుగ నాబ్రాహ్మణవేషధారి "రాజా నా కివేమియు నవసరములేదు. నే నొకక్రతువును జేయ సంకల్పించినాను. ఆనాఁటికి నాకుఁ గావలసిన కట్టెపుల్లలుమాత్రము దయచేసినచో నదే మహాభాగ్య" మని విన్నవించినంతనే దుర్యోధనుఁడు "ఓహో, యెంతస్వల్పకోరిక గోరితివి ! అట్లే కానిమ్ము" అని చెప్ప యాబ్రాహ్మణుఁడు వెడలిపోయెను. పిమ్మట సర్వశక్తుం డగుశ్రీకృష్ణుఁడు పదిహేనుదినము లహోరాత్రములు కుంభవర్షము గురిపించి యెచ్చటను నొక్కయెండుపుల్లయైన లేనట్లుచేసి దుర్యోధనునికడకుఁ జేరిగి బ్రాహ్మణవేషముతో బోయి "ఓ మహారాజా, నేనడిగిన కట్టెపుల్లలు దయచేయుఁ" డని యడిగెను. అప్పుడు

దుర్యోధనుఁడు విస్మయముఁ జెంది "ఓ బ్రాహ్మణోత్తమా, గడచిన గొప్పవర్షములచే నెచ్చటను యెందు కట్టెయే లేదు. మీకుఁ గావలె నన్న నెంతధనమైన నిచ్చెదను. లేక కొన్నిరోజులు మీ క్రతువును నిలిపినచోఁ బిమ్మట మీకెంత కలపనైన నిచ్చెదను" అని చెప్పినంతనే యాబ్రాహ్మణుఁడు 'ఓహో రాజా నీ వేమో మహాదాతవని విని నీచెంతకు వచ్చితిని. నీమాటలు నమ్మి క్రతువుచేయుట కిప్పుడు సమకూర్చుకొంటిని. కట్టెపుల్లలే యివ్వజాలక నాక్రతువుగూడ నిలుపుకొమ్మని సలహాయిచ్చుచుంటివి. చాలు చాలు నీచేత కానిచోఁ గర్ణునిచెంతకే పోయెదను" అని చెప్పి తిరిగి పోయి కర్ణునియొద్దకేగెను. కర్ణుఁడు వీనికోరికవిని కొంచమాలోచించి సేవకులను బిలచి తనదివ్యభవనమును కొంత నూడఁదీయించి యందలి విలువగల కలపనంతయు నాబ్రాహ్మణుని కిచ్చి పంపెను. ఆబ్రాహ్మణుఁ డాకలపనంతయుఁ బండ్లపై నెక్కించి దుర్యోధనుని యింటిముందరగాఁ బోవుచుండ దుర్యోధనుఁ డాశ్చర్యముచెందిఅహా, నిజముగఁ

గర్లునకే దాతశబ్దము చెల్లును గాని నావంటివానికిఁ గాదు" అని సిగ్గుఁ జెచ్చుకొని తాను గట్టుకొనిన దానకంకణమును దీసివేసెను.

131 వ కథ.

ఒక గ్రామములో నొక పేదవాఁడు కలడు. వాఁడొక చిన్నగుడిసెలోఁ దనయాలుబిడ్డలను దనకష్టార్జితమువల్ల బోషించుచు సుఖంబునఁ గాలముఁ గడుపుచుండెను. ఆగుడిసెకు సమీపముననే మిక్కిలిసౌందర్యమైన యొక భవనమును నిర్మించి యందుఁగాపురము చేయుచున్న యొకధనికుఁడు కలడు. ఆధనికున కెప్పుడును మన శ్శాంతి లేకఁ యొద్దియో యొక కలవరముగలిగి సంతోష మన నెట్టిదో నెఱుగనివాఁడై యుండెను. ఇట్లుండ నాగ్రామమున కొకసన్యాసి వచ్చెను. అప్పు డాధనికుడు ఆయనను దర్శించి "స్వామీ, భగవంతుడు నాకన్నివిధ ముల పూర్ణమైన నైశ్వర్య మిచ్చినను ఆదరిద్రున కున్న మన స్థిమితకు నాకు లేదు. వాని ముఖమం దెప్పుడును సంతో

నము తాండవమాడుచుండును. ఇందుకుఁ గారణ మేమని యడిగెను. అప్పు డాసన్యాసి "ఓయీ! నీమనశ్శాంతిని భంగము చేయుచున్నది నీధనమే" యనెను. అంత నాధనికుఁడు ఆశ్చర్యము జెంది "అహా సమస్తసౌఖ్యములు ధనముచేతనే లభించుచుండగా నాసౌఖ్యభంగమునకు ధనమెట్లు కారణమగును? ఇది వింతగా నున్నది. నాసందేహము దీర్పు" డని యాసన్యాసిని యడిగెను. అంతట వారిద్దరును యా పేదవాని గుడిసెకుబోయి వానికి దెలియకుండ నొక గుడ్డకు 99 రూపాయలను గట్టి గుడిసెలో బడవేసిరి. అమరువాడు తిరిగి వారిద్దరును యాగుడిసెకుఁబోయి వానిని జూచిరి. ఆబీదవానిముఖము వాడిపోయి సంతోషహీనమై విచారగ్రస్తమై యుండెను. అందులకు కారణమేమని సన్యాసి వానినడుగ వాడు అయ్యా నాకు నిన్నటిదినమున ఒకసంచి దొరకినది. అందు 99 రూపాయలు మాత్రమే యున్నవి. నూటికి ఒక్కటి తక్కువగా యుండుటచే దానిని గూడ పూర్తి జేయ వలెనని మే మందరము నిన్నటి

నుండి పస్తుంటిమి. ఈకారణముచే నాముఖము వాడియు న్నది. మఱియు ఈరూపాయలను ఎక్కడైన దాచినచో వొంగ లపహరింతురేమో ననియు నెవరికయిన అప్పిచ్చి నచో తిరిగి యివ్వరేమో యని జిజ్ఞాసయు నాపిల్లలు యీధనమంతయు తమకే యివ్వమని బాధించుటచే దుఃఖమును పొంది యున్నా నని చెప్ప యాధనికుని సందేహము తీరెను.

132 వ కథ.

జర్మన్ దేశస్థుడును తత్వవేత్తలలో నగ్రగణ్యుండు నగు "క్యాంటు" అను నాత డొకదినమున నాత్మవిచారణ యందు మగ్నుడై మార్గమున బోవుచుండ దనచేతికఱ్ఱ యొక పెద్దమనిషికి తగిలెను. అంత నాతడు "క్యాంటు" ను జూచి కోపముతో "ఓయీ నీ వెవరు?" అని ప్రశ్నించెను. అంత క్యాంటు చిరునవ్వుతో నీవు నన్నడిగిన ప్రశ్నకు నీవే సదుత్తరము చెప్ప గలిగినయెడల నీభూమండలమంతయు నే నెట్లయిన నార్జించి నీకు బహుమాన మొసంగెదను" అని చెప్పెను

133 వ కథ.

ఒకపిల్లవాడు మరియొకపిల్లవానితో "నీవు దేవుడున్న స్థలము చూపించినయెడల నీకొకపండు నిచ్చెద" నని చెప్పెను. రెండవపిల్లవాడు "నీవు దేవుడు లేనిస్థలము చూపించినచో నీకు రెండుపండ్లు నిత్తు" నని జవాబు చెప్పెను.

134 వ కథ.

పూర్వకాలమున ఒకమనుష్యుడు మఱియొకనికి కొంత భూమి నమ్మెను. అతడు దానిని త్రవ్వుచుండగా ధనముతో నిండిన రెండుబంగారుకలశములు దొరికెను. వెంటనే వాడు యాకలశములను దీసుకొని తనకు భూమి నమ్మినవాని యొద్దకు వెళ్ళి "అయ్యా మీకు నా కమ్మినభూమిలో యీద్రవ్యము దొరకినది. ఇది మీదే గనుక దీనిందీసుకొను" డని చెప్పెను. అంత నామనిషి "అయ్యా నాభూమిని మీ కమ్మినపుడే అందుండెడిధనముసహా మీదేగాని నాదె ట్లగును? గనుక దానిని మీరే దీసుకొం"డని తిరిగి యిచ్చె

వేసెను. గాని యాతడు "ఓహో యి దెక్కడియన్యా యము మీరునాకు భూమినే అమ్మితిరిగాని అందుండెడి ధనము నమ్మలేదు గదా. ఇట్టి పాపకృత్యమునకు నేనొడి గట్టుకొనను" అనిదానిని తిరిగివానికేయిచ్చెను. ఇట్లీయిరు వురు వివాదములాడుచు ధర్మరాజు చెంతకు బోయి చెప్పు కొనెను. ఆరాజు యిద్దరిని తృప్తిచేయు జాలక సర్వజ్ఞుడగు శ్రీకృష్ణుని సాన్నిధ్యమునకు బంపెను. అంత నామహాను భావుడు వీరిద్దరి వివాదమును విని "మీకొకసంవత్సరము గడువు బెట్టితి. అంతవరకు నీరెండుకలశములను చెరియొ కటి భద్రముగా గాపాడి సంవత్సరాంతమునకు తిరిగి నా యొద్దకు వచ్చినచో మీకు న్యాయము చెప్పెద నని చెప్పి పంపివేసెను. ఇదంతయు జూచుచున్న ధర్మరాజు ఆశ్చ ర్యము జెంది 'కృష్ణా నీవు మహానుభావుడ వని వారిని నీయొద్దకు బంపితిని, వారికి హిత వగు తీర్పును చెప్పి యిద్ద రిని సంతోష పరచక యీస్వల్పకార్యమునకు సంవత్స రము గడువుబెట్టితివి. ఇంతమాత్రము నేను చేయ లేక

పోలినా" యని పరిహసించెను. అంత శ్రీకృష్ణుఁడు చిరునగవ్వుతో « ధర్మరాజా నేను వారివివాదము పరిష్కరించితిని. వారు మరల మనవద్దకు రారు" అని చెప్ప నారాజునకేమియు నర్థముగాక దానిని వివరించి చెప్పుమనెను. అప్పుడు కృష్ణుఁడు « రాజా ఆ బంగారు కలశముల నిద్దరికి చెరియొకటి నిచ్చి భద్రముగా నొకసంవత్సరము కాపాడుడని చెప్పియుంటిని. ఆ యొకసంవత్సరము ఆధనమును తమయొద్దనే యుంచుకొనుటచే కొంతకాలమునకు సాంగత్యదోషము వాటిల్లి వారిద్దరికిని దానియందు ఆశగలిగి దక్కినదే చాలు నని సంతోషించి న్యాయస్థానమునకు బోయిన అదికూడ పోవునేమో యని భీతిచే యూరకయుందురు" అని చెప్ప ధర్మరాజు శ్రీకృష్ణుని యపారజ్ఞానమున కచ్చెరవు నొందెను.

135 వ కథ.

ఇగ్లాండు దేశమునందు న్యూటన్ అను తత్వవేత్త తన స్నేహితు నొకనిని భోజనమునకు బిలచి, ఆ సంగతి తనయింట నుండు

వారికి చెప్పుటకూడ మరచి తత్వవిచారణయందు మగ్నుడై యుండెను. పిమ్మట వానిస్నేహితుడువచ్చి యాతత్వవేత్తకు భంగము కలుగునేమో యని పిలువకనే ఆతనికడ్డ బల్లపై నమర్చియున్న యాహారమును భుజించి వెళ్ళిపోయెను. పిమ్మ టకొంతసేపటికా తత్వవేత్త స్నేహితుడు వచ్చి బల్లమీదనున్న యుత్తపళ్లెమును గిన్నెను, పండ్లతోళ్లను జూచి, అహా నేను భుజించినసంగతియే నాకు తెలియలేదు! ఈదృష్టాం తముతోక్కుడ లేకున్నచో నేనింకను భోజనము జేయలేదనే యూహింతునుగదా యని కడుపునిండిన వానివలె సంతసించి తిరిగి ధ్యానమగ్నుడైయుండెను.

186 వ కథ.

ఒకరాజుభార్య చాలదైవభక్తి గలిగి సకల సద్గుణసంప న్నురాలై యుండెను. ఒక్కసారియైన నోట "రామా" యని యుచ్చరించనియామెభర్తను ఎటులైన భక్తి వంతు నిగా జేయు వలెనని యెన్నివిధముల బోధించినను నిష్ఫలమై మిగుల చింతించుచుండెను. ఇట్లుండ నొకనాడు రాజు

నిద్రబోవుచు 'రామా' యని నెమ్మదిగ కలువరించెను. అప్పు డా సాధ్వీమణి మహదానందంబునొంది అహా యేటికిగదా నేను ధన్యురాల నైతిని అని మిగుల సంతసించి మరునాడు పట్టణమంతయు నలంకరింప జేసి పేదలకు అన్నవస్త్రము లనిచ్చి విశేషధనమును దానము జేసి గడు వైభవముల జరుపుచుండగా రాజు యిందులకు గారణము దెలియక భార్యకృత్యముల కాశ్చర్యమొంది యామెను దానికి గార ణము జెప్పుమని యడిగెను. అంత నా పతివ్రతాతిలకము 'నాథా, యిన్నిదినములకు మీనోట భగవన్నామమును, వినగల్గితిని. ఇంతకన్న నాకు బరమానందమేమున్నది, ఇది యేకారణము" అని చెప్పెను. ఇది వినినంతనే రాజు విస్మ యము జెంది "నే నేమని బల్కితి! యెప్పుడు బల్కితి! యని యడిగెను, అంత నామె "నాథా మీరు నిద్రించుచు రామా యని కలువరించితిరి" అని యనినంతనే రాజు "అయ్యో యెన్నిసంవత్సరములనుండియో మిగుల భద్రము గ నాహృదయకమలమునందు దాచుకొనిన నాయమూల్యధనము

వెల్లడి యయ్యెగదా యని ప్రాణములువిడిచెను.

187 వ కథ.

కొన్ని సంవత్సరములక్రిందట నే గుంటూరుపురమున కొకదిగంబరిగానున్నయోగిని యెచ్చటనుండియోవచ్చి బజారున బోవుచుండగా ఒక రాచకీయయుద్యోగస్తుడు చూచి యామెను కారాగృహమున బెట్టించెను. అప్పుడమ్మహాసీయురాలిని దర్శించుటకై వెళ్ళినవరొకరు “అమ్మా మీ రేల బట్టకట్టరు? అని ప్రశ్నించెను. అందు కామె నేను బుట్టినపుడే చర్మవస్త్రమును ధరించి వచ్చితి. దీనిపైమరియొకవస్త్ర మేల?” నని చెప్పెను. అంత వారుతిరిగి “అమ్మా మీరిట్లుండదలచినచో నడవులలో నుండవలెను గాని పట్టణములకు రా కూడదు” అని చెప్ప నాదిగంబరి “నేనిప్పుడు ఘోరారణ్యమం దున్నాను. మీరు చెప్పినయడవులలో నుండు యడవిమృగములు నన్నేమియు బాధించక నాతో మైత్రి గలిగియుండెను. గాని యీప్రదేశమున నన్ను గారాగృహమున బంధించి విచ్చుకత్తులతో పహరానిచ్చుచున్నారు

నేనొకరిని సలుకరించలేదు. ఒకరిని దూషించలేదు. నాత్రోవను నేను బోవుచుంటిని, యిట్టినిరపరాధులను బాధించు ప్రదేశము ఘోరారణ్యముకంటె హెచ్చుపరమే గదా!" యని జవాబు చెప్పెను.

138 వ కథ.

ఒకనాడు రామతీర్థస్వామి అమెరికా దేశమునందుపన్యసించుచు రాచకీయ విషయములనుగూర్చి అధికముగ ప్రసంగించెను. ఆసభయందు న్యాయాధికారులును, న్యాయవాదులును, యింక గొప్పగొప్ప లుద్యోగములలోనుండు అనేకులును గలరు. ఉపన్యాసాంతరమందు న్యాయాధికారులు స్వాములు వారిచెంతకు వచ్చి "స్వామీ, మీ రిట్టి విషయములను యిక ముందెన్నడును ప్రసంగించవలదు ఏలయన నీదేశచట్టముల ప్రకారము మిమ్ము చెరసాలయందుంచుటయో, లేక నురిదీయుటయో సంభవించును. ఇది మీయొక్క శ్రేయస్సునుగోరి పలుకుచున్నార" ని హితవు జెప్పిరి. అంత రామతీర్థులవారు "ఓదయానిధు

లారా, ఈ దేహ మేమైనను సరే సత్యమునే ప్రకటించెదను. ఇప్పటివరకు నన్ను (ఆత్మను) ఛేదించగల్గిన ఖడ్గము చేయ బడలేదు. వేయేల, యించుకైనను నాకు హానిచేయగలుగు ఆయుధ మింకను పోతబోయ బడలేదు. నాకుపుట్టుక లేదు. చావు లేదు. భూతభవిష్య ద్వర్తమానములం దొక్కరీతిని యున్నవాడను. నాకు భయ మేల" యని ప్రత్యుత్తర మిచ్చెను. అంత వారు స్వాములవారి ధైర్యసాహసము లను స్వార్థపరిత్యాగమును గొనియాడుచు మరలి పోయిరి.

139 వ కథ.

రాధాకృష్ణ సంవాదము.

రా:—కృష్ణా, నీఅసత్యములకు మేరలేదు. అహా! ఇట్టి యసత్యప్రపంచము నొకదానిని గల్పించి మనుష్యుల నెంతమాయబుచ్చుచున్నావు.

కృ:—నిజమే. నేను అసత్యవంతుడనే యనుకొనుము. గాని నాఅసత్యమును అసత్యముగా నెవరుదెలిసికొం దురో వారికీఅసత్య ప్రపంచమంతయు మాయమై సత్య

స్వరూపుడ నగు నే నొక్కడనే గాన్పింతును సుమా.

రా:—అది యటుండ నిమ్ము. నీవు మోసగాడ వనియైన నొప్పుకొనెదవా లేదా? నీవును నేనును నిజమున నొక్కటే యైనను నీకును నాకును భేదముగల్పించితివి గదా? యిక నీవు మోసగాడ వని యనుటకు సందేహ మున్నదా?

కృ:—నిజమే నేను మోసగాడనే యనుకొనుము. గాని యెవరు తానును నేనును వేరని భావించునో యట్టి వారికి మాత్రమే నేను వేరుగా గాన్పింతును, గాని తానును నేనును ఒక్కటే యని భావించువారికి యొక్కటిగానే యుందును. ఇందు నాతప్పేమి?

రా:—నిజమే, నీయందేతప్పును లేదు. గాని దొంగ తనముమాత్రము పూర్తిగా గాన్పించుచున్నది. నీవంటి దొంగయే లేదు. మనుష్యులజ్ఞాన నేత్రమునందు మాయ యనుమంచు జల్లి వారియానంద మనుద్రవ్యము నపహ రించి వారినిదుఃఖములపాలు జేయుచుంటివి? ఇంతకన్న

దొంగతన మేమి? ఇది యైన నొప్పుకొనెదవా?

కృ:—సత్యము బల్కితివి. నేను దొంగనే యనుచున్నావు గాని వేదములునన్ను "తస్కరాణాంపతిః" యని దొంగలరాజాపహితము వర్ణించుచున్నవి. గాని నేను చేయుదొంగతనము అందరివలెనే గాదు ఎవరు అజ్ఞాన మనెడినిదురలోబడి తా మెవ్వరైనది మరచి నిద్రించుచుందురో అట్టి వారిని మేల్కొలుపుట కెంతయో ప్రయత్నింతును. అప్పటికిని వారులేవనియెడల వారిధనమును అపహరించుచుందును. ఇందుమాత్రము నాతప్పేమి?

రా:—కృష్ణా, నీ కేమి మాటలురాని వాడవా? అన్నిటికి నన్ని సమాధానములు చెప్పుచున్నావు, కాని నీవు మిక్కిలి క్రూరుడవు సుమా! నిన్ను దయాస్వరూపుడవని యెట్లు బలికెదరో తెలియదు! పిల్లికి చెలగాటము యెలుకకు ప్రాణసంకటము అనునట్లు నీలీలయంతయు హింసామయముగదా. ఆహా! నీ వెంతటికఠినాత్ముడవు!

కృ:—రాధా, నిజముగ నేను కర్తినాత్ముడనో లేక దయా స్వరూపుడనో యోచించి చెప్పుము! అందరియందును ఆత్మస్వరూపముగ నున్న నన్ను కొంచమైన హింసయు నితలపక లోతుగ బూడ్చి మట్టి గప్పి నన్ను దలువనైన దలపకున్నారు. వారంతకఠినులైనను నేనుమాత్రము యెవరిని విడనాడక యొక్కొక్క గావలసినది వారికిచ్చుచు తుదకు నాయందు లీనము చేసుకొనుచున్నాను.

రా:—కృష్ణా, నీయుక్తుల కేమి గాని, నీయంతవ్యభిచారి లేడుగదా! నీప్రియురాండ్రసంఖ్యకు మితమున్నదా? ఇదియైన నొప్పుకొనెదవా?

కృ:—రాధా, నాయందెన్నిదోసము లెంచుచుంటివి! నీవాలోకించిన యీనిందయు సత్యమే. ప్రతిజీవాత్మయు నాప్రియురాలే. నాప్రియురాండ్రతో అనేకవిధముల సరస సల్లాపములాడుచుందును. కొన్ని సమయముల నేను మగుడుగాను, కొన్నిసమయములు నేను వేరుగను కొన్ని సమయముల ఒకటిగాను యిట్లనేక

విధముల లీలావినోదములు సల్పుచుండుటకు నేనును నా ప్రియురాండ్రును యెప్పటికిని భేదభావములేక నొక్కటిగానే యుందుము.

రా:—కృష్ణా, జగన్నాటకసూత్రధారుండ వగునీకు సమాధానము చెప్పలేను గాని మఱియొక్క సందేహము మాత్రము దీర్పుము. నీవు పక్షపాతివిగా నాకుగాన్పించుచున్నావు. ఇది యైనను సత్యమేనా?

కృ:—రాధా, నేను పక్షపాతకుడ నని తలచువారికి నటుల నే గాన్పింతును, గాని నేనుమాత్రము పిపీలికాదిబ్రహ్మపర్యంతము గలఅనంతజీవకోటిని ఒకేవిధమున కాపాడుచు రక్షించుచున్నానుసుమా, నాయం దెప్పటికి తప్పు లేదు.

రా:—కృష్ణా, అఖిలాండకోటి బ్రహ్మాండనాయకుం డగు నీయట్టి మహామహుని కృత్యములు అవాఙ్మానసగోచరంబు గదా! నీదాసానదాసుల పాదరేణువున కైనను బోల్ప దగని నావంటి యసమర్థురాలు నిన్నెంచుటకంటె

మౌనము ధరించి మునులవలె గూర్చుండుటయే మేలు" అని చెప్పి యూరకుండెను.

140 వ కథ.

హెర్బర్టుస్పెన్సరు అను నొక ఇంగ్లాండు దేశస్థుండెను. అతను మహాజ్ఞానసంపన్నుడును, సకలవేదాంతరహస్యతత్వవేదియునై యుండెను. ఒకనాడొకవిద్వాంసుడు ఆయనతో "అయ్యా మీజ్ఞానవికాసము అపారపారావారముగా నున్నది. మీకింతజ్ఞానసంపత్తి గలుగుట కెన్నిగ్రంథములు జదివితిరో! యని ఆశ్చర్యమున బలికెను. అంత నాతత్వవేత్త నవ్వుచు "నేవిసేనగ్రంథములను జదివినచో జ్ఞానహీనుడను గాకే యుందును. సృష్టి యనెడి బ్రహ్మాండగ్రంథమును నేకదా పారాయణచేయుచుండుటచే నాకీజ్ఞానవికాస మయ్యె" నని జవాబు చెప్పెను.

141 వ కథ.

మిక్కిలి ధనవంతుడును పరమలోభియు నగువొకడును ప్యుడు తనద్రవ్యమునంతయు రాసులురాసులుగా పెట్టల

పెట్టి భూమిలో బూడ్చుచుండెను. ఇదంతయును జూచు
చున్నయొక సన్యాసి అందుకు గారణమడిగెను. అప్పుడా
ధనికుడు "ఎప్పు డెట్టియవసరము వచ్చునో యెవరికి దెలి
యును? ముందెప్పుడైన మిక్కిలియవసరము గలిగినప్పుడు
ఉపయోగపడుటకై ధనముదాచుచున్నానని చెప్పెను.
అంత నాసన్యాసి మారు పలుకక వెడలిపోయి మరునాడా
ధనికుని తనమఠమునకు వచ్చునట్లు జేసెను. అప్పుడా
సన్యాసి మిక్కిలిప్రయాసతో పెద్ద పెద్దరాళ్లను దెచ్చి
యొక పెద్దగోతిలో వేసి బూడ్చుచుండుటజూచి ఆశ్చర్యము
నొంది "స్వామీ, మీరేల యిట్టినిష్ఫలకార్యము జేయు
చుంటిరి" అని యడిగెను. అంత నాసన్యాసి, నాకెప్పు
డెట్టి యవసరమువచ్చునో, ఏమతములు రక్షించ వలెనో
యెవరికి దెలియును! ఎప్పు డేప్రళయమైనను, మరేయుపద్రవ
మైనను వచ్చి యీకొంపలన్నియు గొట్టుకుపోవునేమో
నని రాళ్లను భద్రముగా దాచుచుంటి నని చెప్పెను. అంత
నాధనికుడు పకపక నవ్వుచు, ఆహా యేమి విపరీతము

బిల్కుచుంటిని [illegible] తుక్కొంచలన్నియు గొట్టుకుపోయిన
రాళ్ళ కన్నదైన కనకవస్తువా? ఇంతకన్న నా వివేక
ముండునా యనెను. అంతసన్యాసి "సకల లోకాధీ
శుండును పరమాత్ముడును, జగద్రక్షకుండును [illegible]
రుడు శ్రీమన్నారాయణుడు బ్రహ్మపదసంతతముపోషించి రక్షించు
చుండగా నిర్బంధకులకొరకు ధనమునార్జింప [illegible] కంటె
నవివేకముగలదా?" అని బుద్ధిచెప్పెను.

1౪3 వ కథ.

చక్రవర్తికుమారుండు సిద్ధార్ధుడు విరాగియై కాషాయవస్త్ర
ములు ధరించి చేత నొక భిక్షాపాత్రను బూని తిరుగుచుం
డగా, చక్రవర్తి చూచి మిగులచింతాక్రాంతుడై "అయ్యో
కుమారా భూమండలమంతయును పాలించు మహారాజుల
పుత్రుడవైయుండియు భిక్షుకునివలె సన్యాసి వేషమును
దాల్చి మావంశమునకంతను అపకీర్తి దెచ్చుచుంటివి
గదా ! నేనుగాని నా తండ్రిగాని, నా తాతముత్తాతలు
గాని యెన్నడైన నిట్లు దరిద్రునివలె వీధులలో బిచ్చమెత్తి

రా? నాన వంశీయులందరు అనేకతరములనుండియు చక్ర వర్తులుగానే యున్నారుగాని యెవరైన సన్యాసిగా నొక్క రును లేరు. ఈవేసము దీని మానమర్యాదగాపాడుము అని చెప్పెను. మహానుభావుండగు బుద్ధభగవానులు చిరునగ వుతో॥ రాజేంద్రా, అట్లుకాదు నీవంశీయులందరును చక్ర వర్తులేగాని నావంశీయులందరును అనేకతరములనుండియు సన్యాసులుగానే నాదివ్యదృష్టికి గోచరించుచున్నది. నీవును నేనును జీవయాత్రలో వేరువేరుమార్గముల బోవుచు అనే కుల గర్భములబుట్టుచు జచ్చుచు యీజన్మమున ఇక్కడ గలసితిమి. తిరిగి నీదారిని నీవును, నాదారిని నేనును బోవ లసినవారలమేగాని వేరుకాదు" అని ప్రత్యుత్తర మిచ్చెను.

143 వ కథ.

ధృవుడను రాజకొమారుడు తన తండ్రికంటె నధికరా జ్యమును సంపాదించవలెనని ఘోరారణ్యమునకేగి యేకాం తమున నిశ్చలమనస్కుండై యనేక సంవత్సరములు తప

మాచరించుచుండెను. ఇట్లుండ కొంతకాలమునకు గామితార్థప్రదాయకుండగు భగవంతుడు ప్రత్యక్షమై “ఓ కుమారా, నీభక్తికి సంతసించితి. నీకేమికావలయునో కోరుము” అని పలుక నాభక్తాగ్రేసరుడు “హేదేవా, నాకేకోరికయులేదు. నేను వాంఛాశూన్యుండను” అని చెప్ప భగవంతుడు “యేమీ, ఏకోరికయు నీవుమరచితివా, ఎవనకున్న కన్నను మిన్నగారాజ్యాధిపత్యము కోరిగదా నీవు తపమాచరించుచుంటివి! కాన నేకచక్రాధిపుడవై ప్రపంచమంతయుం బాలించుము” అని పలుక నాబాలుడు “ఓసచ్చిదానందమూర్తీ, గాజుముక్కలకై వెదకుచుండ దివ్యమాణిక్యము దొరికినట్లును, జలబిందువుకై వెదకుచుండ అమృతకలశము దొరికినట్లును, రాజ్యాధిపత్యమునకై వెదకుచుండ నఖండసచ్చిదానందమూర్తివగు నీదర్శనము లభించినది. దేవా, నాకేల! పూర్ణసంతుష్టుడనైతి సర్వవాంఛాశూన్యుడనైతి ఆనందభరితుడనైతి” నని ప్రత్యుత్తర మిచ్చెను.

144 వ కథ.

ఒకజ్ఞానిచెంతకుఁ భార్య మిగుల దుఃఖించుచుఁ బోయి "ఆర్యా మన యేకపుత్రుఁడు జచ్చెను" అని యేడువసాగెను. అంతఁ జ్ఞానికంఠమునుండి కన్నులు కాల్వలై పారెను. అప్పుడు దగ్గరనున్న శిష్యుడు తనగురువు దుఃఖించుటజూచి గురువుకంటె నెక్కువగా నేడ్చెను. అంతట గురువు శిష్యుని జూచి "శిష్యరత్నమా, నీవెందుకు దుఃఖించుచున్నా" వని యడిగెను. శిష్యుడు "గురువరా, నామెందుకు ఏడ్చుచుంటిరో తెలియ సెలవిండు" అని యడుగ గురువు "ఓరీ, నాపుత్రుఁడు చచ్చెనని నేనేడ్చుచున్నట్లు నీవు భావించితివేని అట్లు కాదు. నాపుత్రునివాఁడు జన్మించి సుఖించుఁవారల ముజ్ఞానమును జూచి యార్యా నేనింతకాలము భోగించిన దంతయు నిష్ప్రయోజన మయ్యెగదా యని దుఃఖించితిని గాని మఱియొకటి కాదు. యిక నీవేడ్చుటకేమి కారణమో చెప్పుము" అని పలుకఁ శిష్యుడు "దేవా మీవంటి జ్ఞాన సంపన్నులకింకను నేను నాది యను అహంకారము

కారము లించుకయుండి యిప్పుడు దుఃఖమునకు గారణ మయ్యెగదా యని దుఃఖించితిననెను. అప్పుడు గురువు తన శిష్యుడు తనకన్న మించినవాడయ్యెనని సంతసించెను.

145 వ కథ.

ఒకరాజు తన మంత్రికి లక్షరూపాయలు నిచ్చి సన్యాసులకుఁ బంచిపెట్టుమని యాజ్ఞాపించెను. బుద్ధిశాలియగు నామంత్రి సరే యనిపోయి మరునాడు తిరిగి యా ధనరాశి నంతయు రాజాయెదుటఁ బెట్టి "రాజేంద్రా నాకెవ్వరును సన్యాసులు గన్పించరే" యనెను. రాజాశ్చర్యమున "యేమి సన్యాసులే కనుపించలేదా! మనపురమందు వేలకొలఁది సన్యాసులుండ నొక్కఁడైన గాన్పించలేదని బలుకుట కడు వింతగా నున్నది" యనెను. అప్పుడామంత్రి "దేవా! నిజమైన సన్యాసి ధనముఁ స్వీకరించడు. ధనముఁ స్వీకరించువాడు సన్యాసి కాడు. గాన మీ రిచ్చిన ధనము నెట్లు వినియోగ పరచవలసినది నాకుఁ దెలియక తిరిగి తెచ్చితి" ననెను. రాజు మంత్రియొక్క బుద్ధికుశలతకుఁ సంతసించెను.

146 వ కథ

ఒకానొకరాజు గలడు ఆరాజు తనయాస్థానపండితుని కీమూడుప్రశ్నల నిచ్చెను.

1. దేవుడెక్కడ కూర్చుండును ?

2. దేవుఁ డేదిక్కు జూచుచుండును ?

3. దేవు డేమిచేయుచుండును ?

ఈ ప్రశ్నలకు సదుత్తరము నివ్వనిచో శిరచ్ఛేదనము చేయింతునని యాజ్ఞాపించెను. అంత నాపండితుడు మిగుల భయముగలవాడై 10 దినములు సావకాశమడిగి యింటికి బోయి యేమియుదోచక మంచమెక్కెను. ఇట్లుండ జ్ఞాన సంపన్నుఁడగు నాపండితుని సేవకుడు తనయజమానుని దుఃఖమునకు గారణము దెలిసుకొని, పండితుని యూరడించి రాజుచెంతకుఁ దానుబోయెను. చింకిగుడ్డలు కట్టుకొని కడుమూఢునివలె నున్నయాసేవకుని జూచి రాజు ఆశ్చర్యముజెంది నీవెందుకు వచ్చితివనెను. సేవకుడు ఓభూపాలాగ్రణీ, మీరు మాయజమానునకిచ్చిన ప్రశ్నల కుత్తరముఁ

జెప్పుటకు వచ్చితిని. మా యజమానుడు జబ్బుగానున్నందున నన్నుబంపించెను. ఇది మీకిష్టమేనా యనెను. రాజు « ఓహో! యిష్టమైననేమి. కాని నీవు చెప్పలేనిచో ప్రాణములు గోల్పోవుటకు సిద్ధముగానుంటివా యనెను అంత సేవకుడు సిద్ధమే గాని నేనొకకోరిక మిమ్ములఁ గోరుచున్నాను. బోధకుడున్నతస్థానమందును, బోధింపబడువాడు క్రిందను కూర్చుండుట శాస్త్రసిద్ధము. అది మీకు సమ్మతమైనచో నేను చెప్పునంతవరకుఁ మీసింహాసనము నాకిచ్చి మీరు క్రిందఁ గూర్చుండవలె ననెను. రాజు అందుకంగీకరించి యాసేవకునిఁ సింహాసనముపైఁ గూర్చుండఁబెట్టి తాను క్రిందఁ గూర్చుండెను. అప్పుడు సేవకుడు కొన్నిపాలఁ దెప్పించి « రాజా యిందు వెన్న యున్నదా లేదా? చెప్పవలెననెను. రాజు « ఉన్నదనెను సేవకుడు ఎచటనున్నదో చెప్పవలె ననెను. రాజు కొంచెమాలోచించి అంతటా యున్నదనెను. సేవకుడు, భగవంతుడును అదేవిధమున నంతట నున్నాడని చెప్పెను. పిమ్మటఁ ఒకదీపము వెలిగించి « రాజా యీ

దీపము యేవైపు ప్రకాశించుచున్న దనెను. రాజు అగ్నివై పునఁ బ్రకాశించుచున్న దనెను. అప్పుడు సేవకుఁడు భగవంతుఁడును ఇక్కడ చూచుచున్నాడని చెప్పెను. పిమ్మట దేవు సేవచేయుచుండు నతఁడు మూడవప్రశ్నకు నిట్లుఁ జెప్పెను. "రాజా యిప్పుడు నీ వెచట నున్నావు? రాజ సింహాసనముపై నున్నావు అనెను. సేవకుడు రాజా నీ వి చటచున్నావు? అనెను. రాజు నేను క్రిందనున్నాననెను. అంతఁ సేవకుడు రాజా భగవంతుడు రాజునిఁ సేవకునిగను, సేవకుని రాజునిగను, ధనవంతుని దరిద్రునిగను, దరిద్రుని ధనవంతునిగను, కీర్తివంతుని కీర్తిహీనునిగను, కీర్తిహీనుని కీర్తివంతునిగను, యెప్పుడును మార్పులనుఁ జేయుచుండునని చెప్పెను. అంత రాజు మిగులఁ సంతసించి వానికిఁ తగు బహుమాన మిచ్చిపంపెను.

147 వ కథ.

పరీక్షిన్మహారాజునకు శ్రీశుకులవారు ఏడుదినములలో తత్త్వోపదేశముఁజేసి ముక్తునిజేసెననెడి భాగవతకథను ఒకఁ

రాజు విని తనపురోహితునిఁ బిలిపించి తనను కూడా ఏడు దినములలో ముక్తునిఁ జేయుమని యాజ్ఞాపించెను. అటులఁ జేయకుండిన యెడల శిరచ్ఛేదనఁ జేయింతునని భయపెట్టెను. పురోహితుడు మిగులఁ భయముజెందినవాఁడై అనుదినము వనశక్తినంతయు నుపయోగించి బోధించుచుండెను గాని రాజునకించుకయును జ్ఞానోదయము కలుగలేదు. పురోహితుడు మిగులఁ దిగులొంది ఏడవదినమునఁ దనజీవితము నేటితోఁ సరిగదాయని కడుదుఃఖముగలవాఁడై భార్యాపుత్త్రులను జూచి దుఃఖింపసాగెను. అప్పుడు ఒక్కతె జ్ఞానసంపన్నురాలగు నాతనికుమార్తె తాను రాజును సమాధానపరతునని తండ్రికి ధైర్యముచెప్పి రాజుచెంతకిద్దరును బోయిరి. పిమ్మట రాజును దర్శించి « రాజా మీరు మాతండ్రికిచ్చిన యాజ్ఞ యేమని యడిగెను. రాజు « శుకులవారు పరీక్షిత్తుకు ఏడు దినములలో బంధవిముక్తునిజేసి ముక్తిసామ్రాజ్య మొందజేసెను. నాకును అట్లే చేయుమని ఆజ్ఞాపించితి ననిచెప్పెను. అంత నాసాక్ష్యమట్లే. రాజా నేను చెప్పినట్లు మీరు చేసినయెడల మీకు దగుసమాధానము గలుగు ననిచెప్ప

రాజునవల కంగీకరించెను. పిమ్మట నాయువతి నొకకత్తిని
నొక పెద్దత్రాడును దెప్పించి నాత్రాటిచే తనతండ్రిని
యొక స్తంభమునకు చేతులుకాళ్ళు ఘట్టిగ బిగించి కట్టెను.
పిదపవారి యాదేశమునఁ రాజును మరియొక స్తంభమునకుఁ
గట్టెను. పిమ్మట నాకత్తిని తండ్రిచేతి కిచ్చి రాజుత్రా
ళ్ళనుఁ గోయు మని చెప్పె... అంతనాతఁడు అయ్యో, యీ
విధమున నేను బంధింపబడియుండ రాజు త్రాళ్ళను గోయు
టెట్లు? అని చెప్ప నామ్మానినీతిలకము ఆకత్తిని రాజుచేతులో
నుంచి రాజా మాతండ్రిని విడిపింపుమని చెప్పెను. అంతఁ
రాజు ఆశ్చర్యముతో ఓహో నేనే బంధింపబడియుండ
నీతండ్రిని విడిపించుటెట్లు? అనియడుగఁ నా జ్ఞానసంప
న్నురాలు "రాజేంద్రా బంధరహితుండగు శ్రీ శుకులు పరీ
క్షిత్తునకు బంధవిముక్తుని జేయగలిగెను గాని సంసారపాశ
ములచేఁ బంధింపఁబడిన మాతండ్రి యిమ్ము బంధములనుండి
యెట్లువిముక్తునిఁ జేయగల్గును? అని హితోపదేశముఁ జేసి
రాజును సంతృప్తుపరచి తండ్రిని మరణమునుండి రక్షించెను.

148 వ కథ.

లోకవిఖ్యాతుండును తపస్సంపన్నుండు నగు చక్రవర్తి శాస్త్రవిచారణఁ జేయుచుండగా "మోక్షము క్షణము లోనే లభింపగలద"ని యొకగ్రంథమునందు గాంచి తన యాస్థానమందుండు పండితులను, శాస్త్రవేత్తలను యీవచనము విశ్వసింపదగినదేనా యని ప్రశ్నించ వారందరు ఏకగ్రీవముగ అందులకేమియు సందేహము లేదని పల్కిరి. అంతఁ నారాజు తన కట్టి మోక్షము క్షణములోఁ లభించునట్లు జేయవలెనని ప్రార్థించ నట్లు చేయలేమని ప్రత్యుత్తర మిచ్చిరి. అందులకుఁ రాజు ఆగ్రహచిత్తుడై వారందరిని గారాగృహమునఁ బడవేసెను. పిమ్మట గనబడిన విరాగులను, సన్యాసులను, బోధకులను రావించి యిట్లే ప్రశ్నించుచు వారును యిట్లే చెప్పుటచే నందరినిఁ గారాగృహమున బంధించుచుండెను. ఇట్లుండ నొకనాడు ఆత్మవిజ్ఞానపూర్ణుండును, మునిశ్రేష్ఠుండును నగు అష్టావక్రుని రాజాచెంతకుఁ భటులు బట్టితెచ్చిరి. అంత రాజుపూర్వమువలెనే

ప్రశ్నింప నాముని క్షణములో ముక్తునిఁ జేయుట కంగీకరించి రాజును దొక ఘోరారణ్యమునకుఁ దీసుకొని పోయెను. అచట రాజును నిలుచుండుట కాజ్ఞాపించి నీవు నాకు దక్షిణ యిచ్చుటకు సిద్ధముగనుంటివాయని యడుగఁ నందులకుఁ రాజు "ఓహో నీవింతటి మహోన్నతపదవినే దయచేయుచుండఁ గురుదక్షిణ కేమితక్కువ! మీరు కోరినదంతయు నిచ్చుటకు సిద్ధుఁడనై యున్నా" నని చెప్పెను. అంత నాతాపసేంద్రుడు "రాజా నీమనస్సును నాకు దక్షిణగా నొసంగు" మని యడిగెను. రాజు అందులకంగీకరించి మనోనాశ్యుండై యుండెను. అంతనిశ్చలుండై నిర్వికల్పసమాధియందు మగ్నుఁడై అఖండసచ్చిదానంద పరబ్రహ్మము పొందెను.

149 వ కథ.

ఒకరాజు అనిత్యములగు విషయసుఖములను రోసి విరాగియై తనయథార్థస్థితినిఁ దెలుసుకొనఁగోరి యొకమునిసత్తము నాశ్రయించి వానివలన సమస్తశాస్త్రములను దెలుసుకొను

చుంచెను. ఇట్లు 12 సంవత్సరములు విద్యనభ్యసించి సమ
స్తవేదాంత రహస్యములం దెలిసికొని పూర్ణుండనైతి నని
దలంచి గురువునకు నమస్కరించి సెలవడిగెను. అప్పు డాతా
పసి "శిష్యా నీ కిప్పటికి అక్షరాభ్యాసమాయిన దని తలం
చుము. నీవు నేర్చుకొనవలసినదంతయు మున్నన్న దని
చెప్ప నారాజు ఆశ్చర్యమునం దెంది మరి 12 సంవత్సరములు
అచటనే యుండి సమస్తయోగములు అభ్యసించి అణిమా
ద్యష్టసిద్ధులను సయితము సాధించి పరిపూర్ణుడనైతి. నదా
యని సంతసించి తిరిగి గురువునకు నమస్కరించి సెల వడి
గెను. అప్పు డాయుపాధ్యాయుడు చిరునగవుతో "శిష్య
రత్నమా నీ వింకను విద్యాపూర్ణుడవు గాలేదు. మరికొన్ని
దినము లుండుమని చెప్పినంతనే రాజు మునుపటికంటె
నాశ్చర్యమునొంది మరి 12 సంవత్సరములు తత్వవిచారణ
యందును స్వస్వరూపానుసంధానమందును వినియోగించి
తననిజస్థితిని దెలుసుకొని బ్రహ్మానందమగ్నుడై లేచి గురువునకు
నమస్కరించక నే నిశ్చలుండెను. అప్పు డాఋషిపుంగ

వరుడు వానిం జూచి “శిష్యరత్నమా నీవు నాసెలవునైకొ నక నాకు నమస్కరించకనే బోవుచుంటివి ఇది న్యాయమేనా? యనెను. అంత నాశిష్యుండు ఈయనంతకోటిరూపములును నారూపములే యైయుండ నే నెవనికి నమస్కరింతును అని చెప్ప నాతాపసేంద్రుడు నీ శిష్యుడుగదా పూర్ణజ్ఞానివైతి వని మెచ్చి పలుకుల సంతసించెను.

150 వ కథ.

శంకరులవారు గంగానదిలోఁ స్నానముఁజేసి తన నాశ్రమమునకుఁ వచ్చుచుండగాఁ ద్రోవలోఁ బ్రహ్మజ్ఞాని యగునొకమాలవా డెదురువచ్చెను. అప్పుడు శంకరులు “ఓరీ చండాలా యెంత నిర్భయముగ నెదురకుఁ వచ్చితివి! పో దూరముబొమ్ము” అని పలికెను. అప్పు డాబ్రహ్మవేత్త చిఱునగవుతో ఓసాధుపుంగవా, నీవు దూరముగా తొలఁగు మనునది ఈస్థూలశరీరమునా, సూక్ష్మశరీరమునా, లేక ఆత్మనా? స్థూలశరీరము నైనచో నీశరీరమును నాశరీరమును గూడ పంచభూతాత్మకములే గదా! సూక్ష్మశరీరము నైనచో

మనోమయుమైనది గనుక నీవెంత నిష్కళంకమైనవో నాదియు నంతనిష్కళంకమైనదే సుమా! ఆ స్వరూపమనఁబో నది సర్వవ్యాపకమై యచంచలమై యున్నది. గావున నీవెందు కేనిని తొలఁగమంటివో చెప్పుమన శంకరులు యాత్రికు బ్రహ్మవేత్తయని గ్రహించి « బ్రహ్మజ్ఞానియగువాఁడు బ్రాహ్మణుఁడైనను ఛండాలుఁడైనను నాగురువుగా భావింతు నని చెప్పి యాత్రికునకు సాష్టాంగదండప్రమాణ మాచరించి వెడలిపోయెను.

151 వ కథ.

నాస్తికుఁడగు నొకానొక గొప్పశాస్త్రజ్ఞుఁడు, తత్త్వవేత్తయు బ్రహ్మజ్ఞానియు నగు సోక్రటీసుతో నీవు దేవుఁడు దేవుఁడన్న వాఁడెక్కడనున్నాఁడోయని భూమండలమంతయు వెదకితిని సూర్యమండలము చంద్రమండలము నక్షత్రమండలమంతయు మిక్కిలి శ్రేష్ఠతరమగు దుర్బిణీయంత్రములతో బారఁజూచితిని గాని యెక్కడను గన్పించఁడే యనెను. అంతట సోక్రటీసు « నీవు, మరియొక యంత్రముతో జూచుట మఱచితివి

సుమా! అనిచెప్ప నాశాస్త్రిజ్ఞుడు ఆయంత్రమేమని యడి గెను. అంతటాతత్వవేత్త భక్తి, విచారణ, వైరాగ్యము లనెడి యద్దములను మనస్సనెడి యంత్రమునకు సమర్చి జూచినయెడల భగవంతుడు తప్పక గోచరించును అనిచెప్ప నాశాస్త్రిజ్ఞుడు వానికి శిష్యుడై భగవంతుని యథార్థస్థితి దెలుసుకొని నిశ్చలానందమున నుండెను.

153 వ కథ.

నొకానొక బ్రహ్మజ్ఞాని, సర్వదా ప్రాపంచకసుఖముల యందే కాలముగడుపుచున్న నొకరాజు పట్టణమునకుఁ వచ్చెను. రాజు ఆమహాపురుషుని కీర్తి విని వానిం జూడ దలంచి తనయాస్థానమునకుఁ రావించి తనప్రక్కనే గూర్చుండనియమించెను. గాని యాతపోధనుడు రాజువంక నైన జూడక వానితో నొక్కమాటయైన ముచ్చటించక యచట నున్న సేవకులతో ముచ్చటించు చుండెను. రాజాతని విప రీతకృత్యమునకును తనకుఁ జేసిన యవమానమునకును కోపో ద్దీపితుడై యాబ్రహ్మవేత్తను శిరచ్ఛేదనచేయుమని యాజ్ఞాపిం

చెను. అప్పుడామహనీయుడు "రాజా నీలో మెచ్చుటిం చక, నిన్ను గౌరవించక నీసేవకులతోడనే కాలముగడపి నందున నాకు శిరచ్ఛేదన విధించితివిగదా! రాజులకెల్లను రాజైన భగవంతుని స్వప్నమునందైనను దలంచక దుచ్ఛములగు నిహలోక సుఖములయందే కాలముబుచ్చుచున్న నీకు సర్వేశ్వరు డెట్టిశిక్షను విధించునో తెలియుకుంటివి గదా?" యనెను. అంత నారాజు తనయవివేకమును దెలిసుకొని పశ్చాత్తాపమునొంది నాబ్రహ్మవేత్తపాదములపైఁ బడి యాతని యనుగ్రహమునుఁ బొంది సన్మార్గుడయ్యెను.

153 వ కథ

ఒకగ్రామమునం దొకసన్యాసి మఠముకట్టించుకొని అందు నివసించుచుండెను. ఆయనకుఁ బ్రతిదినము అక్కడకుఁ సమీపమునయున్న యొకపల్లెటూరునుంచి యొకగొల్లది భక్తిశ్రద్ధలతోఁ పాలుఁ దెచ్చి యిచ్చుచుండెను. ఇట్లుండఁ నొకనా డాగొల్లది వేళతప్పివచ్చుటచేఁ నేడింత యాలశ్యముగ నేలవచ్చితి వని సన్యాసి యడిగెను. అప్పు

డామె "స్వామీ యేఱు దాటించువా డాలస్యముగఁ వచ్చు టచేఁ వాడు వచ్చువరకుఁ గాచుకొనియుంటి" యని చెప్పెను. అప్పుడాసన్యాసి "ఓహో యేఱు దాటుటకు ఒకరు దాటించవలయునా? రామనామము నుచ్చరించి దాటలేకుంటివా?" యని పరిహాసమునఁ బల్కెను. మరునాడు ఆగొల్లది ప్రతిదినముకంటె ముందుగాఁ వచ్చి సన్యాసికి నమస్కరించి "తండ్రీ, మీరు నాకుఁ మిక్కిలి యుపకారముఁ జేసినారు. ఇక నెన్నటికిని యేఱుదాటుటకు డబ్బు ఖర్చు లేకనే యుండెడి యుపాయమును నేర్పితిరి." అని చెప్ప నాసన్యాసి ఆశ్చర్యమున "నే నేమియుపాయముఁ జెప్పితి" ననెను. అంత నాగొల్లది "స్వామీ, మీ రప్పుడే మరచితిరా! నిన్ననేగదా మీరు పరమపావనమగు రామ మంత్రప్రభావమునుఁ జెప్పితిరి! నే నామంత్రోచ్చారణఁ జేసి నిమిషమాత్రంబున యేఱుదాటితినని చెప్పఁ నాసన్యాసి మరింత నాశ్చర్యము జెంది "ఆహా, యేమి దీనివాక్యములు! దీనిని బరీక్షింపవలె నని గొల్లదానిని ముందు నడువమని తా

ము

వెనుకఁ రామనామము నుచ్చరించుచు నదిలోఁ దిగెను గాని పాపము మునుగుచుండెనే గాని తేలదయ్యె. అంత నాగొల్ల వానితోఁ అయ్యో ఇదేటి యాశ్చర్యము, నీవు నీటిపైఁ స్వేచ్ఛగాఁ బోవుచుంటివి గాని నేను మునుఁగుచుంటిని! అని బలుకఁ నాగొల్లది తిరిగిజూచి "ఓహో స్వామీ మీమంత్రమునందే మీకే నమ్మకము లేదే! నమ్మకమేయున్నయె డలఁ మీరా యేటిలోఁ దిగునప్పుడు బట్టలు తడుచునేమో నని పైకిబిగఁగట్టుదురా?" అని చెప్ప నాసన్యాసి సిగ్గుపడి తనకింతనుఁ పూర్ణమైనభక్తివిశ్వాసములుఁ గలుగలేదని చిం తించి తిరిగి పోయెను.

154 వ కథ.

దేశదేశములఁ దిరుగుచుఁ మహోపన్యాసములఁ గావించుచున్న యొక సంఘసంస్కర్త ఒకనాఁడొకయవ ధూతనుఁ జూచి "స్వామీ నేనెన్నియుపన్యాసములు జేసి నను సమస్తశాస్త్రములలో నుండెడి పాండిత్యమంతయు వెదజల్లినను నామత మవలంభించువారు మిక్కిలిస్వల్పము.

మీరువున్నతావునుండి కదలకున్నను సదా ధ్యానమునే ధరించియున్నను మీశిష్యులసంఖ్యకు మేరలేదు. ఇందుకుఁ గారణమే"మని యడిగెను. అందుల కాయవధూత "దీపము బురుగులను తనచెంతకుఁ రమ్మని పిలువకున్నను వేనవేలు దానిచుట్టునుఁ జేరి అందు దుముకుచుందును. పుష్పములు తమయందుండి మకరందమును పానము జేయుమని నాహ్వానముజేయకున్నను తుమ్మెదలు తమంతట దామే బోయి దానినిద్రావి యానందించును. అదేవిధమున నీయందుగల బరమాత్మను బ్రకాశింపజేసిన యెడల నీవు బిలువకున్నను మనుష్యులందరు నీచుట్టునుజేరి నీకుదాసత్వము జేయుచుందురు. మనుష్యులేగాక పంచభూతములు సహితము నీయాజ్ఞకుఁ లోబడియుండును సుమా!" అని జవాబు చెప్పెను.

155 వ కథ.

కార్తికేయు డొకదినమున నొకపిల్లిని గోళ్లతో గాయపరచెను. తరువాత నాత డింటికి వచ్చినతోడనే తన తల్లి

యగు పార్వతీదేవి బుగ్గమీద నొక గాయమును జూచి ఆశ్చర్యపడి, అమ్మా యిదేమి! యీగాయమెట్లు గలిగెను,, అని యడిగెను. అదివిని యాజగజ్జనని “ నాయనా అది నీవల్లనే గలిగినది. నేడు నీవు పిల్లిని గిల్లితివిగదా, ఆగిల్లు నాబుగ్గపై నున్నదని చెప్పెను. కార్తికేయు డాశ్చర్యముతో “ అమ్మాయిదెట్లు ” అని యడుగ “ యీజగమంతయు నాశరీరమే ” యని పార్వతి బదులు చెప్పెను. కార్తికేయుడు విస్మయమొంది “ అమ్మా యికనే వివాహము చేసుకొనను. స్త్రీలందరును నాతల్లిస్వరూపులే యైయుండ, నేవివాహము చేసుకొనుటెట్లు అని తనకాలమంతయు బ్రహ్మచారిగానే యుండెను.

156 వ కథ.

ప్రపంచ మంతయు భగవత్స్వరూపమే యని యొక గురువు బోధించుచుండెను. అది వినుచున్న ఒకశిష్యుడు ఒకనాడు మార్గమున బోవుచుండగా యేనుగొకటి కనుపించెను. యాకటివాడు యెంతచెప్పినను వినక అంతా భగ

వత్స్వరూపమేగదా యేనుగ నన్నేమిచేయును" అని అనుచు దగ్గరకు వెళ్ళెను, గాని పాపమాతనిని నాయేనుగ తొండముతో బట్టి నావల విసరివైచెను. అందుచే ఒడలంతయు దెబ్బలు తగిలి మిక్కిలిబాధతో గురువుల వారి చెంతకు బోయి "స్వామీ మీమాటలునమ్మి మోసపోతిని" అని జరిగిన వృత్తాంతమంతయు చెప్పెను. గురువు వాని యవివేకమునకు విచారించి ఓమూఢా అంతయు భగవత్స్వరూపమే యనిగదా నేను చెప్పితి. మావటివాడు మాత్రము భగవత్స్వరూపము కాదా. అట్టైన భగవంతుడు నిన్ను మూరముగ పొమ్మని చెప్పుచుండ నీవు వినక దగ్గరకు వచ్చినందుకు భగవంతుడే నిన్ను శిక్షించెనని జవాబు చెప్పెను.

157 వ కథ.

పండితమదనమోహన మాళవ్యాగారు ఒకనాటి యుదయమున క్షురకర్మ చేయించుకొనుచు మీసములను గూడ గొరిగించుకొనెను. అప్పుడొక స్నేహితుడు దానిం జూచి

ఆశ్చర్యముతో నిశ్వాసములు దీయుటకు కారణ మడిగెను. అప్పుడా పండిత శ్రేష్ఠుడు "మిత్రమా, భారతభూమి యందు నాసోదరులు పడరాని బాధలు పడుచుండ కన్నులార జూచుచు వారికేయుపకారమును చేయజాలని పురుషత్వ మెందుకని జవాబు చెప్పెను.

158 వ కథ.

వ్యాసులవారు యమునానదిని దాటబోవుచుండగా, కొందరు గోపికలువచ్చి స్వామీ, మేముకూడా దాటవలసి యున్నది. గాని నావగాని దారిగాని యేదియులేదు. యేమి యుపాయమని ప్రార్థించిరి. అప్పుడు వ్యాసులు మంచిది నేను మిక్కిలి యాకలితో నున్నాను. ముందునాకు దినుట కేమైనబెట్టుడు అని యడిగెను. అప్పుడు గోపికలు తమవద్ద యున్న పాలును మీగడను బెట్టిరి. వ్యాసులు వాటిని బొట్ట నిండ నారగించి నదియొడ్డునకు వచ్చి "ఓ యమునా, నేను యీరోజున నిశ్చయముగ ఉపవాసము చేసినవాడనైతి నేని వెంటనే దారినిమ్ము" అని యనెను. తోడనే యమునానది

రెండుభాగములుగా చీలి మధ్యమునదారి యిచ్చెను. గోపికలు ఆశ్చర్యమగ్నులై "దేవా యిదేమివింత మీరు కృష్ణుడేగదా కడుపునిండ తింటిరి. తినలేదని యెట్లు అసత్యము లాడితిరి అని యడిగిరి. అంత యామునిపుంగవుడు "తల్లులారా నేను చేయు కార్యములనన్నింటిని భగవదర్పణము చేయుదును. యీషన్మాత్రమైనను అహంభావము లేక సర్వము భగవదర్పణమును జేసితినిగాని నేనే తిన్నాననెడి యహంకారము నాయందు పూర్తిగ నశించినదని జవాబు చెప్పెను.

159 వ కథ.

గాంధి మహాత్ముడు ఆఫ్రికాదేశము సంచరించగా యీర్ష్యాపూరితుడగు నొక దొర మహాత్ముని శిరముపై కర్రతో కొట్టి పారిపోయెను. అప్పు డమ్మహానీయుని తలబ్రద్దలై రక్తము కాల్వలైబార స్పృహతప్పి నేలపై బడెను. అప్పు డాయన స్నేహితులు వానికి తగుముపచారములు సల్పి స్పృహకు దెచ్చిరి. ఆమహనీయుడు స్పృహకు వచ్చినతోడనే

"యేడీ నన్ను గొట్టినవాడు" అని మెల్లగా నడిగెను. అంత వారు "అయ్యా శాంతింపుడు. మిమ్ము గొట్టిన యా దురాత్ముని బట్టుకొని బంధించితిమి" అని చెప్పిరి. అప్పుడా కరుణానిధి "అహా యేమంటిరి. అతనిబంధించితిరా అతను నామిత్రుడే. నే చేసినపాపములకై నన్ను శిక్షించి పాప విముక్తునిగా జేసిన పుణ్యాత్ముడే. అట్టి నామహోపకారిని మీరు విడచిపెట్టినగాని నేనిక్కడనుండి కదలను" అని చెప్పినంతనే వారాతనిని విడచిపెట్టిరి. తోడనే యాచోర తనపాపకృత్యముకై వగచి యామహాత్ముని నిరుపమాన దయా శీలతకు విస్మయమునొంది వారి పాదములపై బడి క్షమాపణ వేడెను.

160 వ కథ.

శిష్యుడు—గురువర్యా భగవంతుని తెలుసుకున్నవాడె వ్వడు?

గురువు— తెలుసుకొనజాలనని తెలుసుకొన్నవాడే భగవంతుని తెలుసుకొన్నవాడు.

శి—గురువర్యా! భగవంతుని తెలుసుకొననివా డెవ్వడు?

గు—శిష్యా, భగవంతుని తెలుసుకొన్నానని తలంచువాడే తెలుసుకొననివాడు.

161 వ కథ.

ఆంజనేయులు సీతామహాదేవిని వెదుకుటకై లంకకు బోయి తిరిగి వచ్చి రామునితో లంకాపురిని గురించి యిట్లు విన్నవించెను. "ఓ రామా, జగదభిరామా, లంకాపురిని గురించి నేనేమని వర్ణింతును. ఎక్కడ జూచినను జపము లాచరించువారును, తపములు చేయువారును, ఎంత జూచినను యజ్ఞయాగాది క్రతువులు జేయువారును, నిష్ఠతో పూజలు సల్పువారును గాన్పించిరి. స్త్రీలని లేక బాలురని లేక, వృద్ధులని లేక ప్రతివారును వేదపారాయణ జేయుచు వీనులకు విందు గొల్పిరి". ఈమాటలు వినినంతనే శ్రీరాముడు అయ్యో ఆంజనేయా యికనాకు సీత దక్కుట యెక్కడిది! అట్టి తపోనిష్ఠా గరిష్ఠులపై నాబాణము పోజాలదు. అట్టివారిని నేజయించుటెట్లు, సీతనుదెచ్చుటెట్లు

అని విచారముతో బాణమును క్రిందపడవైచెను. అంత నాంజనేయుఁడు «దేవా యాలకింపుఁడు వారెన్ని నిష్ఠలు సలిగినను, యెంతసేపు పారాయణము జేయుచున్నను, యెన్నిజపములు చేసినను, సత్యము, శాంతము, దయ అనెడి సద్గుణములు మాత్రము వారికుండుట శూన్యము" అని చెప్పినంతనే రాముడు మహానందమున నుప్పొంగి ధనస్సు చేబూని «అట్లైన ఆంజనేయా! ధనుముచేతా, ఒక్క బాణముచే లంకాపట్టణము భస్మము చేయగలను. శాంతసద్గుణములు లేక నిష్ఠలెన్ని యొనర్చిన ప్రయోజనము లేదు" అని చెప్పెను.

162 వ కథ

ఒకరాజునకు యొకమంత్రి గలడు. అతను మిక్కిలి సద్భక్తుడు. దేవుని కేమి ఉంచినను అంతయును భగవంతుడు మనమేలునకే చేయునని నమ్మినవాడు. ఒకరోజున రాజు వేటకట్టి బోయి నొకపట్టణమునకు రాదుచుండ ప్రమాదవశమున నొకవేలు తెగిపోయెను, మంత్రి దానిజూచి యప్పటి

యిట్లు "రాజా యిదియును మీమేలుకే భగవంతుడు చేసి
నాడు" నెను. రాజాగ్రహముజెంది మంత్రిని కారాగృహమున
బంధించెను. కొన్ని రోజులు గడచిన పిమ్మట రాజు తిరిగి
వేటకుబోయి దారితప్పి ఒంటరిగా కొండలచేతిక్కెను.
ఆకొండలు శక్తిపూజ చేయువారలు. శక్తిని బలినిచ్చుటకై
నుంచి రూపవంతుడును, బలవంతుడును, అగు మనుష్యుని
కొరకు వెదకుచు రాజును వంటరిగా జూచినంతనె మిగుల
సంతసమంది రాజును బంధించి దేవళముకడకు తీసుకు
పోయిరి. అక్కడ రాజును కూర్చుండబెట్టి నరుకబోవు
నంతలో యాతని యంగములు సరిగ నున్నవో లేవోయని
పరీక్షించి చేతియందు వక్రవేలు నుండుట జూచి అయ్యో!
అంగహీనుడు బలికి పనికి రాడనుచు రాజును విడచి
వెళ్ళిపోయిరి. అప్పుడు రాజు మహదానందము చెంది
మంత్రి చెప్పిన హితవాక్యములు జ్ఞప్తికి వచ్చి అహా! యా
సర్వేశ్వరుడు మనకు చేయునదంతయు మనమేలునకే గదా
యని తలపోయుచు మంత్రిని విడచిపెట్టి అనేక విధముల
సన్మానించెను.

163 వ కథ.

యేసుక్రీస్తులవారియొద్ద కొకడు బోయి అయ్యా భగవంతుని జూచు టెట్లని యడిగెను. అంతయాభక్తాగ్రేసరు డాతని నొక చెరువులోనికి దీసుకునివెళ్ళి తలగట్టిగా బట్టుకుని నీళ్ళలోముంచి కొంచము సేపుంచెను. అప్పుడాతడు గిలగిల తన్నుకొనగా విడచిపెట్టి యిట్లు జవాబు చెప్పెను. "నీవు భగవంతుని జూడదలచిన యడల నీళ్ళలో నీతల ముంచినప్పుడు పైటకు వచ్చుటకు నీవెంత గిలగిల కొట్టుకొంటివో భగవంతుని జూచుటకు అంత పరితపించినగాని గాన్పించడ"ని జవాబు చెప్పెను.

164 వ కథ.

భక్తుడగు నొకబ్రాహ్మణుడు మార్గమున బోవు చుండగా దాహమయ్యెను. అప్పుడొకమనుష్యుడు చేతనొక ముంతతో మంచినీరు దీసికొని పోవుట జూచి యాతని బిలచి అయ్యా కొంచము మంచి నీరిచ్చెదవా యని అడిగెను. అప్పుడా మనుష్యుడు అయ్యా నేను మాలవాడను. మీరు బ్రాహ్మ

ణాలు. నేను తాకిననీరు వీరెట్లు ద్రాగుదురనెను. అంతటా భక్తుడు సోదరా, రామనామము నొక్కసారి వుచ్చరించుము. అది సమస్త దోషములను హరింప జేయును. యెట్టి పాపాత్ముడైనను పవిత్రము జేయును అని వానిచే రామనామ ముచ్చరింపజేసి వానిచేతిలోని నీరు ద్రాగెను.

సమాప్తము.

For Copies Apply to:—

A. JAGAN MOHAN ROY,

Masulipatam.